www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బంగారం.. లకారం!

రూ.లక్షకు చేరువైన పసిడి ధర

11

ఆల్‌టైం రికార్డు గరిష్ఠానికి చేరిక

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బలహీన డాలరే ప్రధాన కారణాలు

ముున్ముందు ధరలు మరింత పైపైకే..!

ఏడాది చివరి నాటికి భారత్‌లో రూ.1.23 లక్షలకు చేరే చాన్స్



మంగళవారం | 22-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 6 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం తిథి: నవమి సా.6.13 తదుపరి దశమి, నక్షత్రం: శ్రవణం మ.12.44 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: సా.4.37-6.11, దుర్ముహూర్తం: ఉ.8.28-9.18, రా.10.14-10.58, అమృతఘడియలు: రా.1.59-3.32, రాహుకాలం: మ.3.00-సా.4.30, సూర్యోదయం: ఉ.5.58, సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజ్ కసిరెడ్డి అరెస్టు



కలుగు నుంచి బయటికొచ్చిన లిక్కర్ డాన్

గోవా నుంచి విమానంలో హైదరాబాద్‌కు.. అట్నుంచి అటే చెన్నైకి వెళ్లాలని పథకం

- ఆపై విదేశాలకు చెక్కేసే యోచన
- విమానాశ్రయం వద్ద 'సిట్' నిఘా
- ఎంతకీ బయటికి రాని రాజ్ కసిరెడ్డి
- లోపలికే వెళ్లి అరెస్టు చేసిన పోలీసులు
- విచారణకు వస్తా, వదిలేయాలని వినతి
- నమ్మలేమంటూ అరెస్టు చేసిన 'సిట్'
- విజయవాడకు తరలింపు..
- నేడు కోర్టు ముందు హాజరు

వైసీపీ హయాంలో మద్యం కుంభకోణాన్ని నడిపించిన రాజ్ కసిరెడ్డి అలియాస్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని 'సిట్' సిబ్బంది పట్టేసుకున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు విచారణకు డుమ్మా కొట్టి... హైకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేసి... 'తప్పించుకుని' తిరుగుతున్న ఆయన ఎత్తును చిత్తు చేశారు. సోమవారం సాయంత్రం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య రాజ్ కసిరెడ్డిని హైదరాబాద్ (శంషాబాద్) విమానాశ్రయంలో అరెస్టు చేశారు. రాత్రికి రాత్రి ఆయనను విజయవాడకు తరలించారు.

రాజ్ ఎత్తుకు సిట్ చెక్

- తండ్రి ద్వారా పోలీసు గేలం.. గోవాలో ఆచూకీ లభ్యం..
- బయలు దేరిన బృందాలు.. కసిరెడ్డిని అలర్ట్ చేసిన వైసీపీ ఖాకీ..
- ఆడియో మెసేజ్‌తో పోలీసుల్ని దారి మళ్లించే ఎత్తుగడ
- హైదరాబాద్‌కు రాజేష్ రెడ్డి పేరుతో టికెట్ బుకింగ్
- చెన్నై వెళ్లి అటు నుంచి విదేశాలకు వెళ్లేందుకు ఎత్తుగడ
- టెక్నాలజీతో సిట్ నిఘా.. శంషాబాద్‌లో అదుపులోకి

అమరావతి/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యం స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. నాలుగుసార్లు విచారణకు డుమ్మా కొట్టిన ఆయన ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించి... చివరకు విజయం సాధించారు. శుక్రవారం రాజ్ తండ్రి ఉపేందర్ రెడ్డిని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. విచారణ ముగిసిన వెంటనే... 'పోలీసులు ఏం అడిగారు?' అంటూ రాజ్ తన తండ్రిని వాట్సాప్ ద్వారా ఆరా తీశారు. అప్పటికే ఉపేందర్ రెడ్డి ఫోన్‌పై నిఘా వేసిన 'సిట్' సిబ్బంది... ఆ మెసేజ్ గోవా నుంచి వచ్చినట్లు గుర్తించారు. 'లొకేషన్' తెలియడంతో... గోవాకు వెళ్లి ఆయనను పట్టుకొచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం విజయవాడ నుంచి ఒక బృందం గోవాకు చేరుకుంది. అయితే... జగన్ హయాంలో 'వైపీఎస్'గా పని చేసిన ఒక పోలీసు అధికారి వెంటనే రాజ్ కసిరెడ్డిని అప్రమత్తం చేసినట్లు సమాచారం. మరోవైపు... ఎంపీ మిథున్ రెడ్డికి కల్పించినట్లు తనకూ అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పించాలని ఆయన వేసిన పిటిషన్‌పై విచారణను

మిగతా 12వ పేజీలో...

రాజ్ కసిరెడ్డికి దొరకని ఊరట

- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- కేసు వివరాలు ఇవ్వాలని సీఐడీకి ఆదేశాలు
- ఇంటి వద్దే విచారించేలా ఆదేశాలివ్వండి
- మరో పిటిషన్‌లో ఆయన తల్లిదండ్రుల వినతి



12



పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం

- ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన మరుసటి రోజే తుదిశ్వాస విడిచిన పోప్
- శ్వాసకోశ సమస్యలతో ఇటీవల ఆస్పత్రిలో..
- భారత్‌లో మూడు రోజులు సంతాప దినాలు

వాటికన్ సిటీ, న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): క్యాథలిక్ మతపెద్ద, రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరు. ఆదివారం ఈస్టర్ సందేశం ఇచ్చిన ఆయన ఇటలీ కాలమానం ప్రకారం.. సోమవారం ఉదయం 7.35 గంటలకు వాటికన్ సిటీలోని తన కాసా శాంటా మార్టా నివాసంలో తుది శ్వాస విడిచారని వాటికన్ ప్రకటించింది. ఫ్రాన్సిస్ శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యుమోనియాతో ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరి 38 రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. ఆపై కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఆదివారం సెయింట్ పీటర్ స్క్వేర్‌లో ప్రజలకు స్వయంగా ఈస్టర్ శుభాకాంక్షలు కూడా చెప్పారు. భక్తులకు ఈస్టర్ సందేశం అందించారు. మరుసటి రోజే ఆయన తుదిశ్వాస విడిచారు. గుండె పోటుతో ఆయన మరణించినట్లు ఇటలీ వార్త సంస్థలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రాలేదు. కాగా, ఈస్టర్ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. ప్రధాని మోదీ 2021, 2024లో ఫ్రాన్సిస్‌ను

మిగతా 2వ పేజీలో...

మన జోన్‌పై 'రైల్వే' రివర్స్!

- ముందు ఆపరేషన్లు.. ఆ తర్వాత నిర్మాణాలు
- జోన్ల విషయంలో రైల్వేశాఖ విధానమిదే
- రాయగడ కొత్త డివిజన్‌లోనూ ఇదే ప్రక్రియ
- కానీ, విశాఖలో మాత్రం భిన్న వైఖరి
- ఆపరేషన్స్ ప్రారంభంలో చిత్తశుద్ధి లోపం
- ఒడిశా లాబీయింగ్ పనేనని అనుమానాలు
- రైల్వే మంత్రి కూడా అక్కడివారే
- జోన్ శంకుస్థాపనకూ అశ్వినీ వైష్ణవ్ దూరం
- ఎంపీలు గట్టిగా అడగలేకపోవడం వల్లేనా?



విశాఖ రైల్వేస్టేషన్ వెలుపల నిర్మాణం పూర్తిచేసుకున్న రెండు నాలుగు అంతస్తుల భవనాల్లో ఇదొకటి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించడానికి రైల్వేశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. రెండేళ్లలో జోనల్ కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి, ఆ తరువాత ఆపరేషన్లు ప్రారంభిస్తామని సాకులు చెబుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన రైల్వే జోన్లలో ఎక్కడ కూడా ఇలా జరగలేదు. ముందు కార్యకలాపాలు మొదలుపెట్టి

మిగతా 13వ పేజీలో...

పింక్ బుక్ జాడేదీ?

3 నెలలైనా విడుదల చేయని రైల్వే శాఖ

3



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎంపీలు వేమిరెడ్డి, కృష్ణప్రసాద్ తదితరులు

ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు

నేడు అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు

- సభా ప్రాంగణానికొచ్చే రోడ్లకు మెరుగులు
- ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చర్యలు
- సభికులకు అల్పాహారం, తాగునీరు, మజ్జిగ పండ్లు, భోజనం.. 10 పార్కింగ్ స్థలాలు
- 29వ తేదీ నాటికి మొత్తం ఏర్పాట్లు పూర్తి
- మే 2న అమరావతికి ప్రధాని శంకుస్థాపన
- ఏర్పాట్లపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. మే 2వ తేదీన రాజధాని అమరావతి శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన ఏర్పాట్ల నిమిత్తం

మిగతా 13వ పేజీలో...

ఇప్పటికే మాపై విమర్శలు

కార్యనిర్వాహక వ్యవస్థ అధికారాల్లోకి చొరబడుతున్నామని ఆరోపణలు

- పశ్చిమ బెంగాల్‌లో అల్లర్లపై నివేదిక కోరాలన్న పిటిషన్ మీద కాబోయే సీజేఐ గవాయ్ వ్యాఖ్యలు
- ఓటీటీ, సోషల్ మీడియాలో అశ్లీలతను నిలువరించాలన్న పిటిషన్‌పైనా ఇదే తరహాలో..
- కేంద్రమే నిబంధనలు రూపొందించాలని వ్యాఖ్య



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ముర్షిదాబాద్ అల్లర్ల నేపథ్యంలో బెంగాల్లో పరిస్థితిపై రాష్ట్రపతి ఆర్టికల్ 355 కింద నివేదిక కోరాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం పరిశీలించనుంది. కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు సోమవారం న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ఈ అంశాన్ని తీసుకొచ్చారు. 2022లో బెంగాల్లో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి తన పిటిషన్ మంగళవారం విచారణకు వస్తోందని గుర్తు చేశారు. తాజాగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో హిందువులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కేంద్ర పారా మిలిటరీ బలగాలను రంగంలోకి దించాలని, ముగ్గురు పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో ఈ హింసపై దర్యాప్తు జరిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముర్షిదాబాద్ అలర్లపై ఆర్టికల్ 355 కింద నివేదిక తెప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్

మిగతా 2వ పేజీలో...

1.20 కోట్ల ఉపాధి కూలీలకు ప్రమాద బీమా

13



వంట నూనె తాగేస్తున్నాం!

- దేశంలో ఏటా తలసరి వినియోగం 24 కిలోలు
- 2001తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ
- ఐసీఎంఆర్ సిఫారసు పరిమితి 12 కిలోలే
- అధిక వాడకంతో ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు.. అనారోగ్య సమస్యలు
- నూనెకు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి

2

రేపు పదో తరగతి ఫలితాలు

14

ఉదయం 10 గంటలకు విడుదల

పెరిగిన ఎండ

మరో వారం వరకు భగభగలే

14

వాతావరణ అనిశ్చితితో అక్కడక్కడా వర్షాలు

వాణిజ్య చర్చలు భేష్

ఉభయులకూ లాభదాయకంగా ఒప్పందం కుదుర్చుకుంటాం

- ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- 4 రోజుల భారత పర్యటనకు కుటుంబంతో వచ్చిన వాన్స్
- ఉపాధ్యక్షుడిగా ఆంధ్రా అల్లుడి తొలి అధికారిక పర్యటన
- భారతీయ వస్త్రధారణలో వాన్స్-ఉష పిల్లలు
- తొలిరోజు ఢిల్లీలో మోదీతో భేటీ, విందు ఇచ్చిన ప్రధాని
- పిల్లలకు ఇల్లంతా చూపి నెమలి ఈకలు కానుకిచ్చిన మోదీ
- నేడు, రేపు జైపూర్, ఆగ్రాల సందర్శన, అట్నుంచే అమెరికాకు



ప్రధాని మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా చిలుకూరి, కుమారులు ఎవాన్, వివేక్, కుమార్తె మిరాబెల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఇరు దేశాలకు లాభదాయకంగా ఉండే వాణిజ్య ఒప్పందం దిశగా భారత్, అమెరికా అధికారుల మధ్య జరుగుతున్న చర్చలు చెప్పుకోదగ్గ ప్రగతి సాధించడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వాగతించారు. సోమవారం వారిద్దరూ ప్రధాని నివాసంలో ఇరు దేశాల అధికారులతో కలిసి రక్షణ, ఇంధనం, వ్యూహాత్మక సాంకేతిక పరిజ్ఞానంలో మరింత సహకారం గురించి విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం మోదీ వాన్స్ కుటుంబానికి విందు ఇచ్చారు. ఆంధ్రా అల్లుడైన జేడీ వాన్స్ తన భార్య ఉషా చిలుకూరి, ముగ్గురు పిల్లలతో ఈ విందుకు హాజరయ్యారు. చర్చల సందర్భంగా మోదీ అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదే ట్రంప్ భారతదేశ పర్యటనకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ, వాన్స్ అనేక జాతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. రష్యా-ఉక్రెయిన్ సమస్యను ఇరు దేశాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న అభిప్రాయాన్ని మోదీ, వాన్స్‌లు వ్యక్తం చేశారు. ట్రంప్ తలపెట్టిన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ లాంటిదే తాను తలపెట్టిన వికసిత్ భారత్ అని మోదీ గుర్తు చేశారు. తన కుటుంబం పట్ల మోదీ కనబరచిన ఆదరాభిమానాలపై వాన్స్ సంతోషం వ్యక్తం చేశారు. భారత ప్రజలతో స్నేహం, సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇరు దేశాలకూ లాభదాయకంగా ఉండే సహకారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ ప్రకటించారు. వాన్స్ తన కుటుంబం, అధికారులతో కలిసి ఎయిర్‌ఫోర్స్ 2 విమానంలో ఉదయం 9.50 గంటలకు ఢిల్లీలో దిగారు. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వారికి స్వాగతం పలికారు. ఆయనతోపాటే వచ్చిన కుమారులు ఎవాన్(8), వివేక్(5), కుమార్తె మిరాబెల్(4) ప్రత్యేక ఆకర్షణగా

మిగతా 2వ పేజీలో...

పోప్ ఫ్రాన్సిస్ అస్తమయం



(మొదటి పేజీ తరువాయి)

కలిసి భారతదేశానికి ఆహ్వానించారు. పోప్ ఫ్రాన్సిస్ వచ్చే ఏడాది భారతదేశాన్ని రావాల్సి ఉండగా, ఇంతలోనే ఆయన మరణించడం బాధాకరం. కాగా, ఫ్రాన్సిస్ మృతి పట్ల భారత ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. మంగళవారం, బుధవారం, అలాగే ఫ్రాన్సిస్ అంత్యక్రియలు నిర్వహించే రోజు సంతాప దినాలు పాటించాలని తెలిపింది. కాగా, 1937లో పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనాలో జన్మించారు. పోప్ బెనడిక్ట్ తర్వాత 2013లో ఫ్రాన్సిస్ 266వ పోప్‌గా బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ ప్రజల పోప్‌గా పేరు తెచ్చుకున్నారు. పోప్ ఫ్రాన్సిస్ సామాజిక అంశాలపై ఆయన మాట్లాడుతుండే వారు. కాగా, దక్షిణ అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన తొలి వ్యక్తి ఫ్రాన్సిస్ కావడం విశేషం. పోప్ అంత్యక్రియల ప్రక్రియలో ఫ్రాన్సిస్ కొంతకాలం క్రితం కొన్ని మార్పులు చేశారు. వాటికన్ సిటీ వెలుపల కూడా పోప్‌ను సమాధి చేసేలా ఆయన మార్పులు చేశారు. ఫ్రాన్సిస్ తనను బాసిలికా ఆఫ్ శాంటా మరియా మ్యాగోరియాలో సమాధి చేయాలని కోరుకున్నారు. పోప్ మరణాన్ని ధ్రువీకరించిన తర్వాత ఆయన ఉంగరాన్ని ధ్వంసం చేస్తారు. పోప్ పార్థివ దేహాన్ని బాసిలికా ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. ఆపై ఆచారాల ప్రకారం పోప్ పార్థివదేహాన్ని ఖననం చేస్తారు. పోప్ చనిపోయిన తర్వాత 4 నుంచి 6 రోజుల్లో అంత్యక్రియలు పూర్తిచేస్తారు. అంత్యక్రియల తర్వాత 9 రోజులు సంతాప దినాలు పాటిస్తారు. అవి పూర్తయ్యాక తదుపరి పోప్ ఎన్నిక ప్రక్రియ మొదలు పెడతారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల భారత్ క్యాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్‌తో పాటు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విదేశాంగ మంత్రి జైశంకర్, ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ తదితరులు సంతాపం ప్రకటించారు. ఫ్రాన్సిస్ మరణంతో తదుపరి పోప్ ఎవరనే చర్చ మొదలైంది. తదుపరి పోప్ రేసులో ఇటలీకి చెందిన 70ఏళ్ల కార్డినల్ పిట్రో పెరోలిన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోకు చెందిన 65ఏళ్ల కార్డినల్ ఫ్రీడోలిన్ అంబోంగో బెసుంగు, ఇటలీకి చెందిన 69ఏళ్ల కార్డినల్ మెట్టో పేర్లు వినిపిస్తున్నాయి.

పోప్ ఎంపిక విధానం?

పోప్ ఎన్నికకు రహస్య ఓటింగ్ నిర్వహిస్తారు. 80 ఏళ్ల లోపు వయసున్న కార్డినల్స్ ఈ ఓటింగ్‌లో పాల్గొంటారు. మొత్తం 252 మంది కార్డినల్స్‌లో 138 మందికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. రోజుకు నాలుగు రౌండ్ల ఓటింగ్ చొప్పున ఎవరైన అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చేవరకు ఓటింగ్ జరుగుతుంది. ప్రతి సెషన్‌లో బ్యాలెట్ పేపర్లకు నల్లటి పొగ వెలువడే రసాయనాలు కలిపి కాల్చుతారు. ఆ సమయంలో ఏ అభ్యర్థి పేరు బ్యాలెట్ పేపర్ కాల్చుతుండగా తెల్లటి పొగ వస్తుందో ఆ అభ్యర్థి పోప్‌గా ఎన్నికైనట్లు. పోప్ ఎన్నికలో ఆరుగురు భారత కార్డినల్స్‌కు ఓటు వేసే అర్హత ఉంది. వారు కార్డినల్ ఫిలిప్ నెరీ ఫెర్రో(72), కార్డినల్ క్లెమిస్ బెసిలియోస్(64), కార్డినల్ అంథోని పూల(63), కార్డినల్ జార్జ్ జాకోబ్ కూవకడ్(51), కార్డినల్ ఓస్వల్డ్ గ్రెసియస్(80), కార్డినల్ జార్జ్ అలెంచెరీ(79).

ఇప్పటికే మాపై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

స్పందిస్తూ, "ఇప్పుడు మమ్మల్ని మీ బాధ్యత మీరు నిర్వర్తించాలంటూ రాష్ట్రపతికి రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయమంటారా? ఇప్పటికే మేం కార్యనిర్వహణ అధికారాల్లోకి చొరబడుతున్నామని విమర్శలు వస్తున్నాయి" అని ప్రస్తావించారు. తమిళనాడు గవర్నర్ నిలిపేసిన బిల్లులన్నీ ఆమోదం పొందినట్లేనని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకొని జస్టిస్ గవాయ్ ఈ విధంగా స్పందించారని భావిస్తున్నారు. అయితే, తాజా పిటిషన్‌ను మంగళవారం లిస్ట్ చేయడానికి జస్టిస్ గవాయ్ అంగీకరించారు. ఓటీటీల్లో, సోషల్ మీడియాలో అశ్లీల దృశ్యాలను నిలువరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విషయంలోనూ జస్టిస్ గవాయ్ ఇదే విధంగా స్పందించారు. "ఎవరు నియంత్రించ గలరు? కేంద్రమే నియమ నిబంధనలు రూపొందించాలి. మేం పూనుకుంటే కార్యనిర్వాహక అధికారాల్లో చట్ట సభల అధికారాల్లో జోక్యం చేసుకున్నారంటారు" అని మరోసారి అన్నారు.

ఇక ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాల విడుదల

ముంబై, ఏప్రిల్ 21: కేంద్ర ప్రభుత్వం ఇక నుంచి ప్రతి నెలా నిరుద్యోగ గణాంకాలను వెల్లడించనుంది. వచ్చే మే 15 నుంచి నెలవారీ ప్రాతిపదికన ఈ గణాంకాలను విడుదల చేయనున్నట్టు సీనియర్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. ఇంతకు ముందు మూడు నెలలకు ఒకసారి నిరుద్యోగ గణాంకాలను విడుదల చేసేవారు. మే 15న విడుదల చేసే గణాంకాల్లో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. ఆ తర్వాత ప్రతి నెలా గణాంకాలను విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు మూడు నెలలకు ఒకసారి పట్టణ నిరుద్యోగ గణాంకాలను కేంద్ర ప్రభుత్వం వెల్లడిస్తోంది. గ్రామీణ, పట్టణ నిరుద్యోగానికి సంబంధించిన డేటాను వార్షికంగా వెలువరిస్తోంది.

ఉక్రెయిన్‌తో చర్చలకు సిద్ధం: పుతిన్

మాస్కో, ఏప్రిల్ 21: ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు సహకరించాలంటూ అమెరికా.. రష్యాపై ఒత్తిడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌తో చర్చలు జరిపేందుకు తాను సిద్ధమని సోమవారం పుతిన్ చెప్పారు. అనేక సంవత్సరాల తర్వాత ఆయన ఇలాంటి ప్రకటన చేయడం ఇదే తొలిసారి. ఇక ఈస్టర్ సందర్భంగా రష్యా ఒక రోజు కాల్పుల విరమణను పాటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి కాల్పుల విరమణలు మరిన్ని పాటిచేందుకు కూడా సిద్ధమని పుతిన్ పేర్కొన్నారు. శాంతి స్థాపనకు రష్యా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఉక్రెయిన్ నుంచి కూడా అదే ఆశిస్తున్నామని తెలిపారు. పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా స్పందించలేదు.

పందులతో కుస్తీపడితే.. మనం
మురికి అవుతాం

▸ దూబే వ్యాఖ్యలపై ఖురేషీ పరోక్ష విసుర్లు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: సుప్రీంకోర్టు, చీఫ్ జస్టిస్‌పై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన తీవ్ర వ్యాఖ్యల దుమారం మరింత ముదురుతోంది. దూబే వ్యాఖ్యలను మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్‌వై ఖురేషీ తప్పుపట్టగా, ప్రతిగా ఖురేషీపై దూబే 'ముస్లిం కమిషనర్' అంటూ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. దీంతో దూబేపై ఖురేషీ పరోక్షంగా, ప్రత్యక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దూబే పేరును ప్రస్తావించకుండా.. "చాలా ఏళ్ల కింద నేను ఒకటి తెలుసుకున్నాను. పందులతో ఎప్పుడూ కుస్తీ పట్టకూడదు. అలా చేస్తే మనం మురికి అవుతాం. అంతేకాదు.. మనను ఇలా మురికి చేయడం ఆ పందికి ఇష్టం కూడా..' అని జార్జ్ బెర్నార్డ్ షా చెప్పిన సూక్తి చాలా గొప్పది" అని సోమవారం ఉదయం ఎక్స్‌లో పోస్టు చేశారు. తర్వాత మీడియాతో ఖురేషీ మాట్లాడారు. "కొందరు విద్వేష రాజకీయాలు చేసేందుకు మతపరమైన గుర్తింపును పావుగా వాడుకుంటున్నారు. కానీ భారత్ ఎప్పుడూ రాజ్యాంగ వ్యవస్థలు, సూత్రాల కోసం నిలబడుతుంది. పోరాడుతుంది. మన దేశంలో ఎవరైనా తమ వ్యక్తిగత సామర్థ్యం, చేసిన సేవలను బట్టి గుర్తింపు పొందుతారు. వారి మతపరమైన గుర్తింపును బట్టి కాదు.." అని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, న్యాయవ్యవస్థ, చీఫ్ జస్టిస్‌పై దూబే చేసిన వ్యాఖ్యలపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు చేపట్టాలని న్యాయవాది బ్రిజేశ్‌సింగ్, మరికొందరు సుప్రీంకోర్టును కోరారు. అయితే దీనిపై అటార్నీ జనరల్ దగ్గరికి వెళ్లి అనుమతి తీసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. దీంతో బ్రిజేశ్ సింగ్ అటార్నీ జనరల్‌కు లేఖ రాశారు.

ట్రంప్ దెబ్బ మరింత తీవ్రం!

భారతీయ విద్యార్థులకు పెరిగిన కష్టాలు.. వీసా రద్దు బాధితుల్లో 50% మనవాళ్లే

▸ చిన్న నేరాలకే దేశ బహిష్కరణ ముప్పు

▸ 14 శాతంతో తర్వాతి స్థానంలో చైనా

▸ అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ గణాంకాలు వెల్లడి



ప్రధాని మోదీ నివాసంలో నెమలి ఈకలతో ఆడుకుంటున్న జేడీ వాన్స్ పిల్లలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అమెరికాలో భారతీయ విద్యార్థుల కష్టాలు తీవ్రస్థాయికి చేరాయి. వీసా రద్దు బాధితుల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉంటోంది. ఈ ఏడాది జనవరి 20వ తేదీ నుంచి ఇప్పటి వరకు 4,736 సెవిస్(ది స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టం) రికార్డులను అమెరికా ఐసీఈ(ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) విభాగం రద్దు చేయగా, 300కుపైగా విద్యార్థి వీసాలను అమెరికా విదేశాంగశాఖ రద్దు చేసింది. ఈ బాధితుల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నట్టు ఐలా(ది అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్) విడుదల చేసిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలాగే, రద్దయిన సెవిస్ రికార్డుల్లో అత్యధికం ఎఫ్-1(విదేశీ విద్యార్థి)లకు సంబంధించినవే. సెవిప్(స్టూడెంట్ అండ్ ఎక్స్చేంజ్ విజిటర్ ప్రోగ్రామ్) సర్టిఫైడ్ స్కూళ్లు, ఎఫ్-1, ఎం-1 విద్యార్థుల సమాచార నిర్వహణ కోసం అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఉపయోగించే వెబ్ ఆధారిత వ్యవస్థే సెవిస్. అలాగే, ఎఫ్-1 హోదా విద్యార్థి అంటే అమెరికాలోని ఏదైనా సెవిప్ సర్టిఫైడ్ స్కూల్లో విద్యను అభ్యసించేందుకు అధికారికంగా ఆమోదం లభించిన విదేశీ విద్యార్థి. వీసా రద్దు, సెవిస్ రికార్డుల రద్దుకు సంబంధించి అమెరికా వ్యాప్తంగా 327 నివేదికలను అటార్నీలు, విద్యార్థులు, యూనివర్సిటీ సిబ్బంది నుంచి తాము సేకరించగా, అందులో 50% బాధితులు భారతీయ విద్యార్థులేనని ఐలా తెలిపింది. ఆ తర్వాతి స్థానంలో చైనా విద్యార్థులు(14%) ఉన్నారని, బాధితుల్లో దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారని పేర్కొంది. ఐలా సేకరించిన సమాచారం మేరకు బాధిత విద్యార్థుల్లో 50 శాతం మంది ఓపీటీ(ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) వారే. వీరంతా విద్యాభ్యాసం పూర్తి చేసి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారని అర్థం. బాధితుల్లో 57 శాతం మంది విద్యార్థులకు వీసా రద్దు నోటీసులను అమెరికా కాన్సులేట్లు ఈమెయిల్ ద్వారా పంపగా, వారిలో ఇద్దరికి మాత్రమే రాజకీయ ఆందోళనల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. అలాగే, సెవిస్ రికార్డుల రద్దు నోటీసులను 83 శాతం బాధితులు తమ యూనివర్సిటీల నుంచి పొందగా, 14 శాతం మంది నేరుగా ఐసీఈ నుంచి పొందారు. బాధితుల్లో 7 శాతం మందికి అసలు నోటీసులు ఇవ్వకుండానే రికార్డులను రద్దు చేసేశారు. ఏవిధమైన పోలీసు చర్యలు, నేర చరిత్ర లేకుండానే సెవిస్ రికార్డులు రద్దయిన కేసులు కనీసం 17 ఉన్నాయని ఐలా తెలిపింది. బాధిత విద్యార్థుల్లో 86 శాతం మందికి నేరచరిత్ర ఉన్నప్పటికీ వారిలో 33 శాతం మందిపై కేసులను కోర్టులు కొట్టివేశాయని పేర్కొంది.





ఢిల్లీలోని అక్షర్‌ధామ్ ఆలయం వద్ద వాన్స్ దంపతులు, సంప్రదాయ వస్త్రధారణలో వారి పిల్లలు

వాణిజ్య చర్చలు భేష్

(మొదటి పేజీ తరువాయి)

నిలిచారు. అబ్బాయిలు కుర్తా పైజామా వేసుకోగా, కుమార్తె నీలాకుపచ్చ అనార్కలీ డ్రెస్‌లో మెరిసింది. రాగానే వాన్స్ కుటుంబం యమున ఒడ్డున ఉన్న అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించింది. ఆలయం తన పిల్లలకు బాగా నచ్చిందని వాన్స్ చెప్పారు. వాన్స్ కుటుంబం జన్‌పథ్ లోని సెంట్రల్ కాటేజ్ ఇండస్ట్రియల్ ఎంపోరియంను సందర్శించారు. కాగితం గుజ్జు బొమ్మలు, తేనె, టీ పొడులు కొన్నారు. అనంతరం వాన్స్, భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరు దేశాల అధికారులు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఉండాల్సిన అంశాలపై చర్చించారు. వాన్స్ కుటుంబం సాయంత్రం రాగానే మోదీ తన ఇంటిని, తోటను పిల్లలకు తిప్పి చూపించారు. వాన్స్ పిల్లలు ఆసక్తిగా అనేక ప్రశ్నలు వేస్తూ మోదీతో మాట్లాడారు. ఆయన ఓపికగా వారికి సమాధానం ఇచ్చారు. మోదీ ఇచ్చిన నెమలి ఈకలను పిల్లలు సంతోషంగా తీసుకున్నారు. ఢిల్లీలోని ఐటీసీ మౌర్య షెరిటన్ హోటల్‌లో బస చేస్తున్న వాన్స్ కుటుంబం రాత్రి ప్రత్యేక విమానంలో జైపూర్ పర్యటనకు వెళ్లింది. అంబర్ ఫోర్ట్‌ను సందర్శిస్తారు. పర్యటనలో భాగంగా వాన్స్ 23న ఆగ్రాను సందర్శించనున్నారు. తిరిగి జైపూర్ వచ్చి అక్కడి నుంచి నేరుగా అమెరికా వెళతారు. అమెరికా ఉపాధ్యక్షుడి రాకతో ఢిల్లీలో భద్రతను భారీ ఎత్తున పెంచారు. అమెరికా ఉపాధ్యక్షుడిగా వాన్స్‌కు ఇదే తొలి భారత పర్యటన. ఆయనకు ముందు జో బైడెన్ ఉపాధ్యక్ష హోదాలో 2013లో భారత్‌లో పర్యటించారు. కాగా, క్యాథలిక్ క్రైస్తవుడైన జేడీ వాన్స్ ఆదివారం వాటికన్ సిటీలో అనారోగ్యంగా ఉన్న పోప్ ఫ్రాన్సిస్‌ను కలిశారు. ఆయన ఢిల్లీకి వచ్చేలోపు పోప్ మరణవార్త వెలువడింది. దాంతో వాన్స్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

లోకం తీరు



సుంకాలు విధించకుండానే మోసం!

▸ అమెరికాతో వాణిజ్యం చేసే దేశాలపై ట్రంప్ మరోసారి ఫైర్

▸ పలు పరోక్ష, అనైతిక పద్ధతుల్లో అమెరికాకు నష్టం చేస్తున్నాయని విమర్శ

వాషింగ్టన్, ఏప్రిల్ 21: సుంకాల యుద్ధానికి 90 రోజుల విరామం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తమతో వాణిజ్యం చేసే దేశాల మీద మరోసారి విరుచుకుపడ్డారు. పలు పరోక్ష, అనైతిక విధానాల ద్వారా అవి తమను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్‌లో 'నాన్ టారిఫ్ చీటింగ్' (సుంకాలు విధించకుండానే మోసం) పేరుతో 8 అంశాలను ప్రస్తావించారు. వాటిలో 1. కరెన్సీ మోసాలు 2. సుంకాల రూపంలో వసూలు చేసే వ్యాట్ ట్యాక్స్‌లు, సబ్సిడీల ఎగుమతులు 3. చవక సరుకులను తెచ్చి మార్కెట్లను ముంచెత్తటం 4. ప్రభుత్వ సబ్సిడీలు 5. విదేశీ ఉత్పత్తుల నుంచి ఆయా దేశాలు తమ వ్యవసాయోత్పత్తులకు రక్షణ కల్పించటం (యూరోపియన్ యూనియన్ దేశాల్లో జన్యుపరివర్తిత మొక్కజొన్నను అనుమతించపోవటం) 6. సాంకేతిక ప్రమాణాల పేరుతో విదేశీ ఉత్పత్తులను అడ్డుకోవటం (జపాన్ బౌలింగ్ టెస్ట్) 7. పైరసీ, మేధోహక్కుల చోరీ (ఏటా లక్ష కోట్ల డాలర్లకుపైగా) 8. సుంకాలను తప్పించుకోవటానికి సముద్రరవాణా మార్గాలను ఎంచుకోవటం వంటి అంశాలను ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్ల మీద జపాన్ నిర్వహించే పరీక్షను బౌలింగ్ బాల్ టెస్ట్‌గా ట్రంప్ అభివర్ణించారు. 'బంతిని 20 అడుగుల ఎత్తు నుంచి కారు మీదకు వదులుతారు. కారుపై సొట్ట పడితే దానికి నాణ్యత లేదని పక్కనపెడతారు. ఎంత హాస్యాస్పదం ఇది' అని ఎద్దేవా చేశారు.

వంట నూనె తాగేస్తున్నాం!

▸ దేశంలో ఏడాదికి తలసరి వినియోగం 24 కేజీలు

▸ 2001తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ

▸ ఐసీఎంఆర్ సిఫారసు పరిమితి 12 కేజీలే

▸ ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనారోగ్య సమస్యలు తీవ్రతరం

▸ నూనెకు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశంలో గతంలో పోలిస్తే వంట నూనెల వినియోగం భారీగా పెరిగింది. ప్రస్తుతం సగటున ప్రతి భారతీయుడు ఏడాదికి 24 కేజీల వంట నూనె తాగేస్తున్నాడట! దేశంలతో తలసరి వంట నూనె వినియోగం గత రెండు దశాబ్దాల్లో దాదాపు మూడు రెట్లు పెరిగిందని 'మింట్' నివేదిక వెల్లడించింది. ఇది నూనె దిగుమతులపై దేశ ఆధారపడడాన్ని పెంచుతుందని, అదేవిధంగా ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, ఫ్యాటీ లివర్ వంటి అనారోగ్య ఆందోళనలను తీవ్రతరం చేస్తుందని పేర్కొంది. 2001లో ఏడాదికి 8.2 కేజీలుగా ఉన్న నూనె వినియోగం నేడు 23.5 కేజీలకు పెరిగిందని తెలిపింది. ఇది భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సిఫారసు చేసిన 12 కేజీల పరిమితికి రెట్టింపు అని పేర్కొంది. దిగుమతుల అంశంపై నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ మాట్లాడుతూ 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్స్ ఆయిల్స్' కింద ప్రభుత్వం దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తోందని, పామాయిల్, సాంప్రదాయ నూనె గింజలపై దృష్టి సారించిందని తెలిపారు.

అధిక నూనెతో అనారోగ్య సమస్యలు

పెద్ద నగరాలు, టైర్-2, 3 నగరాల్లో అధికంగా నూనె వినియోగించి ఇళ్లలో, బయట తయారు చేసే తిండిని తినడం వలన అనారోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, ఫ్యాటీ లివర్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలకు వంట నూనె అధికంగా శరీరంలోకి చేరడానికి మధ్య సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యకర జీవనం కోసం నూనె వినియోగాన్ని తగ్గించుకుందామని ప్రధాని మోదీ గత శనివారం ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు.

దిగుమతులపైనే ఆధారం

దేశీయంగా వంట నూనె ఉత్పత్తి ఉన్నప్పటికీ, భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. స్థానికంగా ఏడాదికి 1.1 కోట్ల టన్నుల నూనె మాత్రమే ఉత్పత్తి అవుతుండగా.. ఏడాదికి 2.5-2.6 కోట్ల టన్నుల వంట నూనెను భారత్ వినియోగిస్తోందని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) ఇటీవలి గణాంకాలు చెబుతున్నాయి. ఇండోనేషియా, మలేషియా నుంచి పామాయిల్, అర్జెంటీనా, బ్రెజిల్ నుంచి సోయాబీన్ ఆయిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటోంది. 2024 నవంబర్, 2025 మార్చి మధ్య గత ఏడాది అదే కాలంతో పోలిస్తే భారత్ ముడి సోయాబీన్ నూనె దిగుమతి రెట్టింపు కంటే ఎక్కువై 19 లక్షల టన్నులకు పైగా చేరింది. 2023-24లో దేశ మొత్తం వంట నూనెల దిగుమతులు 1.6 కోట్ల టన్నులుగా ఉందని అంచనా.

పామాయిల్ వినియోగమే ఎక్కువ

పారిశ్రామిక గణాంకాల ప్రకారం.. భారత వంట నూనెల వినియోగంలో ప్రస్తుతం పామాయిల్ 37 శాతానికి పైగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో సోయాబీన్ (20%), ఆవ నూనె (14%), సన్‌ఫ్లవర్ (13%) ఉన్నాయి. ఇంటి బయట తిండ్లు ఎక్కువవడం, రెడీ టు ఈట్ ఉత్పత్తులు, బేకరీ ప్రోడక్టుల కారణంగా ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్‌ల నుంచి నూనె డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

ఝార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

ఎనిమిది మంది మావోయిస్టుల హతం

▸ మృతుల్లో అగ్రనేత ప్రయాగ్ మాంఝీ

▸ అతని తలపై రూ.కోటి రివార్డు



ప్రయాగ్ మాంఝీ

రాంచీ/న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ కూడా ఉన్నాడు. అతని తలపై రూ.కోటి రివార్డు ఉంది. సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. బొకారో జిల్లాలోని లాల్పనా ప్రాంతంలో ఉన్న లుగుహిల్స్‌లో సీఆర్పీఎఫ్‌కు చెందిన కోబ్రా కమెండోలు, ఝార్ఖండ్ పోలీసులు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నారు. తెల్లవారుజామున కూంబింగ్ ప్రారంభించిన భద్రతా దళాలకు 5.30 గంటల సమయంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. 8 మంది మావోయిస్టులు హతమవగా.. మిగిలిన వారు అడవుల్లోకి పారిపోయారని భద్రతా దళాలు వెల్లడించాయి. మృతులను కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ, స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు అర్వింద్ యాదవ్ అలియాస్ అవినాశ్, జోనల్ కమిటీ సభ్యుడు సాహెబ్‌రామ్ మాంఝీ అలియాస్ రాహుల్ మాంఝీ, మహేశ్ మాంఝీ అలియాస్ మోటా, తాలూ, రంజు మాంఝీ, గంగారాం, మహేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ప్రయాగ్‌పై రూ.కోటి రివార్డు ఉండగా.. అర్వింద్ యాదవ్‌పై రూ.25 లక్షలు, సాహెబ్‌రామ్‌పై రూ.10 లక్షల రివార్డులు ఉన్నట్లు చెప్పారు.

ఎన్నికల సంఘం రాజీ పడింది

▸ ఈసీ వ్యవస్థలో లోపం ఉంది

▸ అమెరికాలో రాహుల్ సంచలన వ్యాఖ్యలు



బోస్టన్, భోపాల్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: భారత ఎన్నికల సంఘంపై అమెరికాలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం రాజీ పడిందని, అందుకు మహారాష్ట్ర ఎన్నికలే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బోస్టన్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గతేడాది జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో.. ఉన్న ఓటర్ల కంటే ఎక్కువ మందే ఓట్లు వేశారని రాహుల్ చెప్పారు. "మహారాష్ట్ర ఎన్నికల్లో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య 65 లక్షల ఓట్లు పోల్ అయ్యాయని ఈసీ వెల్లడించింది. కానీ ఇది అసంభవం. సగటున ఒక ఓటుకు 3 నిమిషాలు పట్టినా అన్ని ఓట్లు పోల్ అవ్వాలంటే అర్ధరాత్రి 2 గంటల వరకు పోలింగ్ జరిగి ఉండాలి. కానీ అలా జరగలేదు. మహారాష్ట్ర పోలింగ్ గురించి మేం వీడియో కోసం మేం అడిగితే ఈసీ ఒప్పుకోలేదు. ఇప్పుడు వీడియో గురించి అడగడానికి వీలు లేకుండా చట్టాన్నే మార్చేశారు" అని పేర్కొన్నారు. దీనిని బట్టి ఈసీ రాజీ పడినట్లు స్పష్టమవుతోందని, ఈసీ వ్యవస్థలోనే లోపం ఉందని అన్నారు. భారత్ - అమెరికా సంబంధాలపై కూడా రాహుల్ మాట్లాడారు. అమెరికాతో మనకు భాగస్వామ్యం ఉందని, ఇరు దేశాలు కలిసి పనిచేయాలని కోరుకుంటున్నానని అన్నారు.

రాహుల్ పౌరసత్వంపై బ్రిటన్‌కు లేఖ: కేంద్రం

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి బ్రిటన్ పౌరసత్వం ఉందన్న ఆరోపణలపై సమాచారం ఇవ్వాలంటూ ఆ దేశానికి లేఖ రాశామని కేంద్రం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కేసుపై విచారణ జరుపుతున్న అలహాబాద్ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు సోమవారం ఈ విషయాన్ని తెలిపింది. దీనిపై పూర్తి వివరాలు ఇచ్చేందుకు మరికొంత సమయం కోరింది.

ప్రజలే దేవుళ్లు

▸ ఐఏఎస్‌లు పాలకులు మాత్రమే కాదు 'పురోగామి భారత' రూపశిల్పులు

▸ 'సివిల్ సర్వీసెస్ డే' వేడుకల్లో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అణగారిన వర్గాల సమస్యలు పరిష్కరించే క్రమంలో 'నాగరిక్ దేవోభవ(ప్రజలే దేవుళ్లు)' సూత్రాన్ని పాటించాలని ప్రధాని మోదీ అధికారులకు సూచించారు. ఇది 'అతిథి దేవోభవ'లాంటిదేనని, ఇదే సత్పరిపాలన మంత్రం కావాలని ఆకాంక్షించారు. సోమవారం '17వ సివిల్ సర్వీసెస్ డే' వేడుకల్లో ఆయన ఐఏఎస్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి అందరికీ అందాలని, చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రయోజనం చేకూర్చాలని ఉద్బోధించారు. 'ఐఏఎస్ అధికారులు తమను తాము కేవలం పాలకులుగా భావించవద్దు. మీరు పురోగామి భారత రూపశిల్పులు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలు మారుతున్నాయి. సమకాలీన సవాళ్లకు అనుగుణంగా సివిల్ సర్వీసెస్ అధికారులు మారాలి. బడుగు వర్గాల ఈతిబాధలు వినాలి. వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి. ప్రజలే మన దేవుళ్లు. ఈ దృక్పథంతోనే గత పదేళ్ల కాలంలో 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించాం. ఇది పేదరికరహిత భారత్‌కు దారితీస్తుందని విశ్వసిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాలం చెల్లిన ప్రణాళికలతో అధికార యంత్రాంగం పనిచేయజాలదన్నారు. వచ్చే వెయ్యేళ్ల భవిష్యత్‌ను రూపుదిద్దే విధానాల తయారీపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని తెలిపారు. ఈ విజన్‌ను నెరవేర్చేందుకు అధికారులంతా ప్రతి రోజూ, ప్రతి క్షణం అవిశ్రాంతంగా కృషిచేయాలని కోరారు. భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించేలా చేయడంలో సివిల్ సర్వెంట్ల బాధ్యత చాలా పెద్దదన్నారు.

ప్రజా పరిపాలనలో.. ఏలూరుకు 'ప్రధానమంత్రి' అవార్డు

- 2023కిగానూ దేశంలోని 10 జిల్లాలు ఎంపిక
- మోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న అప్పటి ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏలూరు జిల్లాకు కేంద్ర స్థాయిలో అత్యుత్తమ గుర్తింపు లభించింది. ప్రజా పరిపాలన ద్వారా మంచి ఫలితాలు సాధించిన ఏలూరుకు కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'ప్రధానమంత్రి అవార్డు' లభించింది. 2023 ఏడాదికిగాను ఈ అవార్డు దక్కింది. సోమవారం 17వ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అప్పుడు ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ప్రసన్న వెంకటేశ్ ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఉన్న 788 జిల్లాలకు గానూ 10 జిల్లాలు మాత్రమే ఈ పురస్కారానికి ఎంపిక అయ్యాయి. వీటిలో మన రాష్ట్రంలోని ఏలూరు ఒకటి. ప్రభుత్వ పరిపాలనలో ఉత్తమ ఫలితాలు సాధించిన అధికారులు, సంస్థలను గౌరవించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందిస్తుంది. అవార్డు అందుకున్న నేపథ్యంలో ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పురస్కారం తనకు దక్కిన వ్యక్తిగత గౌరవం కాదని, ఇది జిల్లా యంత్రాంగం సమష్టి కృషికి గుర్తింపు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతి కార్యక్రమాన్ని ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో అమలు చేసి మంచి ఫలితాలు రాబట్టే ప్రయత్నం చేశానని, ఇందుకు సహకరించిన అధికారులకు, ఏలూరు జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత

పశ్చిమగోదావరి జిల్లాను విభజించిన తర్వాత ఏలూరు జిల్లాకు తొలి కలెక్టర్‌గా ప్రసన్న వెంకటేశ్ నియమితులయ్యారు. 2023లో వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం, కేంద్ర పథకాలను అద్భుతంగా అమలు చేయడం, విభిన్న రంగాల్లో ఉత్తమ ప్రదర్శనల ద్వారా మంచి ఫలితాలు రాబట్టారు. రెండేళ్లలో జిల్లా అభివృద్ధిని ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా రక్తహీనత నివారణకు ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లా సామాజిక బాధ్యత పథకం కింద 'అక్షజ' అనే ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని ఆదివాసీ మండలాల్లో ప్రారంభించారు. దీని కింద గర్భిణులు, మాతాశిశు ఆరోగ్యంపై దృష్టి పెట్టడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.



ప్రధాని చేతుల మీదుగా తీసుకున్న పురస్కారంతో ప్రసన్న వెంకటేశ్

రెండో డాకింగ్ కూడా విజయవంతం

- స్పేడెక్స్ మిషన్‌లో ఇస్రో మరో ఘనత

సూళ్లూరుపేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్‌లో భాగంగా ఇస్రో మరో ఘనత సాధించింది. ఈ మిషన్‌లో ప్రయోగించిన ఎస్‌డీఎక్స్-01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) అనే జంట ఉపగ్రహాలకు రెండోసారి డాకింగ్ ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తిచేసినట్టు ఇస్రో సోమవారం ప్రకటించింది. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కూడా 'ఎక్స్'లో వెల్లడించారు. పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా గతేడాది డిసెంబరు 30న స్పేడెక్స్ ప్రయోగాన్ని చేపట్టిన ఇస్రో.. ఈ ఏడాది జనవరి 16న ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలను కక్ష్యలో విజయవంతంగా డాకింగ్ చేసింది. మార్చి 13న వాటిని అన్‌డాకింగ్ కూడా చేసింది. చంద్రుడిపైకి వ్యోమగామిని పంపడం, అక్కడి నుంచి నమూనాలను సేకరించి భూమిపైకి తీసుకురావడం, త్వరలోనే భారత అంతరిక్ష స్పేస్ స్టేషన్ నిర్మాణం వంటి భారత్ చేపట్టబోయే భవిష్యత్ మిషన్లలో స్పేడెక్స్ టెక్నాలజీ కీలక పాత్ర పోషించనుంది. తాజాగా స్పేడెక్స్ మిషన్ రెండో డాకింగ్ ప్రక్రియను కూడా విజయవంతం కావడంతో ఇస్రో భవిష్యత్ ప్రయోగాలకు మార్గం సుగమమైంది.



అంతరిక్షంలో డాకింగ్ అవుతున్న జంట ఉపగ్రహాలు

టీటీడీలో వేగంగా డిజిటలైజేషన్

- పాత రికార్డుల సంరక్షణకు చర్యలు
- ఇప్పటికే 2.21 కోట్ల పేజీల స్కాన్
- ఇలాగే మిగిలిన రికార్డులు కూడా
- తాజాగా టీటీడీ రూ.3 కోట్లు విడుదల

తిరుమల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని పాత పత్రాల డిజిటలైజేషన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 2.21 కోట్ల పేజీలను స్కాన్ చేశారు. మిగిలిన రికార్డులను కూడా వేగంగా డిజిటలైజేషన్ చేసేందుకు టీటీడీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. తాజాగా మరో రూ.3 కోట్ల నిధులను విడుదల చేసి ఈ ప్రక్రియను పూర్తిచేయాలని టీటీడీ ఆదేశించింది. వేల ఏళ్ల చరిత్ర గల తిరుమల క్షేత్ర పరిపాలన బాధ్యతలను 1843 వరకు ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు నిర్వహించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. 1933 వరకు క్షేత్ర పాలనను మహంతులు చూసుకోగా, ఆ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో టీటీడీ ఏర్పాటైంది. 1980 ముందు వరకు టీటీడీలో ప్రతిదీ పేపర్‌పైనే జరిగేది. అయితే కాలం గడుస్తున్న కొద్దీ ఎంతో విలువైన రికార్డులు పాడైపోతూ వస్తున్నాయి. దీంతో



పాత రికార్డులన్నీ సంరక్షించేందుకు డిజిటలైజేషన్ చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈ డిజిటలైజేషన్ ద్వారా పత్రాల రక్షణ, సంరక్షణ, స్కానింగ్, మైక్రోఫిల్మింగ్ వంటి కీలక చర్యలకు పూనుకుంది. ఈ పనుల నిర్వహణ కోసం ప్రభుత్వానికి చెందిన ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్)ను టీటీడీ అధికారికంగా నియమించింది. ఏపీటీఎస్ టెండర్ ప్రక్రియ ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఐరన్ మౌంటెన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 2023 ఆగస్టు నుంచే డిజిటలైజేన్ ప్రక్రియను ప్రారంభించింది. తొలుత 1.60 కోట్ల పేజీలను స్కాన్ చేయాలని అంచనా వేసినప్పటికీ ఇప్పటి వరకు దాదాపు 2.21 కోట్ల పేజీలను స్కాన్ చేశారు. ఇంకా స్కాన్ చేయాల్సిన రికార్డులు చాలానే ఉన్నాయి.

టీటీడీలో మరో ఐటీ జీఎం పోస్టు!

- ఆమోదం కోసం ప్రభుత్వానికి లేఖ

టీటీడీలో రోజురోజుకు డిజిటల్ సేవల్లో విస్తృతంగా పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో ప్రస్తుతం ఐటీ డిప్యూటీ జీఎంగా ఉన్న పోస్టును ఐటీ జీఎంగా పదోన్నతి కల్పించే అంశంపై టీటీడీ దృష్టిసారించింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని శ్రీవారి భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు, గదులు, లడ్డూప్రసాదం తదితర సేవలను వేగంగా, పారదర్శకంగా అందించడంతో పాటు సమర్థమైన పరిపాలనను అందించే దిశగా టీటీడీ అడుగులేస్తోంది. 1989లో టీటీడీలో కంప్యూటరైజేషన్ ప్రారంభం కాగా, 2002లో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటైంది. ఇప్పటికే 108కిపైగా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు అభివృద్ధి చేసి వినియోగిస్తున్నారు. శ్రీవారి ఆలయం, టీటీడీ పరిపాలన వ్యవస్థతో పాటు తిరుపతి స్థానిక ఆలయాల్లో ఐటీ సేవలను విస్తృతం చేయాలని టీటీడీ భావిస్తోంది. అలాగే టీటీడీ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు ఆస్పత్రులు, ఇతర ఆలయాలు, సమాచార కేంద్రాలకు కూడా ఐటీ అవసరాన్ని ప్రస్తుత అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఒకే ఐటీ జీఎంతో ఇవన్నీ చేయడం సాధ్యం కాదని భావించిన టీటీడీ, ఐటీ డిప్యూటీ జీఎం పోస్టును అప్‌గ్రేడ్ చేసి రెండో ఐటీ జీఎం పోస్టుగా క్రియేట్ చేయాలని భావించింది. ఇందులో భాగంగానే ఆమోదం కోసం టీటీడీ ఇటీవల ప్రభుత్వానికి లేఖ పంపింది.

తిరుమల పర్యటనకు రండి

- యూపీ సీఎంకు మంత్రి సత్యకుమార్ ఆహ్వానం

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఏపీలోని తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకుని, ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఆహ్వానించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. సోమవారం లఖ్‌నవూ వెళ్లిన సత్యకుమార్.. యోగిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీకృష్ణుని తొలుబొమ్మను బహూకరించారు. ధర్మవరం పట్టు, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్టతను వివరించారు. సీఎం యోగి కూడా మంత్రి సత్యకుమార్‌కు మధుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. యోగితో దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించినట్లు మంత్రి సత్యకుమార్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

గోశాలపై వైసీపీ అనవసర రాద్ధాంతం: ఎమ్మెల్సీ సోము వీర్రాజు

బెలగాం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 'నేడు రాష్ట్రంలో గడ్డు పరిస్థితులు ఉన్నాయని జగన్ అనడం హాస్యాస్పదం. విశాఖ మేయర్ పీఠాన్ని కూటమి దక్కించుకున్న తరువాతైనా ఆయనకు జ్ఞానోదయం కలగాలి' అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పార్వతీపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాటాడారు. 'టీటీడీ గోశాల విషయంలో వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోంది. కొన్ని గోవులు వయస్సు రీత్యా మృతి చెందవచ్చు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. దీనిపై వైసీపీ వాస్తవ విరుద్ధంగా మాట్లాడుతోంది' అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.

ఆఫ్‌లైన్ లేఅవుట్లకు తిరిగి అనుమతులు

- ఆలస్యపు ఫీజు వసూలుకు నిర్ణయం
- మున్సిపల్ శాఖ మార్గదర్శకాలు జారీ

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఆన్‌లైన్ లేఅవుట్ల అనుమతి ప్రక్రియ రాకముందే ఉన్న ఆఫ్‌లైన్ లేఅవుట్లకు తిరిగి అనుమతులు మంజూరుచేస్తూ మున్సిపల్‌శాఖ మార్గదర్శకాలు జారీచేసింది. గతంలో పలు పట్టణాలు, నగరాల్లో లేఅవుట్లు వేశాక రెండేళ్ల పాటు అభివృద్ధి చేయకుండా ఆగిపోయిన వాటిని తిరిగి పునరుద్ధరించుకునే అవకాశం కల్పించారు. గత వైసీపీ ప్రభుత్వంలో భారీగా ఫీజులు పెంచడంతో పాటు రియల్ బూమ్ లేకపోవడంతో పలు చోట్ల లేఅవుట్లను అభివృద్ధి చేయకుండా వదిలేశారు. ప్రస్తుతం లేఅవుట్లకు గిరాకీ పెరిగింది. దీంతో ఆగిపోయిన వాటికి తిరిగి అనుమతులివ్వాలని పలువురు రియల్టర్లు మంత్రి నారాయణను కోరారు. దీంతో ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఆయా లేఅవుట్ల అనుమతి గడువు పూర్తయిన తర్వాత కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఆలస్యపు ఫీజు వసూలు చేసి వాటికి తిరిగి అనుమతులిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 2-20 ఏళ్ల మధ్య 870 ఆఫ్‌లైన్ లేఅవుట్లకు సంబంధించి 8,509 ఎకరాలకు తిరిగి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో మున్సిపాలిటీలకు ఫీజుల రూపంలో ఆదాయం చేకూరనుంది.

ఆధార్ అప్‌డేట్ కోసం పాట్లు!



ప్రకాశం జిల్లా గిద్దలూరు బీఎస్ఎన్ఎల్ ఆఫీసులోని ఆధార్ కేంద్రం వద్ద సోమవారం కనిపించిన దృశ్యమిది. రేషన్‌కార్డులోని ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో ఆధార్ అప్‌డేట్ కాకపోవడం, ఫోన్ నంబరు లింకు కాకపోవడం వంటి సమస్యలతో, సరి చేసుకోడానికి పలువురు ఆధార్ కేంద్రానికి వెళుతున్నారు. ఎండలో క్యూలో నిలుచోలేక ఈ మార్గం ఎంచుకున్నారు. – గిద్దలూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, ఏప్రిల్21(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం తర్వాత అఖిలాండం వద్దకు చేరుకుని కొబ్బరికాయ సమర్పించి నమస్కరించుకున్నారు.



తిరుమలలో అఖిలాండం వద్ద జస్టిస్ ఎన్వీ రమణ

25వ తేదీ నుంచి చర్లపల్లి మీదుగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రాకపోకలు

విశాఖపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి చర్లపల్లి-సనత్‌నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తుందని వాల్తేరు రైల్వే సీనియర్ డీసీఎం కె.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (నంబరు 12805) ఏప్రిల్ 25వ తేదీ నుంచి ఉదయం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి చర్లపల్లి మీదుగా రాత్రి 7.40 గంటలకు లింగంపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) ఏప్రిల్ 26 నుంచి ఉదయం 6.15 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి రాత్రి 7.45 గంటలకు విశాఖ చేరుతుంది. మార్గమధ్యలోని స్టేషన్ల హాల్ట్‌ల సమయాల్లో ఎటువంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.



గుంతకల్లు రైల్వే జంక్షన్

పింక్‌బుక్ జాడేదీ?

- మూడు నెలలు గడుస్తున్నా విడుదల ఊసేలేదు
- బడ్జెట్‌లో కేటాయింపులపై ముసురుతున్న సందేహాలు

గుంతకల్లు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులను జోన్ల వారీగా విశదపరిచే పింక్‌బుక్ విడుదలలో అసాధారణ జాప్యం చోటుచేసుకుంది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులపై స్థూల ప్రకటన చేశారు. ఆ తరువాత రెండు మూడు రోజుల్లో దేశంలోని 19 జోన్లకు కేటాయింపులను తెలిపే పింక్ బుక్‌ను విడుదల చేయాలి. ఆ జోన్ల పరిధిలోని డివిజన్లలో కొత్త ప్రాజెక్టులు, రన్నింగ్ ప్రాజెక్టులకు నిధులు, కొత్త లైన్ల నిర్మాణం, ట్రాక్ నిర్వహణ, సేఫ్టీ పనులకు కేటాయింపులు, కొత్త రైళ్లు, రైల్వే ఉద్యోగుల సంక్షేమానికి చేపట్టే చర్యలను పారదర్శకత కోసం పింక్ బుక్‌లో పొందుపరుస్తారు. ఈ ఏడాది మూడు నెలలు అవుతున్నా పింక్ బుక్ ఊసే లేదు. దీంతో ఉద్యోగ, ప్రయాణికుల సంఘాల్లో సందేహాలు ముసురుతున్నాయి.

గత ఏడాది నుంచి ఆలస్యం

బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత రెండు మూడు రోజుల్లో పింక్ బుక్‌ను విడుదల చేయడం ఆనవాయితీగా ఉండేది. కానీ గత ఏడాది 20 రోజులు ఆలస్యంగా విడుదల చేశారు. ఈ ఏడాది ఏకంగా మూడు నెలలుగా ఊసే లేదు. బడ్జెట్‌లో జోన్లకు వచ్చే కేటాయింపుల నుంచి సర్దుబాటు చేసిన నిధులు రైల్వే డివిజన్లకు వస్తాయి. పింక్‌బుక్‌ను అనుసరించి ఆర్థిక సంవత్సరంలో రైల్వే డివిజన్లలో వ్యయ కార్యాచరణ ఉంటుంది. ఉద్యోగ సంఘాలు తమ సంక్షేమంపై ఓ అవగాహనకు వచ్చేవి. కానీ ఈ ఏడాది అసాధారణ జాప్యం జరుగుతోంది. ఆలస్యానికి కారణం చెప్పకుండా, వస్తుందని మాత్రమే అధికారులు చెపుతుండడం గమనార్హం.

జగన్ చిల్లుపడిన కుండ ఇచ్చారు!

- ఎంత నీరు పోసినా పోతోంది: నిమ్మల
- రూ.1,200 కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు
- మే నెలాఖరుకు డయాఫ్రం వాల్, బట్రస్ డ్యాం పూర్తి
- 2027 డిసెంబరు నాటికి పోలవరం కూడా: మంత్రి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఖాళీ కుండ ఇచ్చి ఉంటే దానిని తమ నాయకుడు చంద్రబాబు తన ఆలోచనతో సంపద సృష్టించి నింపుతారని.. కానీ జగన్ తమకు చిల్లుపడిన కుండ ఇచ్చారని, దీంతో అందులో ఎంత నీరు పోసినా పోతోందని జలవనరుల మంత్రి, తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన చేసిన అప్పులకు వడ్డీలు కట్టేందుకు అంతా పోయే పరిస్థితి ఉందన్నారు. అయినా సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ పనులకు రూ.1200 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. రూ.990 కోట్లతో చేపట్టిన కొత్త డయాఫ్రం వాల్‌లో ఇప్పటికి 202 మీటర్లకు పైగా నిర్మాణం పూర్తిచేశామన్నారు. ఈ నెల 30 నాటికి మూడో కట్టర్ అందుబాటులోకి వస్తుందని.. వర్షాకాలంలో కూడా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎగువ కాఫర్ డ్యాంను బలోపేతం చేసి మే నెలాఖరుకు వాల్‌తోపాటు బట్రస్ డ్యాంను కూడా పూర్తి చేస్తామని తెలిపారు. సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-1 వద్ద పనులు చేస్తున్నామన్నారు. గ్యాప్-2 వద్ద పనులు నవంబరు 30లోగా మొదలుపెడతామని చెప్పారు. చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు నిర్మాణం 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. జగన్ తమ శాఖలో రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టివెళ్లాడని..



రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న మంత్రి నిమ్మల. పక్కనే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తదితరులు

లస్కర్లకు కూడా ఏడాది జీతాలు ఇవ్వకపోతే తామొచ్చాక చెల్లించామని చెప్పారు. సమావేశంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోంచేసిన నిమ్మల

మంత్రి నిమ్మల రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాస్పత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి భోజనం చేశారు. భోజనం వేడిగా, శుచిగా, శుభ్రంగా ఉందన్నారు. జగన్ అన్న క్యాంటీన్లు మూసివేయడంతో పేదలు ఐదేళ్లు బాధలు పడ్డారని.. పాలకొల్లులో తాను, రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి వాసు సొంత ఖర్చులతో, కొందరి సహకారంతో క్యాంటీన్లను నిర్వహించామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రవ్యాప్తంగా 250 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి కార్మికులు, పేదలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థుల ఆకలి బాధలు తీరుస్తున్నామన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు

- ప్రతి గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మాణం
- మొత్తం 15 వేలు నిర్మించాలని నిర్ణయం
- ఇప్పటికే 12 వేలకుపైగా సిద్ధం.. నెలాఖరులోగా మిగిలినవన్నీ పూర్తి

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పల్లె ప్రాంతాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చడానికి ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. వేసవిలో పశువులు తాగునీటికి ఇబ్బందులు పడకూడదన్న యోచనతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతి గ్రామంలో పశువులకు నీళ్ల తొట్టెలు నిర్మించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తొట్టెల నిర్మాణంలో నిమగ్నమైంది. ఏప్రిల్ 1న రాష్ట్ర వ్యాప్తంగా 15 వేలు నీటి తొట్టెలు నిర్మాణానికి భూమి పూజ చేశారు. 3 వేల లీటర్ల సామర్థ్యం ఉండే ఒక్కో తొట్టె రూ. 45 వేల ఖర్చుతో నిర్మించతలపెట్టారు. దీనికోసం ఉపాధి హామీ నిధులు మొత్తం రూ. 67.50 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మొత్తంగా ఈ తొట్టెల్లో 4.5 కోట్ల లీటర్లను నిల్వ చేస్తారు. పశువులకు ఇబ్బంది లేకుండా నీరందడం వల్ల పాల ఉత్పత్తి పెరిగి రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రోజుకు రూ. 5 కోట్ల నుంచి రూ. 6 కోట్ల వరకు అదనపు ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 12 వేల నీటి తొట్టెల నిర్మాణం పూర్తయిందని, మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు.



బలవంతంగా తీసుకొచ్చి చంపేశారు

కర్ణాటక మాజీ డీజీపీ హత్యలో భార్య దారుణాలు వెలుగులోకి

- ఫిర్యాదులో వెల్లడించిన కుమారుడు
- భార్య, కుమార్తెపై కేసు నమోదు
- ఓంప్రకాశ్ అంత్యక్రియలు పూర్తి
- మంత్రి, డీజీపీ తదితర ప్రముఖుల నివాళి

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మాజీ డీజీపీ ఓంప్రకాశ్ హత్యలో ఆయన భార్య పల్లవి, కుమార్తె కృతి దారుణాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రాణ భయంతో తన సోదరి ఇంటికి వెళ్లిపోయిన ఓంప్రకాశ్‌ను రెండు రోజుల క్రితమే పల్లవి, కృతి బలవంతంగా తిరిగి ఇంటికి తీసుకొచ్చినట్టు ఆయన కుమారుడు కార్తికేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పల్లవి, కృతి పోలీసుల అదుపులో ఉన్నారు. వైద్య పరీక్షల అనంతరం ఆదివారం రాత్రి వారిద్దరినీ సాంత్వన కేంద్రంలో ఉంచారు. సోమవారం ఉదయం తిరిగి ఆ ఇద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా, స్టేషన్‌కు ఎందుకు తీసుకొచ్చారని పోలీసులతో వాదనకు దిగారు. తనను ఎవరూ తాకవద్దని పల్లవి గొడవకు దిగారు. కాగా, ఓంప్రకాశ్ కుమారుడు కార్తికేశ్ ఫిర్యాదు మేరకు పల్లవి, కృతిపై బీఎన్ఎస్ సెక్షన్ 103 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తన తల్లి పల్లవి వారం రోజులుగా తన తండ్రి ఓంప్రకాశ్‌ను చంపేస్తానని బెదిరించారని కార్తికేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తరచూ గొడవలెందుకని ఓంప్రకాశ్ చెల్లెలు సరిత ఇంటికి వెళ్లారని, రెండు రోజుల క్రితమే



మాజీ డీజీపీ ఓంప్రకాశ్‌కు నివాళులు అర్పిస్తున్న కర్ణాటక డీజీపీ అలోక్ మోహన్

పల్లవి, కృతి ఆయనను బలవంతంగా ఇంటికి తీసుకొచ్చారని తెలిపారు. కాగా, ఆస్తి గొడవల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఓంప్రకాశ్‌ను పల్లవి ముఖంపై కారం చల్లి కత్తితో పొడిచి చంపేసినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ హత్యలో కుమార్తె కృతి భాగస్వామ్యం కూడా ఉందన్నారు. కాగా, తాను దొమ్మలూరులోని గోల్ఫ్ అసోసియేషన్‌లో ఉండగా, పక్కింటివారు ఫోన్ చేసి, హత్య జరిగిన విషయం తెలిపారని కార్తికేశ్ పేర్కొన్నారు. ఓంప్రకాశ్ హత్యకేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. ఈ కేసు విచారణాధికారిగా మడివాళ ఏసీపీ వాసుదేవ్‌ను నియమించారు. ఓంప్రకాశ్ అంత్యక్రియలు సోమవారం పోలీసు లాంఛనాల నడుమ పూర్తయ్యాయి. చితికి కుమారుడు కార్తికేశ్ నిప్పుపెట్టారు. కోరమంగలలోని సెయింట్‌జాన్స్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుమారుడు కార్తికేశ్, బంధువులు హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని ఇంటికి తీసుకెళ్లారు. మంత్రి రామలింగారెడ్డి, డీజీపీ అలోక్ మోహన్, నగర పోలీస్ కమిషనర్ దయానంద్ నివాళులర్పించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజ్యాంగ లక్ష్మణరేఖలు

భారత ప్రధాన న్యాయమూర్తి కాబోతున్న జస్టిస్ గవాయ్ సోమవారం ఒక పిటిషన్ విచారణ సందర్భంలో కొన్ని విచిత్రమైన వ్యాఖ్యలుచేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్‌లో హింస చెలరేగిన నేపథ్యంలో, ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలు రాష్ట్రపతి నిర్వహణలోకి పోవాలని కోరుతున్న పిటిషన్ అది. ఆర్టికల్ 355 ప్రకారం నివేదిక తెప్పించుకోవలసిందిగా రాష్ట్రపతికి చెప్పండి అంటూ విష్ణుశంకర్ జైన్ అనే న్యాయవాది సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయోధ్య నుంచి జ్ఞానవాపివరకూ తన పిటిషన్లతో న్యాయస్థానాల్లో పలువిజయాలు సాధించిపెట్టిన ఈ సుప్రీంకోర్టు న్యాయవాది ఎంత సుప్రసిద్ధుడో తెలిసిందే. ఈ పిటిషన్ చూడగానే జస్టిస్ గవాయ్‌కు మన ఉపరాష్ట్రపతి కళ్ళలో మెదిలి ఉంటారు. మీరేమో రాష్ట్రపతికి చెప్పాలంటూ నేరుగా ఇలా 'మాండమస్' ఇవ్వమంటారు, మేము మరోపక్క పార్లమెంటరీ, కార్యనిర్వాహక విధుల్లో జోక్యం చేసుకుంటున్నామని మాటలు పడుతూంటాం అన్నది గవాయ్ వ్యాఖ్యల సారాంశం. రాష్ట్రపతికి చెప్ప గలిగేంతవాళ్ళం కాదు అని సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించి వుంటే ఆ రాష్ట్రానికి గతంలో గవర్నర్‌గా వ్యవహరించిన జగదీప్ ధంఖర్ సంతోషించేవారా? అన్నది కాంగ్రెస్ నాయకుల ప్రశ్న.

బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతికి గడువు విధించినందుకు సుప్రీంకోర్టును తప్పుబడుతూ ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలు దేశప్రజల్లో సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఆయన తన హోదాకు తగనిరీతిలో మాట్లాడారని సామాన్యులకు సైతం అనిపించింది. వాళ్ళే శాసనకర్తలు, వాళ్ళే తీర్పరులు, వాళ్ళే కార్యనిర్వాహకులు, సమస్తం వాళ్ళే, ఇక్కడి చట్టాలు మాత్రం వాళ్ళకు వర్తించవు, ఎందుకంటే వీటిన్నింటికీ అతీతులు వారు అంటూ న్యాయమూర్తులను విమర్శించారు జగదీప్ ధంఖర్. సుప్రీంకోర్టును 'సూపర్ పార్లమెంట్'గా, ఆర్టికల్ 142ను దాని అమ్ముల పొదిలో ఉన్న న్యూక్లియర్ మిసైల్‌గా అభివర్ణించడం ఆయన స్థాయికి తగినట్టుగా లేదు. న్యాయశాస్త్రం చదువుకున్న వ్యక్తి కనుక ఆయన తన అభిప్రాయాన్ని గౌరవప్రదంగా వెలిబుచ్చవచ్చు. అసమ్మతిని, విమర్శను నిర్మాణాత్మకంగా చేయవచ్చు. కానీ, ఆయన వాడిన భాషవల్ల ఇంకా ఆయనను పక్షపాతాలూ, విధేయతలు వీడలేదన్న భావన కలిగింది. విషయం పక్కకుపోయి, ఆయన రాజకీయ ప్రస్థానం, ఎదిగివచ్చిన క్రమం ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. మోదీ తెచ్చిన ఎన్‌జేఏసిని సుప్రీంకోర్టు కొట్టివేసినప్పుడు ఎంపీలంతా చేష్టలుడిగి, చేతలుకట్టుకొని కూర్చున్నారంటూ ఈ మధ్యనే వారిని రెచ్చగొట్టేరీతిలో వ్యాఖ్యానించారు. ఇటీవల ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఉదంతం జరగ్గానే కొద్దిగంటల్లోనే బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులను ఇంటికి పిలిపించుకొని మరీ ఎన్‌జేఏసిమీద చర్చించిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా ఆయన వర్మ ఉదంతాన్ని ఆయుధంగావాడి మరీ అక్కసు తీర్చుకున్నారు. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద అంశాలమీద సుప్రీంకోర్టు స్టే విధించే అవకాశాలు కనిపిస్తున్నందువల్లే అధికారపక్షం నుంచి సుప్రీంకోర్టు మీద పై స్థాయిలో ఎదురుదాడి జరుగుతోందని విపక్ష నేతల ఆరోపణ.

గవర్నర్లు సరే, రాష్ట్రపతికి గడువు విధించడం సరికాదని ఉపరాష్ట్రపతి అభ్యంతరం. విపక్షపాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ఏమీ తేల్చకుండా బిల్లులను నిరవధికంగా తొక్కిపెడుతున్నారు కనుక, అక్కడి ప్రభుత్వాలు సుప్రీంకోర్టును శరణుజొచ్చవలసి వస్తున్నది. కోర్టు కూడా ఏళ్ళ తరబడి హితవులు చెప్పి, ఫలితం లేకపోవడంతోనే ఈ గడువులు విధించాల్సి వచ్చింది. అసెంబ్లీ రెండోమారు ఆమోదించిన బిల్లులను సైతం తమిళనాడు గవర్నర్ అతితెలివిగా రాష్ట్రపతికి పంపితే, అక్కడ కూడా అవి కదలకుండా ఉండిపోతే ఏం చేయాలి? రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన గవర్నర్లు గాడితప్పినప్పుడల్లా రాష్ట్రపతి మందలిస్తూ ఉంటే, అసలు ఈ కేసులే ఉండవు.

ఒక బిల్లు గవర్నర్ దగ్గర ఎంతకాలం ఉండాలి, రాష్ట్రపతికి ఏ దశలో నివేదించాలన్నది రాజ్యాంగం స్పష్టంగా చెప్పనికారణంగా దానిని ఒక రాజకీయఆయుధంగా వాడుకుంటున్నవారు, ఇప్పుడు కాలపరిమితి విధించినందుకు న్యాయవ్యవస్థమీద బురదజల్లుతున్నారు. రాజ్యాంగ మూలస్తంభాలు మూడు సమన్వయంతో, సహకారంతో, పరస్పర గౌరవంతో నడుచుకోవాలి. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల మధ్య పరిమితులు, పరిధులకు సంబంధించి ఘర్షణ తలెత్తడం కొత్తేమీ కాదు. కానీ, వాటిని సరిదిద్ది, తిరిగిపట్టాలమీద ఉంచాల్సిన అత్యున్నత స్థాయి వ్యక్తులే చర్చకు కాక, రచ్చకు దారితీసేవిధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు. ప్రతీ వ్యవస్థా లక్ష్మణరేఖదాటకుండా వ్యవహరించినప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది.

పృథ్వీ పరిరక్షణ పౌర కర్తవ్యం

'మాతా భూమి పుత్రోహం పృథివ్యా' ఈ భూమి నా తల్లి, నేను ఆమె కుమారుడిని అన్నది అథర్వణ వేదంలో చెప్పిన ఈ సూక్త భాగానికి భావం. ఈ రోజు ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో సమస్త జీవరాశులకు ఆధారమైన ఈ భూమిని కాపాడుకునే దిశగా ప్రతినబూనడం మనందరి కనీస బాధ్యత. ఈ విశాల విశ్వంలో జీవం మనుగడ ఉన్న భూమి లాంటి మరో గ్రహం ఉన్నట్లు ఇంతవరకు ఆధారాలు లేవు. చైతన్యపూరితమైన జీవం ఉన్నది ఈ భూమిపైనే. అరుదైన ఆ చైతన్యాన్ని మనం కాపాడుకోవాలంటే ఈ భూమిని కాపాడుకోవాలి. ఈ భూమి లేకపోతే ఈ చైతన్యం లేదు. మనం లేము. ఈ ఎరుకను భావితరాల్లో నింపేందుకు ప్రయత్నాలు మన నుంచే ప్రారంభం కావాలి. ఇందుకోసం ముందు మనం ఈ భూమిని కాపాడుకుని, భవిష్యత్ తరాలకు అందించాలి.


akbar

భూమిని తల్లిగా మనసా వాచా కర్మణా భావిస్తూ, జీవం మనుగడకు ప్రకృతే ఆధారం అన్న గొప్ప ఎరుక వేదకాలంలోనే మన పెద్దలు తెలియజేశారు. ప్రకృతిని పరిరక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని నమ్మి, ఆచరించిన ధన్యభూమి మనది. చెట్టూ పుట్టకు మొక్కి, పాముకు పాలు పోసి, చీమకు చక్కెరపెట్టి, పశువుకు దణ్ణం పెట్టే సంస్కృతి మనది. అటువంటి సంస్కృతికి దూరం అవుతున్న కొద్దీ విపరిణామాలు దగ్గరవుతున్నాయి. ప్రకృతి గొప్పతనాన్ని వివరిస్తూ బోధించిన విజ్ఞానాన్ని అవహేళన చేసే పరిస్థితి దాపురించింది. పాశ్చాత్య అభివృద్ధి నమూనాతో ఈ భూమిని, భూమిని ఆవరించుకుని ఉన్న ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల దుష్ఫలితాలను ఎదుర్కొంటున్నాం. తాగునీటిని సీసాల్లో కొనుక్కోవాల్సిన దుస్థితికి చేరుకున్నాం. అంతేకాదు.. అకాల వర్షాలు, అతివృష్టి, అనావృష్టి, భూతాపం పెరిగిపోవడం వంటి విపత్తులతో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి.

ప్రపంచంలో మంచి నీటికి, కొన్ని ప్రధాన నదుల పుట్టుకకు మూల వనరులు అయిన హిమానీ నదాలు (గ్లేసియర్లు) చాలా వేగంగా కరిగిపోతున్నాయన్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా భూతాపం పెరిగి మంచు కొండలు, హిమానీ నదాలు చాలా వేగంగా కరిగిపోవడం కారణంగా నీటి చక్రం (మంచు కొండలు కరిగి నీటిగా మారడం, ఆ నీరు ఆవిరవడం, ఆవిరయిన నీరు వర్షంగా మారి తిరిగి భూమికి చేరడం– ఇదంతా ఒక క్రమబద్ధమైన చక్రం) అనూహ్య మార్పులకు లోనవుతోంది. ఫలితంగా తాగునీటి కొరత ఏర్పడడంతో పాటు సముద్ర మట్టం పెరిగిపోయి భూభాగం ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది.

భూమిపై అందుబాటులో ఉన్న మంచి నీటిలో 70 శాతం మంచు, హిమానీ నదాల రూపంలో ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు 200 కోట్ల మంది ప్రజలు... హిమానీ నదాలు, మంచు కరగడం వల్ల వచ్చే నీటిపై, కొండలపై నుంచి ప్రవహించే నీటిపై ఆధారపడుతున్నారు. ఒక్క 2023లోనే హిమానీ నదాలు వేగంగా కరగడం వల్ల 600 గిగా టన్నుల నీటిని కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. గత 50 ఏళ్ల చరిత్రలో ఇదే అత్యంత ఎక్కువ నష్టం. 1900 నుంచి ఇప్పటికి 20 సెంటీమీటర్లకు పైగా సముద్ర మట్టం పెరిగిందని నివేదికలు చెబుతున్న మాట ఎంతో కలవరపర్చే అంశం. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే నీరు అత్యంత విలాస వస్తువుగా మారిపోతుంది. నీటి కోసం యుద్ధాలు సంభవిస్తాయి. ఇప్పటికే నీటి కోసం ప్రజల మధ్య, దేశాల మధ్య సంఘర్షణ వాతావరణం నెలకొని ఉండడం, పాత ఒప్పందాలను కాలరాయడానికి కూడా తెగబడడాన్ని మనం చూస్తున్నాం.

> మన భారత భాగ్య విధాతలు కలలుగన్న కాలుష్య రహితమైన భూమిని భవిష్యత్ తరాలకు అందించడమే ఆ మహనీయులకు అందించే నిజమైన నివాళి. ఈ ప్రకృతి సంపదకు మనం ధర్మకర్తలమే కానీ యజమానులం కాదన్న జాతిపిత మహాత్మాగాంధీ బోధనలను ఆచరణలో చూపించాలి. ప్రకృతి వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం మాత్రమే కాదు, అది మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.



నీటికి, అడవులకు అవినావాభావ సంబంధముంది. అడవులను కాపాడుకుంటే వర్షపాతం పెరుగుతుంది. వర్షపాతం పెరిగితే అది మళ్లీ అడవుల మనుగడకు ఉపయోగపడుతుంది. కానీ అభివృద్ధి పేరుతో అడవులను ఆక్రమిస్తూ, విధ్వంసానికి కారణమవడం వల్ల కూడా నీటి చక్రం తారుమారవుతోంది. అడవులు సహజసిద్ధమైన జలాశయాలు. వర్షపాతాన్ని ఇముడ్చుకుని భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా కాపాడతాయి. అడవులను విచ్చలవిడిగా నరికి వేయడం వల్ల పచ్చదనం తగ్గి, వర్షపాతం తగ్గి కరవు పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

పారిశ్రామికీకరణకు ముందు ఉన్న ఉష్ణోగ్రతల కన్నా 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రతలు పెరగకుండా చేస్తే ప్రపంచంలోని ప్రాచీన హిమానీ నదాల్లో మూడింట రెండోవంతు హిమానీ నదాలను కాపాడుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకు కర్బన ఉద్గారాలను తగ్గించడం అత్యంత అవసరమైన పని. భూతాపంలో పెరుగుదల 2 డిగ్రీల సెల్సియస్ – 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్న పారిస్ ఒప్పందానికి మన దేశం కట్టుబడి ఉంది. అభివృద్ధి చెందిన దేశాలు చిత్తశుద్ధితో ఈ ఒప్పందానికి కట్టుబడడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించడానికి కావాల్సిన నిధులను అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందిస్తే సమస్త మానవాళికి మేలు.

భారతదేశ పౌరులుగా మనమందరం కూడా మనవంతు కర్తవ్యం నెరవేర్చాలి. పెట్రోలు, డీజిల్ వంటి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకుంటూ పునర్వినియోగ ఇంధనం వైపు, శుద్ధ ఇంధనం వైపు మరలాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ ఇంధన వనరుల్లో సౌర విద్యుత్తు ఉపయుక్తం. గృహ వినియోగానికి సౌర విద్యుత్తును కేంద్ర ప్రభుత్వం రాయితీతో ప్రోత్సహిస్తోంది. ప్రజలు దీన్ని పెద్ద ఎత్తున ఉపయోగించుకోవాలి. ఇప్పుడు ఎక్కువ మంది ఇళ్లల్లో తాగునీటికి ఆర్వో పరికరాలను వాడుతున్నారు. వాటిల్లో నీటి వృథా ఎక్కువగా ఉంటుంది. ఆ నీటిని వృథాగా సింకుల్లోకి వదలకుండా మొక్కలకు పారేలా ఏర్పాట్లు చేసుకోవాలి. లేదంటే ఆ నీటిని సమీకరించే ఏర్పాటు చేసుకుని ఇతరత్రా అవసరాలకు వాడుకోవాలి. నీటిని పునర్వినియోగించుకునే పద్ధతులను అలవర్చుకోవాలి.

భూమి సహజ స్వభావాన్ని నాశనం చేస్తున్న అంశాల్లో ప్లాస్టిక్ ఒకటి. ఈ రోజు మన జీవితాల్లోకి ప్లాస్టిక్ బాగా చొచ్చుకొచ్చేసింది. పాత్రల నుంచి ప్యాకేజింగ్ వరకు అంతా ప్లాస్టిక్కే. ప్లాస్టిక్‌పై సరైన అవగాహన లేకుండా వినియోగిస్తే, దానివల్ల వాటిల్లే నష్టం ఎక్కువ. మైక్రో ప్లాస్టిక్స్ దీర్ఘకాలంలో విషపూరిత రసాయనాలు విడుదల చేస్తాయని, అవి ఆహార చక్రంలోకి చేరి మానవాళి సహా జీవజాలం మొత్తానికి తీవ్ర హాని కలిగిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి ఏటా 460 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తుంటే 20 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ పర్యావరణంలోకి చేరుతోంది. ఇది భూమిలో తొందరగా కలవదు. దీంతో జీవావరణానికి చాలా నష్టం జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దాదాపు 10 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ ప్రతి ఏటా సముద్రాల్లో కలుస్తూ జీవావరణానికి విపరీత నష్టం కలిగిస్తోంది. సాధ్యమయినచోట వస్తువులను తీసుకువెళ్లడానికి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జౌళి సంచులు వంటివి ఉపయోగించాలి. ప్లాస్టిక్ పాత్రలకు బదులు మట్టి పాత్రలు, దీర్ఘకాలం మన్నే స్టీలు పాత్రల వంటివి వాడుకోవాలి.

జలవనరులను కలుషితం చేయడం, ఎక్కడికక్కడ చెత్త పారవేయడం వంటివి కూడా భూమి స్వభావాన్ని ప్రభావితం చేస్తున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేస్తూ పునర్వినియోగానికి వీలుగా ఉన్నవాటిని పునర్వినియోగరూపంలోకి తీసుకొచ్చే ఏర్పాట్లు, ఇంధనం ఉత్పత్తి చేసే ఏర్పాట్లు, అందుకు తగ్గ విధానాలున్నా ఆచరణలో ఇంకా చాలా అవరోధాలున్నాయి. మన సమాజం ఇంకా ఈ పద్ధతులకు అలవాటుపడలేదు. నినాదాలకు పరిమితం కాకుండా ప్రజల్లో క్షేత్రస్థాయి నుంచే మార్పు వచ్చేలా ఆచరణాత్మక విధానాలు రూపొందించి అమలు చేయాలి.

మన మనుగడకు ఆధారం అయిన ఈ ధరిత్రిని కాపాడుకోవడానికి మనమందరం ఈ పంచసూత్రాలను అవలంబించాలి: 1. వినియోగ తత్వాన్ని తగ్గించుకుంటూ దీర్ఘకాలం మన్నే వస్తువులను వాడడం; 2. చెట్లను విచ్చలవిడిగా కొట్టకుండా, వీలయినన్ని ఎక్కువ మొక్కలు నాటుతూ అటవీ సంపదను పెంచడం; 3. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించుకుంటూ సౌరవిద్యుత్తు వంటి శుద్ధ ఇంధనం వైపు మరలడం; 4. జలవనరులను పరిరక్షించుకోవడం, ఆక్రమణలను తొలగించడం; 5. పూర్వ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ప్రకృతి వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించడం, ఆచరణలో పెట్టించడం.

'సుజలాం సుఫలాం మలయజశీతలామ్
సస్యశ్యామలాం మాతరం వందే మాతరం' అంటూ స్వరాజ్య ఉద్యమ సమయంలో మన భారత భాగ్య విధాతలు కలలుగన్న కాలుష్యరహితమైన భూమిని భవిష్యత్ తరాలకు అందించడమే ఆ మహనీయులకు అందించే నిజమైన నివాళి అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ప్రకృతి సంపదకు మనం ధర్మకర్తలమే కానీ యజమానులం కాదన్న జాతిపిత మహాత్మాగాంధీ బోధనలను ఆచరణలో చూపించాలి. ప్రకృతి వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. అది మనందరి బాధ్యత అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించినప్పుడు ఈ స్ఫూర్తి తరతరాలకు పరిఢవిల్లుతుంది.

■ ముప్పవరపు వెంకయ్యనాయుడు
పూర్వ ఉపరాష్ట్రపతి

(నేడు ధరిత్రి దినోత్సవం)

అక్షరాలూ రంగుల సవ్యసాచి

మన సాహిత్యంలో నవల, కథ, కవిత, గేయం, నాటకం, పద్యం వంటి ప్రక్రియలు ఉన్నట్లే, చిత్రకళలో కూడా వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్, చార్‌కోల్, కలర్ పెన్సిల్, పేస్టల్స్, కత్తిరింపుల కళ, పేపర్ ఆర్ట్, మ్యూరల్స్ వంటి పలు రకాల ప్రక్రియలు ఉన్నాయి. శీలా వీర్రాజు అటు సాహిత్యంలోనూ, ఇటు చిత్రకళా రంగంలోనూ సమకృషి చేసి రెండు రంగాల వారిని మెప్పించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈ రెండు కళారంగాల్లో కృషి కొనసాగించినవారు అరుదు. రాంభట్ల కృష్ణమూర్తి, అడవి బాపిరాజు, చలసాని ప్రసాదరావు, సంజీవదేవ్, వేలూరి రాధాకృష్ణ, తలిశెట్టి రామారావు, పిలకా లక్ష్మీనరసింహమూర్తి, అంట్యాకుల పైడిరాజు, రాజాజీ, జింకా రామారావు, ఆకురాతి రామకృష్ణ, ఇనపకుర్తి చిన సత్యనారాయణ, బాలి, ఎస్వీ రామారావు, వడ్డాది పాపయ్య, అబ్బూరి గోపాలకృష్ణ, బి.ధర్మారావు, బాలగోపాల భాస్కరరాజు, చేమకూర సత్యనారాయణ, ద్వివేదుల సోమనాథశాస్త్రి, యాడూరి రామచంద్రరావు, కొండిపర్తి శేషగిరిరావు, మాధవపెద్ది గోఖలే, మారేమండ శ్రీనివాసరావు, పల్లా పర్శినాయుడు, తాడి మోహన్, తిప్పాని వెంకటరావు, ఉండ్రు ఆశీర్వాదం తదితరులు సాహిత్య, చిత్రకళా రంగాల్లో కృషిచేసి రెండు రంగాల్లోనూ గుర్తింపు పొందారు.



తొలితరం చిత్రకారులైన దామెర్ల రామారావు సన్నిహితుడు వరదా వెంకటరత్నం శిష్యుడైన శీలా వీర్రాజుగారు వందలాది వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలు వేశారు. కొందరి చిత్రాల్లా వీర్రాజుగారి చిత్రాలు చూసిన వెంటనే ఇది వాటర్ కలర్ అనీ, ఇది ఆయిల్ కలర్ అని చెప్పడం కష్టం. ఆయన తన తైలవర్ణ చిత్రాల్ని సహజ సుందరంగా ఉండే రంగుల్లో చూపించగా, నీటిరంగుల చిత్రాలకు ప్రాథమిక వర్ణాలను అద్దారు.

శీలా వీర్రాజు చిత్రకళలో ముఖ్య విభాగాలు స్కెచ్‌లు, వాటర్ కలర్స్, ఆయిల్ పెయింట్స్. ఒక్క మాటలో చెప్పాలంటే కార్టూన్లు తప్ప మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఆయన సాధన చేశారు. వందలాది కథలు, నవలలు చదివి అందులో రచయిత/ రచయిత్రి చెప్పిన ముఖ్య విషయాన్ని వీర్రాజు రేఖల్లో చెప్పేవారు. బాపు తర్వాత ఎక్కువమంది నాటి రచయితలు తమ గ్రంథాలకు చిత్రాలు, వీర్రాజు గారిచే వేయించుకోవాలని ఆరాటపడేవారంటే ఆయన చిత్ర ప్రతిభ ఊహించవచ్చు. ఆయన వెయ్యికి పైగా గ్రంథాలకు ముఖచిత్రాలు చిత్రించారు. అవన్నీ కూడా ఒక గ్రంథంగా త్వరలో రానున్నాయి.

సుప్రసిద్ధ దర్శనీయ స్థలాలైన లేపాక్షి, భువనేశ్వర్, కోణార్క్, ఎల్లోరా, పాకాల, అమరావతి, ఉండవల్లి, పానగల్లు, ఆంధ్ర మహావిష్ణు ఆలయం, శ్రీకాకుళం, వరంగల్లు, హనుమకొండ, శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవాలయం, గోల్కొండ కోట, బిర్లా వెంకటేశ్వరాలయం తదితరాల్ని ఇండియన్ ఇంక్ స్కెచ్‌లుగా గీసి, సజీవ శిల్పాలుగా మన ముందు వుంచారు. శిల్ప రేఖల్లో వేగం, జీవం మనం ప్రత్యేకంగా గమనించవచ్చు. ఇంకా ఆయన తిరుపతి వేంకటకవులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, కుందుర్తి, బుచ్చిబాబు వంటి తనకిష్టమైన రచయితల రూపచిత్రాల్ని రేఖల్లో చూపించారు.

తొలితరం ఆంధ్ర చిత్రకారులైన దామెర్ల రామారావు సన్నిహితుడు వరదా వెంకటరత్నం శిష్యుడైన వీర్రాజుగారు వందలాది వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలు వేశారు. కొందరి చిత్రాల్లా వీర్రాజుగారి చిత్రాలు చూసిన వెంటనే ఇది వాటర్ కలర్ అనీ, ఇది ఆయిల్ కలర్ అని చెప్పడం కష్టం. ఆయన తన తైలవర్ణ చిత్రాల్ని సహజ సుందరంగా ఉండే రంగుల్లో చూపించగా, నీటిరంగుల చిత్రాలకు ప్రాథమిక వర్ణాలను అద్దారు. నాటి గ్రామీణుల పండుగలు, అలంకరణలు, సంస్కృతి, కట్టు, బొట్టు, నేపథ్యం... ఇవీ ఆయన ప్రధాన ఇతివృత్తాలు. నాటి సంస్కృతిని తన చిత్రాలతో కళ్ళకు కట్టారు. 'చెరువు నుంచి' చిత్రంలో ఎనిమిది మంది మహిళలు ఇత్తడి, రాగి, మట్టి కుండలతో నీళ్లు తెస్తున్న దృశ్యం నేటి సమాజంలో మనకు ఎక్కడా గోచరించదు. చిత్రకారుణి సూక్ష్మపరిశీలనకు నిలువెత్తు నిదర్శనం ఈ చిత్రం. ఇంకా వారు గీసిన– 'మహాకవి పోతన', 'ఏటికెదురు', 'పళ్ళ మార్కెట్', 'కేశాలంకరణ', 'దీపావళి సంబరం', 'దంచడం', 'తిరగలి', 'సంత నుంచి', 'చలిమంట', 'మేదరుల జీవనం', 'చెమ్మచెక్క', 'హరిదాసు', 'మట్టి మనుషులు', 'కమ్మరి', 'క్షురకుడు', 'గొబ్బెమ్మ'... అత్యద్భుతమైన వర్ణ దృశ్యాలు, కావ్యాలు.

వీర్రాజుగారితో నాకు ప్రత్యక్ష సంబంధం లేకపోయినా, వారితో 2012 నుంచి ఒక దశాబ్దం పాటు పరోక్ష సంబంధం వుంది. హైదరాబాద్‌కు చెందిన సిపి బ్రౌన్ అకాడెమీ కోరికపై నేను 'జాతిరత్నం: వడ్డాది పాపయ్య' జీవితచరిత్ర వ్రాశాను. అకాడెమీవారు ఆ గ్రంథాన్ని పరిశీలన నిమిత్తం శీలా వీర్రాజుగారికి పంపారు. ఆ గ్రంథాన్ని చదివి ఆయన చాలా విలువైన విషయాల్ని తెలిపారు. కొరకరాని కొయ్యగా పేరొందిన వపాతో స్నేహం చెయ్యడంతో పాటు, కొయ్యని కొరికిన అసాధ్యుడివి అని అభినందించారు.

2017 ఏప్రిల్ 28, 29 తేదీల్లో విశాఖ మ్యూజియంలో వీర్రాజుగారి వ్యక్తిగత చిత్రకళా ప్రదర్శన నిర్వహించి విశాఖ చిత్రకళాభిమానులకు ఆయన చిత్ర ప్రతిభను మా చిత్రకళా పరిషత్ ద్వారా పరిచయం చేశాం. వారి అనారోగ్య కారణంగా వారి పరోక్షంలో ఈ కళాప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో దాదాపు 30కి పైగా వాటర్, ఆయిల్ కలర్ చిత్రాలను ప్రదర్శించాం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖలో అనువాదకుడిగా ఎన్నో ఒత్తిడులు ఎదుర్కొంటూ సాహిత్య, చిత్రకళా రంగాల్లో వీర్రాజుగారు తనదైన చెరగని ముద్ర వేశారు. పొగడ్తలకు, ప్రశంసలకు అవకాశం ఇవ్వకుండా తన కళా కృషిని మౌనంగా కొనసాగించిన వీర్రాజుగారి ప్రతిభను మన ప్రభుత్వం గుర్తించక పోయినా, సాహితీ, కళాభిమానులు వారి ప్రతిభను గుర్తించారు, ఉచిత రీతిన అనేక సంస్థలు గౌరవించాయి. రాజమహేంద్రవరంలో వీర్రాజుగారు చిత్రకళ అభ్యసించిన దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో దామెర్ల, వరదా, రాజాజీ వంటి ఉద్దండుల చిత్రాలతో పాటు వీర్రాజుగారి చిత్రకళా వర్ణ వైభవాన్ని మనం చూడవచ్చు.

○ సుంకర చలపతిరావు

(నేడు శీలా వీర్రాజు జయంతి)

పర్యావరణ విద్యను నవీకరించాలి

ప్రపంచం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్‌డీజీ), కార్బన్ ట్రేడింగ్, గ్రీన్ ఎనర్జీ, క్లైమేట్ టెక్నాలజీస్ వంటి వినూత్న మార్గాల్లో దూసుకుపోతోంది. భారత్ 2030 నాటికి ఎస్‌డీజీలను చేరాలన్న లక్ష్యంతో పాటు, 2045 కల్లా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, 2070 నాటికి నెట్–జీరో దేశంగా మారడం లక్ష్యంగా పెట్టుకుంది.

కానీ, మన విద్యా విధానం పర్యావరణాన్ని ఇంకా ప్రాథమిక స్థాయిలో మాత్రమే విద్యార్థులకు బోధిస్తోంది. పాఠ్యాంశాలు పాతవి, దృష్టి కోణం మరీ పాతది! పర్యావరణ విద్య అంటే 'కాలుష్యం, మొక్కలు నాటడం, అటవీ సంరక్షణ' అనుకునే స్థాయికే విద్యార్థులు పరిమితం అవుతున్నారు. ఫలితంగా వారు, పర్యావరణ శాస్త్రాన్ని విలువలేని విషయంగా, తక్కువగా చూస్తున్నారు. కార్బన్ క్రెడిట్స్, ఈఎస్‌జీ ఫ్రేమ్‌వర్క్‌లు, సస్టైనబిలిటీ వంటి కీలక అంశాలు తెలియనప్పుడు– రేపటి గ్రీన్ ఎకానమీ అవకాశాల్లో వారు ఎలా పోటీపడగలరు? మన ప్రముఖ విశ్వవిద్యాలయాల్లోని పర్యావరణ విభాగాలు కూడా దశాబ్దాల కిందటి పాఠ్యాంశాలకే పరిమితమయ్యాయి! అంటే సిలబస్‌ను నవీకరించకుండా, విద్యార్థుల భవిష్యత్తును పాతబడిన విద్యతోనే మనం నిర్దేశిస్తున్నామన్న మాట. అందుకే పాఠ్యప్రణాళికలోని 'పర్యావరణ విద్య' సిలబస్‌ను ఆధునీకరించాల్సిన అవసరం ఉంది.

మార్పు ఒక అవసరం కాదు– అది మన భవిష్యత్తును నిలబెట్టే అద్భుత సాధనం. పర్యావరణాన్ని ఒక సబ్జెక్ట్‌గా చూడటం ఆపాలి– దాన్ని ఒక సమిష్టి బాధ్యతగా, ఒక జీవన దిశగా స్వీకరించాలి.

– డా. పేటేటి శేషబాల

జనారణ్యం మధ్య వనజీవి


నడిచే చెట్టులా కనిపించేవాడు దరిపెల్లి రామయ్య. పాతబడిన స్కూటీకి ఇరువైపులా విత్తన గింజల సంచులు, నీళ్లు నింపుకున్న ప్లాస్టిక్ బాటిళ్లూ తగిలించుకొని ఊళ్ల దారుల్లో ఆయన ముందుకు సాగుతూ ఉంటే, హరిత వనమేదో జవజీవాలతో కదులుతున్నట్టు అనిపించేది. అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం కేవలం ప్రభుత్వాల బాధ్యతే అనేలా పరిస్థితులు మారిన తరుణంలో– రామయ్య విలక్షణమైన వ్యక్తిలా కనిపించేవాడు. ఎవరేమనుకున్నా 'నా దారి పర్యావరణ దారి' అనే నైజాన్ని ఒంటబట్టించుకొని రామయ్య జీవిత పర్యంతం ఒంటరిపోరు చేశాడు. ఖమ్మంలో, ఆ మాటకొస్తే తెలుగునాట హరితస్పృహను రగిలించడంలో రామయ్యది ప్రత్యేకమైన స్థానం. చివరి శ్వాస వరకూ రామయ్య వన రుషిగా బతికాడు. 79 ఏళ్ల వయస్సులో నిద్రలోనే తనువు చాలించాడు. ఆయనది సార్థక జీవితం. ఆనాడు రామయ్య అజ్ఞాతవాసంలో కీకారణ్యంలో వనజీవిగా సంచరిస్తే ఈ రామయ్య జనారణ్యంలో మొక్కవోని దీక్షతో అభినవ వనజీవిగా సంచరించాడు.

తరిగిపోతున్న అడవులతో పర్యావరణపరంగా విపరిణామాలు తలెత్తుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా అన్ని దేశాలకు చెట్ల పెంపకం ఒక ఎజెండాగా మారిపోయింది. పాలకులు వ్యవస్థాగతంగా చేపట్టిన 'హరితహారం', 'వనమహోత్సవం' కంటే ఈ కార్యాచరణను యాభై ఏళ్ల క్రితమే దరిపెల్లి రామయ్య ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఒంటరిగా చేపట్టడం గొప్ప ఆదర్శంగా గోచరిస్తుంది.

కుమ్మరి సామాజికవర్గానికి చెందిన రామయ్య తల్లిదండ్రులు లాలయ్య–పుల్లమ్మ కులవృత్తిని నమ్ముకొని బతికేవారు. బతుకు దెరువు కోసం వారు ఖమ్మం రూరల్ మండలంలోని ముత్తగూడెం నుంచి ఖమ్మం పట్టణ శివారులోని రెడ్డిపల్లికి వలస వచ్చారు. అక్కడే సర్కారు పాఠశాలలో రామయ్య చేరాడు. ఐదో తరగతిలో మల్లేశం అనే ఉపాధ్యాయుడు చెట్లను నాటడం, వాటిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో బోధించాడు. ఆ మాటలు రామయ్యపై ఎంతో ప్రభావం చూపాయి. అప్పటి నుంచి మొక్కలు నాటడంపై రామయ్య మక్కువ పెంచుకున్నాడు. తొమ్మిదేళ్ల వయస్సులో ఆయనకు జానమ్మతో వివాహమైంది. వయస్సు పెరుగుతున్న కొద్దీ ఆయనలో వనస్పృహ పెరుగుతూ వచ్చింది. జానమ్మతో వివాహమైన తర్వాత, పిల్లలు పుట్టిన తర్వాత కూడా దానిని విడిచిపెట్టలేకపోయాడు. బతకడమే గగనమైన రోజులవి. పని చేస్తేనే పూట గడిచే కుటుంబం వారిది. బతుకుతెరువుకు ఒకవైపు వ్యవసాయం చేస్తూ, ఊరూరా పాలు అమ్ముతూ ప్రవృత్తిగా వనయజ్ఞాన్ని చేపట్టాడు. ఆ తర్వాత అదే తన జీవితమైంది.

రూపాయి ఖర్చు లేకుండా ప్రకృతి ఆలంబనగా రామయ్య సాగించిన వనయజ్ఞం అబ్బురపరుస్తుంది. తొలిదశలో కేవలం మొక్కలను సేకరించి, నాటడం చేస్తే, ఆ తర్వాత వేసవిలో చెట్ల కాయలను, విత్తన గింజలను సేకరించి, వానా కాలంలో ఖాళీ స్థలాల్లో చల్లడం, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలను నాటడం పనిగా పెట్టుకున్నాడు. రూపాయి రాబడి లేకున్నా మల్లేశం సారు చెప్పిన మాటలు ఆయనలో మొక్కవోని దీక్షను కలిగించాయి.

> "నేను ఒక్కడినే గింజలు ఏరుతున్నప్పుడు, వాటిని విత్తుతున్నప్పుడు అందరూ నన్ను పిచ్చోడు అనుకునేవారు. నేను వారి మాటల్ని పట్టించుకునేవాడిని కాదు. వర్షాలు కురవాలంటే, పవనాలు రావాలంటే చెట్లు ఒక్కటే శరణ్యం. అందువల్ల పచ్చని చెట్లే నాకు లోకంలా మారాయి" – దరిపల్లి రామయ్య



ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్ల వెంట, పుట్టల వెంట రామయ్య విత్తనగింజల కోసం రోజంతా తిరుగుతుండేవాడు. తిరిగి వానాకాలంలో ఒక్కడే ఖాళీ స్థలాల్లో చల్లుతూ ఉండేవాడు. సైకిలే ఆయన వాహనం. ఆయన వెనుక ఎవరూ లేరు. ఆయన వెంట ఎలాంటి బృందమూ లేదు. "నేను ఒక్కడినే గింజలు ఏరుతున్నప్పుడు, వాటిని విత్తుతున్నప్పుడు అందరూ నన్ను పిచ్చోడు అనుకునేవారు. నేను వారి మాటల్ని పట్టించుకునేవాడిని కాదు. వర్షాలు కురవాలంటే, పవనాలు రావాలంటే చెట్లు ఒక్కటే శరణ్యం. అందువల్ల పచ్చని చెట్లే నాకు లోకంలా మారాయి," అని ఓ సందర్భంలో తన మనోగతాన్ని వెల్లడించాడు.

రామయ్య మొక్కవోని దీక్షకు ఆయన భార్య జానమ్మ కూడా అనివార్యంగా వెన్నంటి నిలిచింది. దీంతో ఆయన 'ఏకో'పాసన నిర్విఘ్నంగా ముందుకుసాగింది. కుటుంబ బాధ్యతలు, నలుగురు పిల్లల పోషణ, పెళ్లిళ్లు అన్నింటిలో జానమ్మ ముఖ్యపాత్ర వహించింది. జానమ్మ లేకుంటే రామయ్య వన యజ్ఞం అంత సాఫీగా ముందుకు సాగేది కాదు. రామయ్య చెట్టులాంటి వాడైతే, జానమ్మను వేరుగా భావించాల్సి ఉంటుంది. రామయ్యతో ఏడు దశాబ్దాల పాటు జీవనయానం సాగించిన జానమ్మ ఇప్పుడు జీవనదారుల్లో ఒంటరిగా మిగిలిపోయింది.

రామయ్య తన జీవితంలో దాదాపు 50 ఏళ్ల వన యజ్ఞాన్ని ఉధృతంగా సాగించాడు. ఆయన చేతి చలువ వల్ల కోటికి పైగా మొక్కలు పెరిగాయని చెబుతారు. రామయ్య ఆచరించిన వనయజ్ఞం మొక్కలకు సంబంధించి అపార జ్ఞానాన్ని తెచ్చి పెట్టింది. ఆయన 250 రకాల మొక్కల పేర్లను, వాటి గుణగణాలను, ఉపయోగాలను ఏకరువు పెట్టేవాడు. వేప, సుబాబుల్, కానుగ, నిద్రగన్నేరు వంటి మొక్కలను ఆయన ఎక్కువగా నాటగా, చివరి దశలో ఎర్రచందనం, శ్రీచందనం వంటి మొక్కలను కూడా నాటాడు. భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ఎర్రచందనం, శ్రీచందనం వంటి మొక్కలు ప్రభుత్వానికి ఆర్థిక బడ్జెట్‌లా ఉపయోగపడతాయని ఆయన నమ్మేవారు.

ఒంటరిగా, నిస్వార్థంగా రామయ్య చేసిన కృషికి అంత సులభంగా గుర్తింపు దక్కలేదు. ఆయన పుట్టిన కులమో, ఆయన ఆహార్యమో, ఆయన చదువో... కారణమేదో తెలియదు గానీ, ప్రభుత్వం నుంచి ఆశించిన ప్రోత్సాహం, అండ దక్కలేదు. పర్యావరణంపై ఆయన పెంచుకున్న అలవిమాలిన ప్రేమ ఆయనకున్న భూమిలో మూడెకరాలను హరించి వేయగా, పిల్లలకు ఉన్నతమైన చదువులను అందించలేక పోయింది. రామయ్య ముగ్గురు కుమారుల్లో ఇద్దరు అనారోగ్యంతో చనిపోయారు. వారసులు దిగువ మధ్యతరగతి జీవితాలను అనుభవిస్తున్నారు.


2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును బహూకరించిన తర్వాతే రామయ్యకు సమాజంలో గౌరవ మర్యాదలు దక్కాయి. "ఒకప్పుడు నన్ను చూసి ఎగతాళి చేసినవారు పద్మశ్రీ అవార్డు వచ్చిన తర్వాత నాకు నమస్కారం పెట్టడం మొదలుపెట్టారు" అని రామయ్య ఓ సందర్భంలో పేర్కొన్నాడు. రామయ్య ఆచరించిన మార్గాన్ని వారసులు అందిపుచ్చుకోలేదు గానీ, వారు తమ పిల్లలకు మాత్రం తాత స్ఫూర్తితో కబంద పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టుకున్నారు.

రామయ్య కన్నుమూసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రులు రేవంతరెడ్డి, చంద్రబాబు ఇంకా అనేక మంది ప్రముఖులు సంతాపాలు తెలిపారు. పర్యావరణ సుస్థిరతకు రామయ్య చేసిన కృషి ఎంతో విలువైనదని కొనియాడారు. ప్రభుత్వాలు వ్యవస్థాపరంగా చేయలేని కార్యాన్ని రామయ్య విజయవంతంగా చేసి చూపించాడు. అర్బన్, సెమీ అర్బన్ జీవన విధానం పెరుగుతున్న నేటి జమానాలో సహజ వనాలు మాయమై, కాంక్రీట్ వనాలు విస్తరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రామయ్య వేసిన దారిలో నడిచేవారు ఈ సమాజానికి ఎంతో ముఖ్యం. కంచ గచ్చిబౌలిలో పాలకులే వందలాది ఎకరాల్లో వృక్షవిధ్వంసానికి తెగించి పర్యావరణ స్ఫూర్తికి గండికొట్టారు. ఇప్పటికైతే ఈ గండం గట్టెక్కింది గానీ, భవిష్యత్తులో అక్కడ అడవి ఉంటుందో మాయమవుతుందో ఎవరూ చెప్పలేరు.

అందువల్ల అడవుల హననానికి, వృక్ష విధ్వంసానికి విరుగుడుగా ప్రత్యామ్నాయ ప్రక్రియ ఒకటి ఎప్పుడూ కొనసాగుతూ ఉండాలి. అప్పుడే ప్రకృతి సమతౌల్యం సాధ్యం. ఆ ప్రత్యామ్నాయానికి రామయ్య ఆచరించిన యజ్ఞమే ఎప్పటికీ స్ఫూర్తి. ఆయన తాను బతికినన్నాళ్లూ 'వృక్షో రక్షతి రక్షితః' అనే నినాదం గల బోర్డును మెడలో ధరించి జనంలో తిరిగేవారు. ఆయన ప్రదర్శించిన ఆ నినాదమే ఈ సమాజానికి ఎప్పటికీ ప్రాణవాయువు.

● శంకర్‌రావు శెంకేసి
సీనియర్ జర్నలిస్ట్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



మూడేళ్లయినా!

- విజయవాడ గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో నత్తనడకన నిర్మాణ పనులు
- అసంపూర్తిగా పీజీ హాస్టల్, అత్యవసర విభాగాలు
- శిథిలావస్థకు చేరిన పాత వసతి గృహం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, రోగులు
- జూన్ కల్లా పూర్తి చేస్తామంటున్న సూపరింటెండెంట్


అత్యవసర విభాగం కోసం నిర్మిస్తున్న భవనం

ప్రభుత్వ ఆస్పత్రిలో మెగా నిర్మాణాలు తుది దశకు చేరినా అందుబాటులోకి రాకపోవటంతో ఆందోళన నెలకొంటోంది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వెనుక మెడికల్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన బహుళ అంతస్తుల హాస్టల్ భవనం పూర్తయినా తుదిదశ పనులకు నోచుకోకుండా ఆగిపోయింది. జీజీహెచ్‌లో ప్రస్తుత 3వ బ్లాక్ పక్కనే అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేస్తున్న 4వ బ్లాక్ పనులు కూడా సాగుతున్నాయి. ప్రభుత్వాస్పత్రిలో ఈ రెండూ మెగా నిర్మాణాలు. తుది దశకు చేరినా అందుబాటులోకి రాకపోవటంతో అటు వైద్య విద్యార్థులకు, ఇటు రోగులకు ఇబ్బందికరంగా మారింది. ఈ మెగా నిర్మాణాలపై వైద్యారోగ్యశాఖ అధికారులతో పాటు జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, కోస్తా జిల్లాల పేదలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది విజయవాడ గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి. ఇక్కడకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. ముఖ్యంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వచ్చాక సేవలు మరింత విస్తృతమయ్యాయి. అయినప్పటికీ ఆస్పత్రిలో కొన్ని సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రస్తుతం ఎనిమిది విభాగాలున్నాయి. ప్రతి సంవత్సరం ఒక్కో విభాగం నుంచి ఇద్దరు చొప్పున పదహారు మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఉచిత వసతి, భోజనం సదుపాయాలు కల్పిస్తారు. దీనివల్ల ఇక్కడే వైద్యులను తయారు చేసి వైద్యుల కొరత అధిగమించవచ్చని ప్రభుత్వానికి తట్టిన మంచి ఆలోచన ఇది. వీరే కాకుండా వైద్య విద్యనభ్యసించే అనేక మంది ఇక్కడ శిక్షణకు వచ్చే విద్యార్థులకు ఉచిత హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రస్తుతం వైద్య విద్యార్థులు ఉంటున్న భవనం పాతది కావడం, శిథిల స్థితికి చేరటంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వెనుక హాస్టల్ భవనం పనులకు మూడేళ్ల కిందట శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించటం జరిగింది. పీజీ విద్యార్థులు ఉంటున్న ప్రస్తుత భవనం బాగా పాతది కావడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. విద్యార్థులు ప్రతి సంవత్సరం ఈ ఏడాది కొత్త భవనంలోకి వెళ్తామనుకోవడం తప్ప వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ హాస్టల్ అందుబాటులోకి రాలేదు. మెడికల్ విద్యార్థుల కోర్సు పూర్తయ్యేనాటికి కూడా వసతి భవనం పూర్తి కాకపోవడంతో కొత్త హాస్టల్‌లో మిగతా 6లో..

క్రష్ణాజిల్లాలో ఇసుక టెండర్ల వ్యవహారం దుమారం రేపుతోంది. పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని నాలుగు ఇసుక క్వారీలకు టెండర్లు ఆహ్వానించగా, పొరుగు రాష్ట్రాల నుంచి ఆరు సంస్థలు బిడ్‌లు వేశాయి. స్థానిక సంస్థలే పాల్గొనాలనే నిబంధనను అధికారులు పక్కన పెట్టి వీటి బిడ్‌లను పాస్ చేయించారు. అర్హతలేని సంస్థలకు అవకాశం ఇవ్వడంపై స్థానిక సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంలో సిండికేట్ నడుస్తోందని ఆరోపణలు గుప్పించాయి. జిల్లా యంత్రాంగం వాటికి అనుకూలంగా వ్యవహరించిందని విమర్శలు చేస్తున్నాయి. టెండర్లు ఖరారు కాగానే హైకోర్టును ఆశ్రయించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి.



ఇసుక సిండికేట్ వార్!

కృష్ణాజిల్లాలో ఇసుక టెండర్ల దుమారం

- సిండికేట్ కాంట్రాక్టు సంస్థలు, స్థానిక సంస్థల మధ్య రగడ
- పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో నాలుగు క్వారీలకు టెండర్లు
- స్థానికంగా ఉన్న సంస్థలే పాల్గొనాలని ప్రభుత్వ నిబంధన
- బిడ్‌లు వేసిన పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు కాంట్రాక్టు సంస్థలు
- టెక్నికల్ బిడ్‌లలో వాటిని పాస్ చేయించిన మైనింగ్ అధికారులు
- న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న స్థానిక కాంట్రాక్టు సంస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లాలో పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో నాలుగు ఇసుక క్వారీలకు జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు ఇటీవల టెండర్లు ఆహ్వానించారు. పామర్రు నియోజకవర్గం పరిధిలో రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి క్వారీలకు, పెనమలూరు నియోజకవర్గంలో చోడవరం ఇసుక క్వారీకి టెండర్లు పిలిచారు. సగటున ఒక్కో క్వారీకి డజనుకు పైగా కాంట్రాక్టు సంస్థలు బిడ్‌లను వేశాయి. ప్రతి క్వారీలో కూడా స్థానికేతర కాంట్రాక్టు సంస్థలు బిడ్‌లను వేశాయి. టెండరు నిబంధనల ప్రకారం ఇసుక టెండర్లలో పాల్గొనే సంస్థలు కృష్ణాజిల్లాకు చెందిన స్థానిక సంస్థలు అయి ఉండాలి. స్థానికత లేని సంస్థలు టెండర్లకు అర్హత సాధించవు. ఈ నిబంధనలను జిల్లా యంత్రాంగమే నిర్దేశించింది. కానీ అస్మదీయ సంస్థలకు మాత్రం ఈ నిబంధనల మినహాయింపు ఇవ్వటం గమనార్హం. దీంతో మొత్తం ఆరు రాష్ట్రేతర సంస్థలు కృష్ణాజిల్లా ఇసుక టెండర్లలో పాలు పంచుకున్నాయి. వీటిలో ఐదు వరకు హైదరాబాద్‌కు చెందిన సంస్థలు కాగా, ఒకటి హుబ్లీకి చెందిన సంస్థగా ఉంది.

టెక్నికల్ బిడ్‌లలో పాస్ చేయటంతో వివాదం

చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి క్వారీల్లో ఈ ఆరు సంస్థలు టెండర్లు వేశాయి. స్థానిక సంస్థలు కాకపోవటం వల్ల టెక్నికల్ బిడ్‌ల పరిశీలనలోనే వీటిని పక్కన పెట్టాల్సి ఉంటుంది. కానీ జిల్లా యంత్రాంగం ఆ పని చేయలేదు. మైనింగ్ అధికారులకు ఆ మేరకు డైరెక్షన్ ఇవ్వలేదు. స్థానికంగా లేకపోయినప్పటికీ టెక్నికల్ బిడ్‌లలో అర్హత సాధించినట్టుగా చూపారు. ఇక్కడే వివాదం తలెత్తింది. కృష్ణాజిల్లాకు చెందిన సంస్థలే టెండర్లు వేయాల్సి ఉండగా.. పొరుగు రాష్ట్రాల వారు టెండర్లలో పాల్గొన్నా కూడా పాస్ చేయటం వివాదాస్పదంగా మారింది. అధికారుల తీరు తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది. ఆధార్ కార్డును తాత్కాలికంగా మార్చుకున్నంత మాత్రాన స్థానికుడు అయిపోరు. అతని రేషన్ కార్డు కూడా స్థానికంగా ఉండాలి. ఆ ప్రాంతంలో బియ్యం తీసుకుంటూ ఉండాలి. అప్పుడే ఆ ఆధార్ కార్డుకు సార్థకత ఉంటుంది. ఇసుక టెండర్లలో పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు సంస్థలు కూడా జీఎస్టీని తాత్కాలికంగా స్థానిక అడ్రస్‌తో మార్పించుకున్న మాత్రాన ఆ సంస్థ ఎక్కడ రిజిస్ట్రేషన్ అయిందన్నది ప్రధానమైన విషయం. పొరుగు రాష్ట్రాల్లో సంస్థను రిజిస్ట్రేషన్ చేయించుకుని అక్కడ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థలని చెప్పుకోవటమే విడ్డూరం. మైనింగ్ అధికారులు మాత్రం ఆ సంస్థల మిగతా 6లో..

కోర్టును ఆశ్రయించనున్న జిల్లాలోని కాంట్రాక్టు సంస్థలు

టెండర్ల నిబంధనలకు విరుద్ధంగా పొరుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలను తిరస్కరించకుండా టెక్నికల్ బిడ్‌లలో వాటిని పాస్ చేయటంపై కృష్ణాజిల్లాకు చెందిన పలు సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించబోతున్నాయి. టెండర్లు ఖరారు కాగానే ఆధారాలతో సహా కేసు వేసేందుకు సిద్ధం చేసుకోవటం గమనార్హం. ఇప్పటికే లాయర్‌ను పిలిపించుకుని మరీ కేసు గురించి చర్చించినట్టు సమాచారం.

బుడమేరుతో జాగ్రత్త!

- ఈ ఏడాది కూడా 'లా నినా' ప్రభావంతో భారీ వర్షాలు!
- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- బుడమేరు పునరుద్ధరణ పనులకు ఇదే అనువైన సమయం
- వర్షాకాలానికి ముందే తాత్కాలిక పనులు పూర్తి చేయాలి
- శాశ్వత పరిష్కారానికి శాస్త్రీయమైన ప్రతిపాదనలు అవసరం
- నాడు మూడు లక్షల మంది వరద ముంపును చవిచూశారు


నాటి బుడమేరు వరదలకు సజీవ సాక్ష్యం .. ఈ చిత్రం

బెజవాడ దుఃఖదాయిని అయిన బుడమేరుతో తస్మాత్ జాగ్రత్త. ఈ ఏడాది కూడా 'లా నినా' ప్రభావంతో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని తాజాగా వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుడమేరు పునరుద్ధరణ పనులకు ఇదే అనువైన సమయం. వర్షాకాలానికి ముందే తాత్కాలిక పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో బుడమేరుకు శాశ్వత పరిష్కారానికి శాస్త్రీయమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రెండు నెలల సమయాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతే బుడమేరు ముప్పును మరోసారి ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): వాతావరణశాఖ ఈ ఏడాది కూడా భారీ వర్షాలు పడతాయని హెచ్చరికలను జారీ చేసింది. వీటిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతేడాది కూడా ఇదే విధంగా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. హెచ్చరించినట్టుగానే జూన్ - సెప్టెంబరు మధ్య కాలంలో భారీ వర్షాలు కురిశాయి. విజయవాడ నగరం అటు కృష్ణానది, ఇటు బుడమేరు భారీ వరదలను చవిచూసింది. కొన్ని రోజుల పాటు అతలాకుతలమైంది. ఈ ఏడాది కూడా 'లానినా' ప్రభావం కారణంగా భారీ వర్షాలు ఉంటాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. విజయవాడకు దుఃఖదాయనిగా మారిన బుడమేరు పట్ల జాగ్రత్త వహించాలి. బుడమేరు వరదలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బుడమేరు విలయం గాయాలు మానకముందే మరో ప్రమాద హెచ్చరికలు వస్తుండటంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వర్షాకాలానికి ముందుగానే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌లో భాగంగా బుడమేరు సమస్యకు పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంది.

బుడమేరు ప్రయాణం ఇలా..

కొల్లేరు బేసిన్‌లో బుడమేరు అనేది ఒక చిన్న నది. కానీ దీన్ని మనం కాలువగానే భావిస్తాం. ఎందుకంటే నదిలాగా నిరంతర ప్రవాహం ఉండదు. ఆ రూపు కూడా కనిపించదు. కానీ పరివాహక ప్రాంతం అయితే ఉంటుంది. బుడమేరు పొడవు మొత్తం 130 కిలోమీటర్లు. విజయ వాడ నగరంలో బుడమేరు 36 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంటుంది. బుడమేరు పరిధిలో ఎన్టీఆర్ జిల్లాలో ఏ కొండూరు, రెడ్డిగూడెం, జీ కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, విజయవాడ అర్బన్ ప్రాంతాలు ఉండగా.. కృష్ణాజిల్లాలో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, నందివాడ మండలాలు ఉన్నాయి. బుడమేరు అనేది ఏ కొండూరు మండలంలోని కొండల దగ్గర జమ్మలవోలు దుర్గం నుంచి ప్రారంభమవుతుంది. వెలగలేరులోని హెడ్ రెగ్యులేటర్‌కు వచ్చేసరికి 43 కిలోమీటర్ల మేర బుడమేరు ప్రవహిస్తుంది. విజయవాడలో 36 కిలోమీటర్ల మేర ప్రవహించిన తర్వాత ఎనికేపాడు యూటీ దగ్గరకు వచ్చేసరికి బుడమేరు నది కాస్తా మిగతా 6లో..



- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి ఉషా వాన్స్‌కు సాయిపురం గ్రామస్థుల ఆహ్వానం
- టైట్ షెడ్యూల్ వల్ల ఏపీకి రాలేని పరిస్థితి
- మరోసారి ప్రత్యేకంగా కృష్ణాజిల్లాకు ఆహ్వానిస్తామని చెబుతున్న బంధువులు
- ఉషా వాన్స్ స్వగ్రామం వస్తుందేమోనని ఎదురుచూసిన సాయిపురం గ్రామప్రజలు

మీ ఊరికి రండి!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లా అల్లుడు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి చిలుకూరి ఉషా వాన్స్ రెండు రోజుల భారతదేశ పర్యటనకు వచ్చారు. ఉషా వాన్స్ స్వగ్రామం అయిన ఉయ్యూరు మండలం సాయిపురం గ్రామస్థులు మాత్రం 'మీ ఊరు రండి' అంటూ ఆమెకు విజ్ఞప్తులు చేస్తున్నారు. ఉషా వాన్స్ మూలాలు సాయిపురం గ్రామంలోనే ఉన్నాయి. ఉషావాన్స్ తాతయ్య అయిన చిలుకూరి బుచ్చిపాపయ్య శాస్త్రిది సాయిపురం గ్రామం. 1970లోనే ఉషా వాన్స్ తండ్రి చిలుకూరి రాధాకృష్ణ, తల్లి లక్ష్మి అమెరికాకు వలస వెళ్లారు. దీంతో ఉషా బాల్యం, విద్యాభ్యాసం అంతా అక్కడే సాగింది. ఆమె పూర్వీకులు ఎవరూ ఇప్పుడు సాయిపురంలో లేరు. అమెరికా ఉపాధ్యక్షుడి సతీమణి కావటంతో ఆమె పేరు మారుమోగిపోయింది. ఉషా వాన్స్ ఇండియాకు రావటంతో ఆమెను చూడటానికి సాయిపురం గ్రామస్థులు 'మీ ఊరు రండి' అంటూ పిలుస్తున్నారు. అయితే ఉషావాన్స్ ఇండియాలో కేవలం రెండు రోజుల షెడ్యూల్ ఉండటంతో సాయిపురం వచ్చే అవకాశం లేదని సాయిపురం గ్రామ వాసి (ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నారు) చిలుకూరి రామ్మోహనరావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రామ్మోహనరావు ఉషా వాన్స్ తాతయ్య అయిన రామశాస్త్రి చిన్న సోదరుడు. చాలా టైట్ షెడ్యూల్ ఉందని, ఈ కారణంగా ఏపీకి రాలేకపోతున్నారని తెలిపారు. ముఖ్య బంధువులు చెన్నైలో ఉన్నారు. ఉషా వాన్స్ మేనత్త శారద అక్కడే ఉన్నారు. ఆమెను కూడా చూడలేని పరిస్థితి నెలకొంది. విశాఖపట్నంలో ప్రొఫెసర్‌గా పనిచేసిన శాంతమ్మ ఉషా వాన్స్‌కు అమ్మమ్మ వరుస అవుతారు. ఆమెకు ఇప్పుడు 96 సంవత్సరాలు. వీరందరినీ చూడటానికి రావచ్చనుకున్నా.. టైట్ షెడ్యూల్ వల్ల వీలుపడటం లేదని తెలుస్తోంది. మరో ప్రత్యేక సందర్భం చూసుకుని తాము ఉషా వాన్స్‌ను కృష్ణాజిల్లాకు తీసుకురావటానికి ఆహ్వానం పలుకుతామని చిలుకూరు రామ్మోహనరావు వివరించారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.3.02 కోట్లు

8



అంగన్వాడీల ధర్నా

8




మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, బాలసంజీవిని యాప్ మార్పులు, వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నమో.. అమరావతి!

- మే 2న రాజధానిలో పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన
- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- 111 ఎకరాల్లో చురుగ్గా సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు
- 28 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణం
- వీవీపీలకు నలువైపులా 83 ఎకరాల్లో పార్కింగ్ ప్లేస్‌లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిలో మే 2న జరిగే రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన సభ ఏర్పాట్లు 111 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో చురుగ్గా సాగుతున్నాయి. వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో నైరుతి దిక్కున ప్రధాని నరేంద్ర మోదీ రాక కోసం సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నారు. ఇది 28 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడ ప్రధాన వేదిక సాంస్కృతిక వేదిక, గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు. ఈ సభా ప్రాంగణానికి తూర్పు, పడమర, ఉత్తర దిక్కులలో పార్కింగ్ కోసం భూములను కేటాయించారు. మొత్తం తొమ్మిది పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నారు. సభా ప్రాంగణం తూర్పు వైపు అంటే సచివాలయానికి దక్షిణ వైపు వస్తుంది. ఈ ప్రాంతంలో బస్సుల పార్కింగ్ కోసం 15 ఎకరాలను కేటాయించారు. దీని పక్కనే కార్ల కోసం 27 ఎకరాల పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ రెండు పార్కింగ్ స్థలాలకు మధ్యన రోడ్డు ఉంటుంది. సభా ప్రాంగణానికి పడమర దిక్కున వీవీపీల మిగతా 6లో..



టూరు.. ఖరారు

- జిల్లా బ్రాండ్ టూరిజం ప్యాకేజీలకు శ్రీకారం
- ఉమ్మడి కృష్ణా ప్రాంతాల సమ్మిళితంతో 3,4 రోజుల ప్యాకేజీలు
- త్వరలో అధికారికంగా అమల్లోకి తీసుకురానున్న అధికారులు

8


స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు కౌముది దంపతులకు అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో క్యాట్ సభ్యులు

మోపిదేవి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విశ్రాంత డీజీపీ, క్యాట్‌సభ్యులు వీఎస్‌కే.కౌముది సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం కౌముది దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



హెరిటేజ్ వాక్‌లో ఎమ్మెల్యే బుద్దప్రసాద్, గ్రామ ప్రముఖులు

ఘంటసాలలో హెరిటేజ్ వాక్

ఘంటసాల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి హృదయాలను తాకిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. ఘంటసాల గ్రామంలో గాన కచేరి చేసి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హెరిటేజ్ వాక్‌ను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ ఎదురుగా ఉన్న ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పక్కనే ఉన్న గౌతమ బుద్దుని విగ్రహం వద్ద బౌద్ధ భిక్షువు బంతేజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు పూర్వీకులది ఘంటసాల గ్రామం కావటం, ఘంటసాల ఈ ప్రాంతానికి రావటం అదృష్టమన్నారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తిని గుర్తు చేసుకుని హెరిటేజ్ వాక్ నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఘంటసాల వెంకటేశ్వరరావు విడిది చేసిన ఇంటి వరకు హెరిటేజ్ వాక్ కొనసాగింది. జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వేమూరి రాజేష్, కూటమి నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాసవారీ భద్రతా అవార్డులు అందుకుంటున్న ఉద్యోగులు

రైల్వే ఉద్యోగులకు భద్రతా అవార్డులు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ ఉద్యోగులు ముగ్గురికి మార్చినెలకుగాను భద్రతా అవార్డులు లభించాయి. సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సోమవారం జరిగిన వర్చువల్ భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈ అవార్డులను అందజేశారు. సమావేశంలో విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, సికింద్రాబాద్ రైల్ నిలయం ముఖ్య అధికారులు, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ జైన్ భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకున్నందుకు అభినందించారు. దెందులూరు స్టేషన్ సూపరింటెండెంట్ టి.వి.ఎం.యు. మహేశ్వర్, రాజమండ్రి పాయింట్స్‌మెన్ కె.నధానియేల్, రాజమండ్రి రైలు మేనేజర్ లోకేష్ కుమార్‌లకు సేఫ్టీ మంత్ అవార్డులను అందజేశారు.

చంద్రబాబును గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నా

» ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆరాధ్య దైవం అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబును గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను అట్లాంటాలోని కమ్మింగ్ ఎన్టీఆర్ స్టాట్యూ 2450 మౌంటెన్ రోడ్డులోని అట్లాంటా స్టేట్ ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రవాసాంధ్రులతో కలిసి వెనిగండ్ల కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో చంద్రబాబుకు సాటి వచ్చే వ్యక్తి కేవలం మోదీ మాత్రమేనని, ప్రపంచస్థాయి నగరంగా అమరావతి నిర్మాణానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. ప్రవాసాంధ్రులు పి-4లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.


అట్లాంటాలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల


మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్‌బాబు, చిత్రంలో సురక్ష నరసయ్య

మహిళల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

» విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబు

పెనమలూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా పోలీసు సిబ్బంది పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని విజయవాడ సీపీ రాజశేఖరబాబు అన్నారు. సోమవారం కానూరు 'టాప్ స్టార్' ఆసుపత్రిలో సురక్ష ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కేవీ నరసయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎండీ తాతినేని శ్రీనివాస్ సహకారంతో మహిళా పోలీసు సిబ్బందికి నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. మహిళలు కేన్సర్‌పై అవగాహన లేక నిర్లక్ష్యం చేసి ప్రాణం మీదికి తెచ్చుకొంటారని.. అందువల్ల సిబ్బందికి ఒకరోజు క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. 'టాప్‌స్టార్' యాజమాన్యం, సురక్ష నరసయ్యకు సీపీ అభినందనలు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సురక్ష నరసయ్య మాట్లాడుతూ, సీపీ సూచన మేరకు అన్నివర్గాల వారికి మరిన్ని క్యాంపులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. విశాఖ డెయిరీ ఆంజనేయులు మాట్లాడుతూ, కేన్సర్ వ్యాక్సిన్ డొనేట్ చేస్తామని తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు 350మంది మహిళా పోలీసు సిబ్బందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కేన్సరు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా, ఏసీపీ స్రవంతిరాయ్, మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ బాలాజీ

కోర్టు కేసులపై దృష్టి సారించండి

» 24న జిల్లా సమీక్షా సమావేశం

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : కోర్టుకేసుల విషయంలో అలసత్వం లేకుండా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని, అలా చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కోర్టుకేసులను పట్టించుకోకుండా కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వాయిదాకు ముందురోజు స్పందిస్తున్నారని, ఇది సరైనపద్ధతి కాదన్నారు. కలెక్టర్ కోర్టుకు హాజరయ్యే పరిస్థితిని తీసుకురావద్దన్నారు. ఇలాంటి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులందరికీ ఈహెచ్‌సీ పథకం అమలయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 24న జరగనున్న జిల్లా సమీక్షా సమావేశానికి నివేదికలను పంపాలని అధికారులను ఆదేశించారు. మీకోసం అర్జీల పరిష్కారంలో జిల్లా అట్టడుగున ఉండటం విచారకరమన్నారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 201 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మెప్మాపీడీ సాయిబాబు, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ పద్మావతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

దివ్యాంగులకు ప్రభుత్వ ఫలాలు అందాలి

మచిలీపట్నం టౌన్ : దివ్యాంగులకు ప్రభుత్వ ఫలాలు అందాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, నడక కర్రలు పంపిణీ చేశారు. 132 మందికి రూ.15,63,218 విలువ గల పరికరాలను అందించినట్టు సమగ్ర శిక్ష అధికారి ముదిగొండ దూర్జటి ఈ సందర్భంగా తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని సహించబోమని, జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో ఎండను సైతం లెక్కచేయక ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలను సమర్పిస్తున్నారన్నారు. వారి ఆశలను వమ్ము చేయకుండా జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్డీఏ పీడీ ఎఎస్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టర్ లక్ష్మీశకు ప్రజాసమస్యలు వివరిస్తున్న సీపీఎం నేతలు

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

కలెక్టరేట్ : దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు కలెక్టర్ లక్ష్మీశ ల్యాప్‌టాప్‌లు, వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను అందజేసి విద్యారంగంలో మరింత ఉన్నతస్థాయికి చేరేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. జిల్లాలో ఆరుగురు డిగ్రీ విద్యార్థులకు రూ.35 వేల విలువైన ల్యాప్‌టాప్‌లను, ఓ విద్యార్థికి రూ.3,500 విలువగల వినికిడి యంత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, డీఆర్డీఏ పీడీ ఏఎన్‌వి నాంచారరావు, అధికారులు పాల్గొన్నారు.


దివ్యాంగుడికి ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

కలెక్టరేట్ : మహిళల భద్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో 'శక్తి' యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, 1930 టోల్ ఫ్రీతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసి నేరాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల రక్షణ లక్ష్యంగా ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించడం జరిగిందన్నారు. యాప్‌లో వన్‌టచ్ బటన్ క్లిక్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందిస్తారన్నారు. యాప్‌లో ఫిర్యాదుల నమోదు, పోలీసు అధికారుల వివరాలు, వాట్సాప్ గవర్నెన్స్, భద్రతతో కూడిన ప్రయాణం, అత్యవసర కాంట్రాక్ట్ నంబర్స్ వంటి అత్యాధునిక ఫీచర్స్‌ను పొందుపరచడం జరిగిందన్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు 1930 టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

ఆర్టీసీలో పదోన్నతులకు అనుమతివ్వాలి

» ఈయూ డిమాండ్

బస్‌స్టేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీలో వివిధ హోదాల్లో ఉన్న సుమారు మూడువేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్యలు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంస్థలో పదోన్నతుల జాప్యంతో సుమారు 80 మంది అధికారులు వివిధ హోదాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీనియారిటీ ప్రకారం ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.



చల్లపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కృష్ణకుమారితో మహిళా సర్పంచ్‌లు

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన మహిళా సర్పంచ్‌లు

చల్లపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి గ్రామాన్ని మహిళా సర్పంచ్‌లు సందర్శించారు. ఆర్థిక సమతా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.సత్యనారాయణ నేతృత్వంలో మదనపల్లికి చెందిన ఫౌండేషన్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ ద్వారా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన 30 మంది మహిళా సర్పంచ్‌లు చల్లపల్లి వచ్చారు. దశాబ్ధకాలంగా చల్లపల్లిలో జరుగుతున్న స్వచ్ఛ ఉద్యమాన్ని, గణనీయంగా మారిన గ్రామరూపురేఖల గురించి తెలుసుకున్నారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌ను కలిసి స్వచ్ఛ కార్యక్రమ విశేషాలు తెలుసుకోగా, పదేళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని వారికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీని సందర్శించి సర్పంచ్, ఈవోలతో సమావేశమై రోజువారీ చెత్తసేకరణ, సంపద తయారీ, పారిశుధ్య నిర్వహణ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాణీదేవి, సదాశివరావు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పీవీ మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సమతా మండలి కార్యకలాపాలను సత్యనారాయణ వారికి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన తాడంకి రాకేష్ (19) ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో సోమవారం ఉదయం మృతిచెందినట్టు రూరల్ ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. స్నేహితుడు వరుణ్ తేజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై చౌటపల్లి వెళుతుండగా, శ్యామాలాంబ రైసుమిల్లు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, రాకేష్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. వరుణ్ తేజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. రాకేష్ తండ్రి రెండేళ్ల క్రితం మృతి చెందగా.. రాడ్ బెండింగ్ చేస్తూ కుటుంబభారం మోస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

» జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం : రేషన్‌కార్డులో పేరు ఉన్న ప్రతిఒక్కరూ ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని జేసీ గీతాంజలిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌షాపులు, ఎండీయూ ఆపరేటర్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, తహసీల్దార్లు, పౌరసరఫరాల అధికారి కార్యాలయాల్లో ఈకేవైసీ చేయించేందుకు అవకాశం ఉందని ఆమె అన్నారు. మచిలీపట్నం డివిజన్‌లో 30,983, గుడివాడ డివిజన్‌లో 19,421, ఉయ్యూరు డివిజన్‌లో 20,706, జిల్లామొత్తంగా 71,110 కార్డుదారులు ఈకేవైసీ చేయించాల్సి ఉందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, 80 సంవత్సరాలు దాటిన వారికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఉందన్నారు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన వారు ప్రజలకు సేవచేసేందుకు చొరవ చూపాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులు 12 మందికి ఈ నియామకపత్రాలను కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం కలెక్టర్ అందజేశారు. ఎనిమిది మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఒకరికి సచివాలయకార్యాదర్శిగా, ముగ్గురిని ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ముఠా కార్మికుడు మృతి

విద్యాధరపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంట సెంటర్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొనటంతో ముఠా కార్మికుడు తంగెళ్లమూడి శ్రీనివాస్ రవికుమార్ (51) మృతి చెందిన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ రూరల్ సూరాయపాలెంలో తంగెళ్లమూడి శ్రీనివాస్ రవికుమార్ భార్య ఆదిలక్ష్మితో ఉంటున్నాడు. వీరికి సంతానం లేదు. రవికుమార్ గొల్లపూడి మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో ముఠా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 6 గంటలకు జూపిటర్ వాహనంపై తుమ్మలపాలెం వెళ్లి చేపలు కొనుగోలు చేసి ఇంటికి బయలుదేరాడు. నల్లకుంట సమీపంలోని ముత్తవరపు వెంకటేశ్వరరావు గెస్ట్ హౌస్ వద్ద మలుపు తిరుగుతుండగా ఇబ్రహింపట్నం వైపు నుంచి అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు రవికుమార్‌ను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడేళ్లయినా..!

(5వ పేజీ తరువాయి)

గడపకుండానే వెళ్తున్నామనే నిరాశతో కోర్సు పూర్తిచేసుకుని కాలేజీని విడిచిపెట్టి వెళ్లాల్సి వస్తోంది. ఈ భవన నిర్మాణం మొదలుపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికీ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో వైద్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ బిల్డింగ్ పనులు చివరి దశకు వచ్చినప్పటికీ, తమ విద్య పూర్తయ్యే నాటికైనా అందుబాటులోకి వస్తే బాగుంటుందని ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం గురించి సూపరింటెండెంట్‌ను అడగగా నిధుల కొరతతో ఆలస్యమవుతోందని, ఈ విషయాన్ని ఇప్పటికే అధికారులు దృష్టికి తీసుకెళ్లగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఎలాగైనా భవన నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

అత్యవసర విభాగ భవనం అందుబాటులోకి వచ్చేదెపుడు?

జీజీహెచ్‌లో సెంట్రల్ డయాగ్నోస్టిక్ బ్లాక్ పక్కన అత్యవసర విభాగం కోసం నిర్మాణం చేపట్టిన భవనం నత్తనడకగా సాగుతోంది. నాలుగు సంవత్సరాల కిందట శంకుస్థాపన చేసిన ఈ భవనం ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు, కోస్తా జిల్లాల రోగులు చికిత్స నిమిత్తం అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తారు. దీనితో ఈ ఆస్పత్రిలో రోగుల తాకిడి ఎక్కువగా ఉండటం వల్ల కొంతవరకు వైద్యం ఆలస్యమయ్యే అవకాశమూ ఉంది. రాజధాని నగరం కావడం, ఆస్పత్రి రద్దీ దృష్ట్యా ప్రభుత్వం ఈ ఆస్పత్రిపై మరింత శ్రద్ధ వహిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం వెనకబడిందనే చెప్పుకోవాలి. అధికార యంత్రాంగం మొత్తం నిక్షిప్తమై ఉన్న రాజధాని నగరంలోనే ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయంలో కేవలం రెండు భవనాల నిర్మాణానికే ఏళ్ల తరబడి కాలం వెల్లదీస్తున్నారంటే ఇతర విభాగాలకు సంబంధించిన విషయాలపై మరెంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో చెప్పుకోనవసరం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర విభాగానికి సంబంధించిన భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తే ప్రజలకు తక్కువ సమయంలో మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

బుడమేరుతో జాగ్రత్త!

(5వ పేజీ తరువాయి)

బుడమేరు డ్రెయిన్‌గా మారుతుంది. వాస్తవంగా చూస్తే విజయవాడ నగరం అంతా కూడా డ్రెయిన్‌గానే ఉంటుంది. ఇంకా చెప్పాలంటే ఏ కొండూరు నుంచి కూడా డ్రెయిన్‌గానే ఉంటుంది. దిగువకు ప్రవహించాక కొల్లేరు నదిలో కలుస్తుంది. కొల్లేరు నుంచి బంగాళాఖాతంలోకి వెళ్లిపోతుంది.

ఒక్క రోజులోనే అతలాకుతలం

గతేడాది ఆగస్టు 30, 31వ తేదీల్లో 25 నుంచి 42 సెంటీమీటర్ల మేర అత్యంత తీవ్ర వర్షాలు కురిశాయి. ఎడతెరపివ్వకుండా వర్షం కురవటంతో కేవలం ఒక్కరోజులోనే వరదలు పోటెత్తాయి. ఈ వరదల కారణంగా బుడమేరు గట్లకు భారీ నష్టం వాటిల్లింది. బుడమేరు ఉపకాలువలైన పులివాగు, కోతులవాగు, కొండవాగులు కూడా దెబ్బతినటంతో రైతుల పొలాలు, గ్రామాలు, విజయవాడ నగరం ముంపునకు గురైంది. విజయవాడ నగరంలో మూడు లక్షల మంది ప్రజలు వరద ముంపును చవిచూశారు.

బుడమేరు కాలువకు తీరని నష్టం

అకాల వరదల వల్ల బుడమేరు కాలువకు కూడా తీరని నష్టం జరిగింది. వెలగలేరులోని హెడ్ రెగ్యులేటర్ దెబ్బతింది. రెగ్యులేటర్ గేట్లు పాడయ్యాయి. ఈఎం పార్ట్స్ మాసనరీ పార్ట్స్, ఎలక్ట్రికల్ నెట్‌వర్క్, హోయిస్ట్ అరేంజ్‌మెంట్ వంటివి తీవ్రంగా దెబ్బతిన్నాయి. యుద్ధ ప్రాతిపదికన వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. బుడమేరు బండ్‌కు పలు చోట్ల నష్టం ఏర్పడింది. పులివాగు, కోతుల వాగు, కొండ వాగులు దెబ్బతిన్నాయి. వీటిని యుద్ధ ప్రాతిపదికన సరిచేయాల్సి ఉంది.

శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు

బుడమేరుకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. వరదల అనంతరం సాధారణ పరిస్థితులు ఏర్పడిన తర్వాత బుడమేరు ఆక్రమణలు, బుడమేరు గండ్లు, దెబ్బతిన్న కాలువలు, విజయవాడ నగరానికి శాశ్వతంగా వరద ప్రభావం లేకుండా చేయాల్సిన పరిస్థితుల గురించి అధ్యయనం చేశారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించాలంటే మాత్రం రూ.1000 కోట్లు నుంచి రూ.1500 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనాగా ఉంది. ఆక్రమణల తొలగింపు పెద్ద సమస్యగా మారే అవకాశం ఉన్నందున ముందుగా బుడమేరు యథాతథ పరిస్థితులకు అనుగుణంగా అయినా అభివృద్ధి పరచాలన్నా కూడా రూ. 1000 కోట్లు అవుతుంది. బుడమేరు కాలువకు రెండు వైపులా రీటెయినింగ్ వాల్ కట్టాలన్న ప్రతిపాదనల వల్ల ఈ మేరకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇవన్నీ కాకుండా బుడమేరును పటిష్ట పరచాలంటే రూ.100 కోట్ల నిధులు అవసరం అన్నది మరో అంచనా తయారు చేశారు. బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

వర్షాకాలం నాటికి చేయాల్సిన పనులు

శాస్త్రీయమైన ప్రతిపాదనలు సిద్ధం చేసేలోపు రానున్న వర్షాకాలానికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.35.45 కోట్లను కేటాయించింది. మొత్తం 185 పనులను చేపట్టేందుకు నిధులు విడుదల చేసింది. బుడమేరు, పులివాగు పటిష్టతకు వీలుగా 28 పనులు చేసేందుకు రూ.11.71 కోట్ల నిధులను కేటాయించింది. వెలగలేరు రెగ్యులేటర్ మరమ్మతులకు రూ.1.86 కోట్లను విడుదల చేసింది. ఇవి కాకుండా బుడమేరు ఆధారితమైన మీడియం ఇరిగేషన్‌కు సంబంధించి ఐదు పనులకు రూ.2.82 కోట్లను కేటాయించింది. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి మొత్తం 151 పనులకు రూ.19.06 కోట్లను విడుదల చేసింది. ఈ పనులన్నింటినీ ఇప్పుడు చేపడితేనే వచ్చే వర్షాకాలం నాటికి ఫలితం కనిపిస్తుంది. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో కదలిక లేకపోవడం కాస్త ఆందోళన కలిగిస్తోంది. యుద్ధ ప్రాతిపదికన టెండర్లు పూర్తి చేసి పనులన్నింటినీ అప్పగించాల్సిన అవసరం ఉంది.

నమో.. అమరావతి!

(5వ పేజీ తరువాయి)

వాహనాల పార్కింగ్ కోసం 10 ఎకరాలను కేటాయించారు. సభా ప్రాంగణానికి అభిముఖంగా అంటే ఉత్తర దిక్కున సచివాలయానికి నైరుతి, పశ్చిమ దిశలలో 32 ఎకరాలలో వీఐపీల పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం తొమ్మిది పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేస్తుండగా.. 6, 7, 8, 9 పార్కింగ్ ప్లేస్‌లన్నీ కూడా సభా ప్రాంగణానికి సమీపంలో ఉంటాయి. మిగిలిన 1 నుంచి 5 పార్కింగ్ ప్లేస్‌లన్నీ కూడా సాధారణ జనాలకు కేటాయించారు. ఇవి సభా ప్రాంగణానికి దూరంగా ఉంటాయి. వీటిని ఇంకా ఖరారు చేయలేదు. సాధారణ ప్రజలంతా నడుచుకుంటూ సభా ప్రాంగణానికి రావాల్సి ఉంటుంది. మునిసిపల్ మంత్రి నారాయణ చెబుతున్న దాని ప్రకారం ఐదు లక్షల మంది వరకు సభకు హాజరయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి.. పార్కింగ్ బయటే ఇచ్చే అవకాశం ఉంది.

సభా ప్రాంగణానికి దగ్గరగా హెలీప్యాడ్

ప్రధానమంత్రి మోదీ దిగటానికి వీలుగా సచివాలయం వాయువ్య దిక్కున హెలిప్యాడ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం మూడు హెలీప్యాడ్లను ఇక్కడ సిద్ధం చేస్తున్నారు. ప్రధాన మంత్రి, ఆయన భద్రతా సిబ్బంది, ఇతర ప్రముఖులు హెలీప్యాడ్‌లలోనే దిగనున్నారు.

హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు రోడ్డు షో

ప్రధాని మోదీ దిగే హెలీప్యాడ్ నుంచి సభాప్రాంగణం వరకు మాత్రమే రోడ్డు షో నిర్వహించాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రోడ్డు షోలో ప్రధాని మోదీతో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాత్రమే పాల్గొంటారు.

జెట్ స్పీడ్‌తో సభా ప్రాంగణ పనులు

అమరావతిలో జెట్ స్పీడ్‌తో సభా ప్రాంగణంలో పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా మూడు వేదికల పనులు శరవేగంగా చేస్తున్నారు. ఒక్క రోజు వ్యవధిలోనే మూడు గ్యాలరీల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక గ్యాలరీకి సంబంధించి పైకప్పు వేశారు. రెండింటికీ పైకప్పు పనులు మిగిలి ఉన్నాయి. వర్షం వచ్చిన తడవకుండా ఉండేలా వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఏడీసీఎల్ అధికారులు అమరావతి ప్రాంతంలో వీఐపీలు రాకపోకలు సాగించే రోడ్లన్నింటినీ బాగు చేస్తున్నారు. కొత్తగా బీటీ లేయర్లు వేస్తున్నారు. రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్నారు.

ఇసుక సిండికేట్ వార్!

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్ చూడకుండా కేవలం జీఎస్టీ అడ్రస్‌లనే ప్రాతిపదికగా తీసుకుని టెక్నికల్ బిడ్‌లలో పాస్‌చేయటం ఆరోపణలకు దారి తీస్తోంది.

ఆ ఆరు సంస్థలు సిండికేట్‌గా ఏర్పడ్డాయా?

పొరుగు రాష్ట్రాలకు చెందిన ఆరు సంస్థలు కూడా సిండికేట్ అయినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణాజిల్లాకు చెందిన బిడ్డర్లు వీటిపై జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. సిండికేట్ సంస్థలన్నీ నీకు ఈ క్వారీ, నాకు ఆ క్వారీ అని పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆరు సంస్థలు కూడా క్వారీలను దక్కించుకునేందుకు వీలుగా అవగాహనతో టెండర్లు వేశాయన్న విమర్శలు వస్తున్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం ఆ సంస్థలకు అవకాశం కల్పించేందుకు మైనింగ్ అధికారులు, జిల్లా యంత్రాంగం కలిసి స్థానిక సంస్థలు కాకపోయినా కూడా టెక్నికల్ బిడ్‌లలో పాస్ చేసినట్టు తెలుస్తోంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124,133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

అభివృద్ధికి మూలం గణితం: ప్రొఫెసర్ సుందరానంద్

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల అభివృద్ధి వెనుక గణితం పాత్ర ఎనలేదని రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సుందరానంద్ అన్నారు. సోమవారం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'గణితం నిజంగా అవసరం' అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న సమాజంలో గణిత పరిజ్ఞానం కీలక భూమిక పోషిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మేధో ఉత్సుకత కలిగి ఉంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ డా. మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి. జంపాల, గణిత విభాగాధిపతి ఐ.వి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

16 మంది పాత నేరస్తులను పట్టుకున్న రైల్వే పోలీసులు

- ఎమ్మార్వో ముందు హాజరు

రైల్వేస్టేషన్,ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.రత్నరాజు పర్యవేక్షణలో సోమవారం రైల్వే పోలీసులు రైల్వే స్టేషన్, రైలు బోగీలలో మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ (ఎంఎస్‌సీడీ) ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రయాణికులకు భద్రతపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. అయిదు రోజుల పాటు జరిగిన ఈ తనిఖీలలో 983 మందిని ఎంఎస్‌సీడీ ద్వారా తనిఖీలు చేయగా వారిలో 11 మందిని ఎమ్మార్వో ముందు బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుర అప్పగింత

వన్‌టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోటలో అదృశ్యమైన ఇద్దరు బాలురను పోలీసులు సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం రాణిగారితోట తారకరామనగర్‌లో ఉంటున్న శ్రీనివాసరావు కుమారుడు విక్కీ (11), అతని స్నేహితుడు కొమ్మెర బాలదేశాలు అలియాస్ బాల (13) ఈనెల 16న ఉదయం 11 గంటలకు ఆడుకోవటానికి బయటకు వెళ్లారు. ఆ రోజు రాకపోవటంతో వారి తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో బాలు పిన్ని చల్లా పున్నమ్మ ఆదివారం అర్ధరాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి బాలురు హనుమాన్‌పేటలోని ఎస్‌కేసీవీ చిల్డ్రన్ హోమ్‌లో ఉన్నట్లు గుర్తించి సంబంధిత సిబ్బందితో మాట్లాడి వారిద్దరిని స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులు, బంధువులకు సమాచారం తెలిపారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించారు.

నగర సుందరీకరణకు ప్రణాళిక

ఎంపీ కేశినేని శివనాథ్

భారతీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ప్రతినిధులైన తమతోపాటు ప్రభుత్వ అధికారులను ఆదేశించారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. తూర్పు పరిధిలోని 4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతంలోని రోడ్ నెంబర్ 5కు, భారతీనగర్‌లో 13వ, 14వ, 15వ, 10బి, 10ఎ రోడ్లకి సుమారు రూ.2కోట్ల నిధులతో సీసీ రోడ్ల పనులకు సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారని, అందుకే నగరంలోని



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎంపీ కేశినేని శివనాథ్

రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇటీవల మంత్రి నారాయణ సీఆర్‌డీఏ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో నగరంలోని డ్రెయినేజీ, ఎస్టీపీ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ నిడమానూరు, కంకిపాడు నుంచి విజయవాడలోకి సులువుగా వచ్చేందుకు అవుటర్ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనుల కోసం రూ.50కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నిధులతో ప్రధాన సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, కార్పొరేటర్ దేవినేని అపర్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు చలసాని రమణ, టీడీపీ నాయకులు కోడూరు అంజనేయవాసు, యెర్నేని వేదవ్యాస్, వి.గోపాలకృష్ణ, సర్కిల్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డీఈ పి.రామారావు, ఏఈ దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

45 మంది గర్భిణులకు సీమంతం చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దంపతులు

కలెక్టరేట్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పౌష్టికాహార పక్షోత్సవం సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన బిడ్డను జన్మనివ్వడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పోషక్ పక్వాడ పేరుతో ప్రత్యేకంగా తల్లులు పౌష్టికాహారం ఏ విధంగా తీసుకోవాలనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని ప్రతి జిల్లాలో నిర్వర్తిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన అనేక మహిళా సంక్షేమ పథకాలు కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుని మిగిలిన



గర్భిణులతో ఎమ్మెల్యే గద్దె దంపతులు

రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని అన్నారు. కృష్ణా జిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మాట్లాడుతూ మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వచ్చని అన్నారు. అనంతరం గద్దె దంపతులు తమ సొంత ఖర్చుతో 45 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పూలు, పండ్లు, చీర జాకెట్‌తో పాటు రూ.వెయ్యి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రెహెనా బేగమ్, శ్యామల, డాక్టర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అంబటి బ్రాహ్మణయ్యకు ఘన నివాళి



అంబటి బ్రాహ్మణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు బ్రాహ్మణయ్య పార్టీకి ఎనలేని సేవలు అందించారని, నీతి, నిజాయితీకి నిలువుటద్దమని టీడీపీ నాయకులు కొనియాడారు. అంబటి బ్రాహ్మణయ్య వర్ధంతి సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు సమర్పించారు. రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, కార్యదర్శి సింహాద్రి కనకాచార్యులు తొలుత బ్రాహ్మణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించి మాట్లాడారు. బ్రాహ్మణయ్యను ఆదర్శంగా తీసుకోవాలని, కార్యకర్తలకు, నాయకులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పామర్తి కిషోర్ బాబు, కోడూరు ఆంజనేయ వాసు, దేవరపల్లి ఆంజనేయులు, బత్తుల దుర్గారావు పాల్గొన్నారు.

కాన్వొకేషన్‌లో చిన్నారులకు సర్టిఫికెట్లు

కృష్ణలంక, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక సుధాకర్స్ ఐడియల్ హైస్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు సోమవారం జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందుకున్నారు. కాన్వొకేషన్ డ్రెస్ కోడ్‌ను ధరించిన చిన్నారులు స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, దేవినేని వరలక్ష్మి, డీన్ సురేష్, ఇన్‌చార్జి కనక దుర్గ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. అనంతరం చిన్నారులు నృత్యాలు చేశారు. స్కూల్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుదాం

నగర కమిషనర్ ధ్యానచంద్ర



ఆటోనగర్‌లో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ హెచ్‌టి లైన్ రోడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు జరగాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగర కమిషనర్ ధ్యానచంద్ర అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సోమవారం పర్యవేక్షించారు. రామవరప్పాడు రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద మన విజయవాడకు కొత్త అలంకరణగా నిలిచిన యూనికార్న్(రెక్కల గుర్రం)ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. టిక్కిల్ రోడ్డులోని మదర్ థెరెస్సా జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్‌టీ లైన్ రోడ్డును పరిశీలించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ పాల్గొన్నారు.

19 ఫిర్యాదులు

కార్పొరేషన్: నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికనుకమిషనర్ ధ్యానచంద్ర నిర్వహించారు. ఈ సందర్భంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడారు. మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన, ఎస్‌ఈలు పి. సత్యనారాయణ, పి. సత్యకుమారి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

నగరంలోని ఐదు వేలమంది శానిటేషన్, వాటర్, అండర్ గ్రౌండ్, పార్క్ సెక్షన్, వెహికల్ డిపో, స్ట్రీట్ లైటింగ్ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులకు మార్చి నెల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం నగర కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి. బాల దుర్గారావు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతికి బిషప్ సంతాపం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశ్వకతోలిక శ్రీసభ జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్(88) అనారోగ్యంతో కన్నుమూయడంతో విజయవాడ కతోలిక పీఠంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త వినగానే విజయవాడ క్యాథలిక్ డయోసిస్ బిషప్ మోస్ట్ రెవ. తెలగతోటి జోషఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పలువురు గురువులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేస్తూ పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు దేవుడు నిత్య విశ్రాంతి కలిగించాలని పేర్కొన్నారు. ఆయన చిత్రపటం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ వేడుకలు జరిగిన మరుసటి రోజే పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూయడం యావత్ క్రైస్తవ లోకం కన్నీటి పర్యంతమయిందని వారు తెలిపారు.



పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిస్టర్ జసింతా క్వాడ్రస్

స్టెల్లాలో ...

మారిస్ స్టెల్లా కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పోప్ ఫ్రాన్సిస్‌కు కళాశాల యాజమాన్యం ఘనంగా నివాళులర్పించింది. పోప్ ఫ్రాన్సిస్

విజయవాడ కతోలిక పీఠంలో విషాదఛాయలు

సంతాపసభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్, కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ లీనా క్వాడ్రస్‌లు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. సమావేశంలో డాక్టర్ సిస్టర్ ఇన్నేసియా, సిస్టర్ రేఖ, డాక్టర్ సిస్టర్ లావణ్య, ఆశ, ఉషాకుమారి, స్వప్నతోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోప్ మృతికి ఎంపీ శివనాథ్ సంతాపం

వన్‌టౌన్: పోప్ ఫ్రాన్సిస్ తన జీవితాన్ని సహనం, ప్రేమ, వినమ్రతతో మానవాళి సేవకే అంకితం చేశారని, కాథలిక్ సంఘానికే కాదు ప్రపంచ వ్యాప్తంగా అన్ని మతాల మధ్య సౌహార్దాన్ని పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి అపూర్వమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతిపట్ల సంతాపం తెలియజేస్తూ ఎంపీ ఒక ప్రకటన విడుదల చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం మానవతావాదులకు విశ్వశాంతి కోరేవారికి కాదు ప్రపంచానికి తీరని లోటని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా శోకంతో నిండి ఉన్న క్రైస్తవ సమాజానికి తన ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఏసు ప్రభువును ప్రార్థించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిత్యం నిఘా

అడ్మిన్ డీసీపీ జీవీ సరిత

ఆటోనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని, గంజాయిని నిరోధించడానికి, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ఎప్పటికప్పుడూ పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని అడ్మిన్ డీసీపీ జీవీ సరిత తెలిపారు. సోమవారం రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీపంలో ఏసీపీ కె.దామోదర్ ఆధ్వర్యంలో పటమట, మాచవరం, గుణదల పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

ఈ సెర్చ్‌లో చిరువ్యాపారులు నిషేధిత గుట్కాల విక్రయాన్ని గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేయాలని ఏసీపీ దామోదర్ పటమట పోలీసులను ఆదేశించారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలోని పలు ఇళ్లను, వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి విక్రయంపై ఆరా తీశారు. అనంతరం అడ్మిన్ డీసీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో 125 ప్రదేశాలను సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు, ఆయా ప్రాంతాల్లో పోలీసుల నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐలు వల్లభనేని పవన్ కిషోర్, ప్రకాష్, వి. శ్రీనివాస్, ఎస్ఐలు, సెంట్రల్ డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న డీసీపీ జీవీ సరిత, చిత్రంలో ఏసీపీ కె.దామోదర్, సీఐలు తదితరులు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి సాయం



సైబర్‌క్రైం సీఐ గుణ్ణం రాము చేతుల మీదుగా వందన తల్లికి అందజేస్తున్న ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సభ్యురాలు

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినికి ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ గ్రూపు సభ్యులు విజయవాడ సైబర్‌క్రైం సీఐ గుణ్ణం రాము చేతులు మీదగా రూ.28 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న వందన అనే విద్యార్థిని గతేడాది ఆగస్టు 14న కాలేజీ నుంచి వస్తున్న సమయంలో రామవరప్పాడు రింగ్ రోడ్డు సమీపంలో స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ వందన మీద నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కళాశాల అధ్యాపకురాలు ద్వారా విషయం తెలుసుకున్న ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ సభ్యులు స్పందించి నగదు సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రూపు సభ్యులను సీఐ రాము అభినందించారు.

చిరువ్యాపారులకు రక్షణ కల్పించండి

● కలెక్టర్‌కు యూనియన్ వినతి

గవర్నర్‌పేట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసెంట్ రోడ్డులో దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న హాకర్లపై అధికార పార్టీ స్థానిక నేతల దౌర్జన్యాలు పెరిగిపోయాయని వారి నుంచి రక్షణ కల్పించాలని హాకర్స్ అండ్ తోపుడు బండ్ల యూనియన్ (సీఐటీయూ) నేతలు సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. చిరు వ్యాపారులంతా వ్యక్తిగత దరఖాస్తులతో పాటు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వ్యాపారాలు చేసుకునేందుకు హాకర్లలో కొందరికి కార్పొరేషన్ గుర్తింపు కార్డులు ఇచ్చిందని, మిగిలిన వారికి కూడా గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నేతలు తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ నేతలు దోనేపూడి కాశీనాథ్, కె. దుర్గారావు, వై. సుబ్బారావు, చిరు వ్యాపారుల యూనియన్ నేతలు వెంకటేశ్వరరావు, సిహెచ్ మురళీ పాల్గొన్నారు.

రామ్మోహన్ గ్రంథాలయంలో పుస్తకాల వితరణ రేపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 21 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 23న ఎంజీ రోడ్డు బందరు లాకుల సెంటర్‌లోని రామ్మోహన్ గ్రంథాలయంలో స్కూల్ విద్యార్థులకు సామాన్య పుస్తకాలు ఉచితంగా అందజేయ నున్నట్లు రామ్మోహన్ గ్రంథాలయ కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వితరణ కార్యక్రమం ఉంటుందని, స్కూల్ విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పుల బాధతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

విద్యాధరపురం, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక చెరువు సెంటర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చిట్టి బాబ్జి (31) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం చెరువు సెంటర్ మణెమ్మ బడ్డీ కొట్టు సమీపంలో బాబ్జి భార్య, కుమారుడు, కుమార్తెతో ఉంటున్నాడు. ఇతను ఆటో డ్రైవర్. అతని భార్య జ్యోతి చుట్టల కంపెనీలో పనిచేస్తుంది. బాబ్జి కుటుంబ అవసరాల నిమిత్తం ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రూ.70వేలు, ప్రైవేటు బ్యాంక్‌లో రూ.లక్ష లోను, తెలిసిన వ్యక్తుల వద్ద మరో రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పుల బాధలు ఎక్కువ కావటంతో మనస్తాపం చెందిన బాబ్జి సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమ యంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఒంటిగంటకు జ్యోతి ఇంటిపక్కనే ఉంటున్న మహిళకు ఫోన్ చేసి పిల్లలు వచ్చారా లేదా చూసి చెప్పమంది. ఆ మహిళ ఇంటికి వెళ్లి చూడగా, ఇంట్లో బాబ్జి ఉరేసుకున్నట్లు చెప్పింది. జ్యోతి ఇంటికి వచ్చి స్థానికుల సహాయంతో బాబ్జిని కిందకు దించి చికిత్స నిమిత్తం గొల్లపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోనేరు నారాయణరావు మృతి

గుణదల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): నగరం కార్పొరేషన్ కాకముందు అనగా 1970 నుంచి 1980 వరకు గుణదల గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా సేవలందించిన కోనేరు నారాయణరావు ఆదివారం రాత్రి మృతి చెందారు. కొద్ది రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి విషయం తెలిసి గుణదల్లోని ఆయన స్వగృహానికి సోమవారం పెద్ద సంఖ్యలో నాయకులు చేరుకుని నివాళులు అర్పించారు. ఆయన గుణదల గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా సేవలందించారు. 1983 నుంచి 1988 వరకు గుణదల కార్పోరేటర్‌గా పనిచేశారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంకు గుణదల బ్రాంచికి 1974 నుంచి 1980 వరకు ఏకగ్రీవంగా ఎన్నికై అధ్యక్షుడిగా పనిచేశారు. 1999లో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్నారు.

టూరు ఖరారు!


ఇంద్రకీలాద్రి


మోపిదేవి

బ్రాండ్ టూరిజం ప్యాకేజీలను ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. ప్యాకేజీ ధరలను మాత్రం ఇంకా నిర్ణయించలేదు. విజయవాడ నగరానికి వచ్చే సందర్శకులు మూడు నుంచి నాలుగు రోజుల వరకు ఇక్కడే ఉండిపోవటానికి అనుగుణంగా రెండు ప్యాకేజీలకు శ్రీకారం చుట్టింది. మూడు రోజుల టూర్ ప్యాకేజీ, నాలుగు రోజుల టూర్ ప్యాకేజీలను రూపొందించింది. ఈ ప్యాకేజీలను సరసమైన ధరలకు కల్పించనుంది. ఇప్పటికే ట్రాన్స్‌పోర్ట్, హోటల్స్ వంటి సంస్థలతో రాయితీ పద్ధతిన ధరలు కల్పించేలా మాట్లాడటం జరిగింది. అధికారికంగా ఈ పర్యాటక ప్యాకేజీలను అతి త్వరలోనే అమలు చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి, విజయవాడ

ఎన్టీఆర్ జిల్లా బ్రాండ్ టూరిజం ప్యాకేజీలకు శ్రీకారం

- ఉమ్మడి కృష్ణా ప్రాంతాల సమ్మిళితంతో 3,4 రోజుల ప్యాకేజీలు
- త్వరలో అధికారికంగా అమల్లోకి తీసుకురానున్న అధికారులు

మూడు రోజుల ప్యాకేజీ ఇలా..

మొదటిరోజు బందర్ రోడ్‌లోని ఏపీ టీడీసీ సీఆర్‌వో ఆఫీస్ దగ్గరికి పర్యాటకులు రావాల్సి ఉంటుంది. ఇక్కడ నుంచి ప్రత్యేక బస్సులో పర్యటకులను హరిత బెరం పార్కుకు తీసుకు వెళ్తారు. అక్కడ అల్పాహారం అందిస్తారు. కొద్దిసేపు గడిపిన తర్వాత కనకదుర్గమ్మ గుడికి తీసుకువెళ్తారు. ఉపాలయాల సందర్శన, నగర పనోరమిక్ వ్యూ పూర్తయ్యాక అక్కడి నుంచి 76 కిలోమీటర్ల దూరంలో ఉన్న వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సందర్శనం ఉంటుంది. అక్కడి విశేషాలు చూసిన తర్వాత 20 కిలోమీటర్ల దూరంలోని ముక్త్యాల శ్రీ ముక్తేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. ఈ చారిత్రక దేవాలయాన్ని సందర్శించిన తర్వాత 15 కిలోమీటర్ల దూరంలోని తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. అక్కడి నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ దేవస్థానానికి తీసుకువెళ్తారు. అమ్మవారి దర్శనం తర్వాత 36 కిలోమీటర్ల దూరంలోని నెమలి శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి తీసుకువెళతారు. దర్శనానంతరం అక్కడ నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని పుట్రేల మారెమ్మ దేవాలయానికి తీసుకువెళతారు. మారెమ్మ దర్శనం తర్వాత 76 కిలోమీటర్లు ప్రయాణించి తిరిగి విజయవాడ వస్తారు. రెండోరోజు విజయవాడ నుంచి 14కిలోమీటర్ల దూరంలోని వెంకటాయపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయానికి తీసుకువెళ్తారు. అక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో అమరావతిలో ఉన్న శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. అమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్న తర్వాత ధ్యాన బుద్ధ, కాలచక్ర, ఇతర బౌద్ధారామ విశేషాలు తిలకించిన తర్వాత 36 కిలోమీటర్ల దూరంలోని పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయానికి తీసుకువెళ్తారు. అక్కడ శివపార్వతులను దర్శనానంతరం 17 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి తీసుకువెళతారు. స్వామి దర్శనం తర్వాత పానకం స్వీకరణ, పరిసర ప్రాంతాల సందర్శన ఉంటుంది. ఇక్కడ నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని యనమలకుదురు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం సందర్శన ఉంటుంది. అక్కడ కొండపై పరమేశ్వర దర్శనం తర్వాత కొండ పైనుంచి విజయవాడ సైట్ సీయింగ్ ఉంటుంది. తర్వాత 8 కిలోమీటర్ల దూరంలోని మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామి దర్శనం తర్వాత 7 కిలోమీటర్ల దూరంలో కృష్ణా హారతి ఇచ్చే దుర్గాఘాట్‌కి తీసుకువెళతారు. కృష్ణాతీరం అందాల వీక్షణతోపాటు కృష్ణాహారతి సందర్శన ఉంటుంది. రెండో రోజు మొత్తం 72 కిలోమీటర్ల మేర పర్యటన ఉంటుంది. ఇక మూడో రోజు విషయానికి వస్తే మొత్తం 72 కిలోమీటర్ల పాటు యాత్ర సాగుతుంది. విజయవాడ నుంచి ప్రారంభమై 55 కిలోమీటర్ల దూరంలోని మొవ్వ శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ సందర్శన ఉంటుంది. అక్కడి నుంచి 11 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణు దేవస్థానానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి 21 కిలోమీటర్ల దూరంలోని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని చూపిస్తారు. అక్కడ నుంచి 28 కిలోమీటర్ల దూరంలోని హంసలదీవికి తీసుకెళతారు. కృష్ణానది సముద్రంలో కలిసే ఈ ప్రాంతం అత్యద్భుతంగా ఉంటుంది. అక్కడి నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం దగ్గర్లోని మంగినపూడి బీచ్‌కు తీసుకెళ్తారు. అక్కడి నుంచి 12 కిలోమీటర్ల దూరంలోని చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయ సందర్శన ఉంటుంది. దీంతో మూడో రోజు 72 కిలోమీటర్ల యాత్ర పూర్తవుతుంది.


కొండపల్లి


వేదాద్రి


వెంకటాయపాలెం

4 రోజుల ప్యాకేజీ ఇలా..

ఈ ప్యాకేజీ కూడా విజయవాడ ఏపీటీడీసీ సీఆర్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమవుతుంది. పర్యాటకులను ప్రత్యేక బస్సులో నేరుగా కనకదుర్గమ్మ దేవస్థానానికి తీసుకువెళ్తారు. అమ్మవారి దర్శనం తర్వాత 22 కిలోమీటర్ల దూరంలోని కొండపల్లి కోటకు తీసుకువెళ్తారు. కొండపల్లి కోట సందర్శన తర్వాత 11 కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ వద్ద పవిత్రసంగమానికి తీసుకువెళ్తారు. ఇక్కడ కృష్ణానది అందాలతో పాటు దూరాన ఉన్న రాజధాని, కృష్ణా, గోదావరి సంగమం ప్రాంతాలను వీక్షించవచ్చు ఇక్కడ నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని భవాని ఐలాండ్‌కు వస్తారు. కృష్ణానదిపై బోటువిహారం చేస్తూ భవానీ ద్వీపంలోకి చేరుకుంటారు. ద్వీప సందర్శన తర్వాత తిరిగి 5 కిలోమీటర్ల దూరంలోని విజయవాడ బాపు మ్యూజియం సందర్శనం ఉంటుంది. అక్కడి నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని గాంధీ హిల్‌కు తీసుకు వెళతారు. అక్కడి నుంచి 4 కిలోమీటర్ల దూరంలోని అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు వద్దకు తీసుకువెళతారు. అంబేద్కర్ మ్యూజియం, ఆయన జీవిత చరిత్ర తెలుసుకోవచ్చు. తిరిగి బెర్మ్ పార్కుకు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస ఉంటుంది. రెండో రోజు ఉదయాన్నే బయలుదేరి వేదాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, ముక్త్యాల శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయం, తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ సందర్శన చేసి నగరానికి తిరిగి వస్తారు. మూడో రోజున విజయవాడ నుంచి వెంకటాయపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, అమరావతి టెంపుల్ మ్యూజియం, బుద్ధ స్తూపం సందర్శన ఉంటాయి. ఇక్కడ నుంచి 33 కిలోమీటర్ల దూరంలోని ఉండవల్లి గుహల సందర్శనం అక్కడి నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి ఎకోపార్కు సందర్శన ఉంటుంది తర్వాత 3 కిలోమీటర్ల దూరంలోని మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సందర్శన ఉంటుంది స్వామిని దర్శించుకున్న తర్వాత 16 కిలోమీటర్ల దూరంలోని పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవాలయం సందర్శన ఉంటుంది. అక్కడి నుంచి విజయవాడకు చేరుకుంటారు. రాత్రి బస ఇక్కడే ఉంటుంది. తిరిగి 4వ రోజు ఉదయం విజయవాడ నుంచి 57 కిలోమీటర్ల దూరంలోని ఘంటసాల బౌద్ధ స్తూపం, మ్యూజియం సందర్శన, అక్కడ నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం, మచిలీపట్నం, పెడన కలంకారి దుకాణాలకు తీసుకువెళతారు. అక్కడ పర్యాటకులు షాపింగ్ చేసుకోవచ్చు. అక్కడి నుంచి 19 కిలోమీటర్ల దూరంలోని మంగినపూడి బీచ్‌కు తీసుకువెళ్తారు. తర్వాత తిరిగి విజయవాడ తీసుకొస్తారు. ఇలా నాలుగు రోజు యాత్ర ముగుస్తుంది.


భవానీ ఐలాండ్


అమరావతి


చిన్నరాజగోపురం ఎదురుగా టెన్‌సైల్ షెడ్ నిర్మాణం

దుర్గగుడిలో వేగంగా టెన్ సైల్ షెడ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్ కొండపై చిన్న రాజగోపురం ఎదురుగా టెన్‌సైల్ షెడ్ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రతి ఏడాది దసరా, భవానీ దీక్షలు, వివిధ పండగలు, వేసవిలో చిన్న రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీస్థలం తాత్కాలిక షెడ్లు, పందిళ్లు వేసి భక్తులకు వసతులు కల్పిస్తున్నారు. అదేప్రదేశంలో శాశ్వతంగా షెడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సుమారు రూ.2.4 కోట్లతో టెన్ సైల్ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టి త్వరగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావటానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతించిన ఏఐవైఎఫ్

గాంధీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు స్వాగతించారు. పరీక్షల గడువు కనీసం 70 రోజులు పెంచాలని కోరారు. స్థానిక దాసరిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు. అభ్యర్థులకు టెన్త్, ఇంటర్‌లో 50 శాతం పాస్ పర్సంటేజ్ ఉండాలనే నిబంధనను సవరించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు ఒకే పేపర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఈటీ పోస్టుల సంఖ్య పెంచాలన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ సంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. నగర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్‌కుమార్, శీరం రవికుమార్, గంట మమత, ఉపాళ్ల నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో దోచుకుంటున్న ప్రభుత్వాలు

- ఆమ్ ఆద్మీ జోనల్ కో-ఆర్డినేటర్ మహేశ్వర రెడ్డి

విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రైతుల భూములను చౌకగా తీసుకుని తమ అనుచరులకు కట్టబెట్టే విధానం రాష్ట్రంలో నడుస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైజాగ్‌లో అభివృద్ధి పేరుతో సుమారు 60 ఎకరాలు ఓ కంపెనీకి కట్టబెడుతున్నారని, కంపెనీ వ్యక్తులు రూ.లక్ష పెట్టుబడితో రూ.1000 కోట్లు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. రామాయపట్నంలో రెండు పార్టీలు పెంచి పోషిస్తున్న ఓ కంపెనీకి రైతులకు మధ్య పోరాటంలో చేవూరు ప్రాంతానికి చెందిన ఒక యువరైతు ఈ సిండికేట్‌ను ఎదిరించలేక ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రెండు పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటున్నట్టు కనిపిస్తున్నా అనుచరులను కాపాడుకోవడంలో మాత్రం కలిసే పనిచేస్తున్నాయన్నారు. ఒక రైతుబిడ్డగా, ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు అసెంబ్లీ అభ్యర్థిగా రైతుల పక్షాలన నిలబడతానన్నారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.3.02 కోట్లు


కానుకలను లెక్కిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, సేవా బృందం సభ్యులు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఈవో కే రామచంద్ర మోహన్ పర్యవేక్షణలో జరిగిన కానుకల లెక్కింపులో ఏఈవోలు, ఉద్యోగులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, దేవదాయ శాఖ సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు. గతంలో కానుకల లెక్కింపు నుంచి ఇప్పటి వరకు 18 రోజుల వ్యవధికిగాను రూ.3,02,92,986 నగదు రూపంలో లభించింది. 440 గ్రాముల బంగారం, 5 కిలోల 225 గ్రాముల వెండి కూడా వచ్చాయి.

పథకాలకు విరాళాలు

దుర్గగుడిలో అన్నవితరణకు కృష్ణాజిల్లా కేసరపల్లికి చెందిన డీ నీలిమ సోమవారం ఆలయానికి విచ్చేసి రూ.1,04,293 విరాళం ఇచ్చారు. అలాగే విజయవాడ మాచవరానికి చెందిన అట్లూరి రామమోహనరావు, సువర్ణ దంపతులు అన్నవితరణకు రూ.లక్ష, గర్భాలయ శిఖర స్వర్ణతాపడానికి మరో రూ.లక్ష విరాళం అందించారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అధికారులు, అర్చకులు వీరికి లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

విరాళాలకు 80జీ వర్తింపు

దుర్గగుడిలో అమ్మవారి ఆలయశిఖరం స్వర్ణతాపడం దాతలకు 80జీ వర్తించేలా ఆదాయపు పన్ను శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అధికారులు ఆలయ శిఖరానికి బంగారు తాపడం నిమిత్తం 3 నెలల క్రితం శ్రీకనకదుర్గా టెంపుల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు. ఎక్కువ మంది దాతలు విరాళం ఇచ్చేందుకుగాను ఇటీవల అధికారులు, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు 80జీ వర్తించేలా అనుమతివ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు కేవలం అన్నదాన పథకానికే 80జీ వర్తిస్తుంది. తాజాగా స్వర్ణ శిఖరానికి స్వర్ణ తాపడం నిమిత్తం విరాళాలిచ్చే దాతలకూ వెసులుబాటు కలిగింది. దీంతో ఎక్కువ మంది దాతలు విరాళాలిచ్చే అవకాశం ఉంది. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ ప్రకారం నిర్దేశించిన నిబంధనల మేరకు 80జీ వినియోగించుకోవచ్చు.

కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర ప్రారంభం

కార్పొరేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లోని వివిధ నగరపాలకసంస్థల్లో అభివృద్ధిని అధ్యయనం చేయడానికి విజయవాడ నగర పాలకసంస్థ కార్పొరేటర్లు బయలుదేరారని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్ల విజ్ఞానయాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో 24 మంది వైసీపీ, 17 మంది తెలుగుదేశం కూటమి సభ్యులు, ఇద్దరు కో-ఆప్టెడ్ మెంబర్లతో పాటుగా యాత్ర సమన్వయకర్తలు బీ కరుణాకర్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజియా షాబినా, పీఆర్‌వో, ముగ్గురు సహాయక సిబ్బంది బృందంలో ఉన్నారన్నారు. 22న బెంగుళూరు మున్సిపల్ కార్పొరేషన్, 23న మైసూర్ మున్సిపల్ కార్పొరేషన్, 26న మధురై మున్సిపల్ కార్పొరేషన్, 28న నాగర్‌కోయిల్ (కన్యాకుమారి) మున్సిపల్ కార్పొరేషన్, 29న త్రివేండ్రం మున్సిపల్ కార్పొరేషన్, మే 3న కొచ్చిన్ నగరపాలకసంస్థలో చేపట్టిన అభివృద్ధి, పలు ప్రాజెక్టుల పరిశీలన, ఆయా నగరాల్లో ప్రజలకు అందించే సంక్షేమ పథకాల అమలు విధానాలను అధ్యయనం చేస్తారని మేయర్ తెలిపారు.


జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమస్యలు పరిష్కరించాలి

- అంగన్‌వాడీల ధర్నాలో పలువురు వక్తలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మారుస్తున్నామని ఐసీడీఎస్ మంత్రి ప్రకటించి ఇప్పటి వరకు జీవో ఇవ్వకపోవడం అన్యాయమని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, బాలసంజీవిని యాప్ మార్పులు, వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లకు మే నెలలో వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ వర్కర్ల సమస్యలపై అనేక సార్లు శాసనమండలిలో ప్రస్తావించానన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో 42 రోజుల అంగన్వాడీల సమ్మె సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చినట్టు గుర్తు యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లోని పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మినీ వర్కర్లు ఆహారాన్ని వండి పెట్టడం, ఆరోగ్యం, ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నారన్నారు. వీరికి తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. వీరి కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని విమర్శించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చామని అసెంబ్లీలో మంత్రి ప్రకటించినా జీవో ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. మినీ వర్కర్స్ రాజ్యలక్ష్మీ అధ్యక్షతన సీఐటీయూ రాష్ట్ర నేతలు నాగరాజు, ఎన్‌సీహెచ్.శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, ఎం.మనోహర్. అంగన్వాడీ రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవీ, సుప్రజ, రమాదేవీ, నిర్మల, శకుంతల, విజయలక్ష్మీ, రాజేశ్వరీ, మహబాబున్నిసా, అధిక సంఖ్యలో వినీలు పాల్గొన్నారు.

భళా.. యువ కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి శ్రీశ్రీ కవితా సంపుటి మహాప్రస్థానం జాతీయ కట్టడమని చారిత్రక వారసత్వ సంపద లాంటిదని ప్రముఖ కవి విమర్శకులు డాక్టర్ రావులపాటి సీతారాం అన్నారు. విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వర్ణోత్సవ కార్యక్రమంగా ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం సోమవారం ఉదయం సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహించిన యువకవి సమ్మేళనానికి సీతారాం సంచాలకత్వం వహించారు. మహాప్రస్థానం ముద్రణ జరిగి ఏడున్నర దశాబ్దాలు కావస్తోందని, ఇప్పటికీ దాని ప్రభావంతోనే యువకవులు రాస్తున్నారని, అందుకు శ్రీశ్రీ దృక్పథ నిర్దేశం, కరవాలం లాంటి భావతీవ్రత ఒక కారణమని, జలపాతశైలి మరో కారణమన్నారు. సినీ రచయిత కట్టా సిద్ధార్థ, వర్ధమాన కవి తంగిరాల సోని, మాస్టర్‌మైండ్స్ ఇంటర్ విద్యార్థిని పీఎస్ఎస్‌జీ చిన్మయి, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఆర్.స్రవంతి, పి.ఎలిజబెత్ రాణి, వైద్య విద్యార్థిని నాగిశెట్టి రుషశ్రీ, పిన్నమనేని సిద్ధార్థ దంతవైద్య కళాశాల విద్యార్థి కునుకు మోనిష్, శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థులు జి.ధరణి, పి.విజయకుమారి, కేబీఎన్ కళాశాల అధ్యాపకుడు పవన్‌కుమార్, విద్యార్థిని బి.భారతీభాయ్ కవితలు వినిపించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి టీవీఎస్ ప్రకాష్, పీబీ సిద్ధార్థ ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కల్పన ప్రసిద్ధకవి సీతారాంతో పాటు యువకవులను సత్కరించారు. ఈ కవితాగోష్ఠిని తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎన్.శివకుమార్, సహాయక ఆచార్యులు డాక్టర్ నశ్రీ పర్యవేక్షించారు.



యువ కవి సమ్మేళనంలో పాల్గొన్న డాక్టర్ రావులపాటి సీతారాం, తంగిరాల సోనీ, తన్మయి

'ఆడుదాం.. కోట్లాట'పై విచారణ పూర్తి

నందిగామ, ఆంధ్రజ్యోతి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా నందిగామ కేంద్రంగా జరుగుతున్న 'ఆడుదాం.. కోట్లాట'పై విచారణ పూర్తయింది. తొలుత ఆస్తి తగాదా నమోదైన ఈ కేసు ఆంధ్రజ్యోతి కథనంతో ప్రాధాన్యత సంతరించుకుంది. శాప్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఒక ఉద్యోగి, నందిగామకు చెందిన ఒక మహిళకు కోట్లాది రూపాయల సొమ్ము బదిలీ చేసినట్లు ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో సదరు మహిళ పేరుతో ఉన్న ఆస్తులను పోలీసులు పరిశీలించారు. చందర్లపాడు మండలం పోపూరు గ్రామంలో సదరు మహిళ పేరుతో ఉన్న ఏడున్నర ఎకరాల భూమితో పాటు నందిగామ పట్టణంలోని విలువైన స్థలాలు, నిర్మాణంలోని డూప్లెక్స్ ఇంటిని పరిశీలించి నివేదికను సిద్ధం చేశారు. దీన్ని మంగళవారం సీపీకి అందజేస్తామని సీఐ వైవీవీఎల్ నాయుడు తెలిపారు. మరోవైపు ఈ కేసును సీఎం కార్యాలయం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆడుదాం.. ఆంధ్రా స్కామ్‌పై సీరియస్‌గా ఉన్న కూటమి ప్రభుత్వం ఈ కేసుపై నిఘా పెట్టినట్టు తెలిసింది. గత ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకూ నగదు బదిలీతో పాటు క్రయ విక్రయాలు జరిగినట్లు తెలిసింది. నందిగామ స్టేషన్ నుంచి ఈ కేసు ఉన్నతాధికారులకు చేరుతుండడంతో పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

శ్రీనివాస్, సౌందర్యపై చర్యలు తీసుకోవాలి

- జూనియర్ మహిళా న్యాయవాది మణిప్రియ డిమాండ్



గాంధీనగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయవాదినైన తనకే న్యాయం జరగడం లేదని తనపై దాడి చేసిన వారిపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని జూనియర్ న్యాయవాది మణిప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడింది. తాను 2023 నుంచి బెజవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా కొనసాగుతున్నట్టు పేర్కొన్నారు. కొన్నేళ్ల కిత్రం నుంచి భర్తతో విభేదాల కారణంగా కేసు నిమిత్తం కోర్టుకు వస్తున్న క్రమంలో ఎల్ఎల్‌బీ చదివి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నానని తెలిపింది. గతంలో పిట్టల శ్రీనివాస్ అనే న్యాయవాదితో కేసు విషయమై పరిచయం ఏర్పడి సలహాలు తీసుకున్నట్టు చెప్పారు. కొద్దిరోజుల నుంచి భర్తతో విడాకులు తీసుకుని తనను పెళ్లిచేసుకోవాలని శ్రీనివాస్ వేధించేవాడన్నారు. ఈ నెల 17న కోర్టు కారిడార్‌లో శ్రీనివాస్ అసభ్యంగా ప్రవర్తించినట్టు చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేసి మాట్లాడేందుకు బార్ ప్రెసిడెంట్ చాంబర్‌కు వెళ్లిన తనపై సౌందర్య అనే మహిళా న్యాయవాదితో కలిసి శ్రీనివాస్ దాడి చేసి బట్టలు చింపేశారన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్, మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఇప్పటి వరకు పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కేసు వెనక్కు తీసుకోవాలని బెదిరిస్తున్నారని, అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పిట్టల శ్రీనివాస్, సౌందర్యను సస్పెండ్ చేసి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సమ్మర్ కేర్



వేసవిలో చర్మం చెక్కుచెదరకుండా...

వేసవిలో చర్మ సమస్యలు సర్వసాధారణం. అలాగని వాటిని నిర్లక్ష్యం చేస్తే, ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎండ వేడి నుంచి చర్మాన్ని రక్షించుకునే ముందస్తు జాగ్రత్తలు పాటించాలంటున్నారు వైద్యులు.

సూర్యరశ్మిలోని పరారుణ కిరణాలు, అతినీలలోహిత కిరణాలు మన చర్మాన్ని ఎంతో కొంత దెబ్బతీస్తాయి. మరీ ముఖ్యంగా సున్నిత చర్మం కలిగిన వాళ్లకు ఈ సమస్యలు మరింత ఎక్కువ. దాంతో ఎండకు చర్మం నల్లబడడం, కమిలిపోవడం, గాయపడడం లాంటివి జరుగుతూ ఉంటాయి. వీటిని నివారించుకోవడం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం!

చమట పొక్కులకు విరుగుడు

ఈ కాలంలో దురదలు, ఉబ్బెత్తు పొక్కులతో చమట పొక్కులు వేధించడం సహజం. ఎక్కువ చమట పడుతున్నా, చమట శరీరం మీదే ఆరిపోయినా, చమట పీల్చుకోలేని, బిగుతైన దుస్తులు వేసుకున్నా చమట పొక్కులు తప్పవు. మెడ, బాహుమూలలు, ఛాతీ, వెన్నులో ఎక్కువగా చమట పొక్కులు తలెత్తుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా సూర్యరశ్మిని తట్టుకోలేని సున్నిత చర్మం కలిగి ఉన్నవారికి ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యకు గురి కాకుండా ఉండాలంటే....

- గాలి చొరబడే, చమట పీల్చే నూలు దుస్తులు వేసుకోవాలి
- రోజుకు రెండు నుంచి మూడు సార్లు చల్లనీటి స్నానం చేయాలి
- చర్మం మీద చమట ఆరిపోకుండా చూసుకోవాలి
- ప్రతిసారీ సబ్బుతో రుద్ది స్నానం చేయకుండా ఒకట్రెండు సార్లు చల్ల నీళ్లతో ఒంటిని శుభ్రం చేసుకోవాలి
- బిగుతైన దుస్తులు వేసుకోకూడదు
- లేత రంగు దుస్తులే ఎంచుకోవాలి
- శరీర శుభ్రత పాటించాలి



చికిత్స ఇలా...

మందుల షాపుల్లో దొరికే క్యాలమైన్ లోషన్‌ను పైపూతగా వాడుకోవచ్చు. అలాగే దురదలు పెడుతున్నప్పుడు గోళ్లతో గోక్కోకూడదు. ఇలా చేస్తే ఇన్‌ఫెక్షన్‌గా మారే ప్రమాదం ఉంటుంది. ఒకవేళ చమట పొక్కులు అదుపులోకి రాకుండా పెద్ద పుండ్లుగా మారితే చర్మ వైద్యులను ఆశ్రయించాలి. దురదను తగ్గించే లోషన్లు, యాంటీ హిస్టమిన్ మందులతో చమట పొక్కులు సులువుగా అదుపులోకొస్తాయి.

సున్నిత చర్మంతో సమస్యలు

సాధారణంగా సున్నిత చర్మం కలిగిన వాళ్లు వేసవి వేడి, ఎండలకు మరింత ఇబ్బంది పడిపోతూ ఉంటారు. ఈ కోవకు చెందిన వాళ్లు వేసవిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండకు బహిర్గతం కాకుండా చూసుకోవాలి. ఒకవేళ ఈ సమయాల్లో ఎండలోకి వెళ్తే నుదురు, మెడ, ఛాతీ, ముంజేతులు ఇలా ఎండకు బహిర్గతమయ్యే ప్రదేశాల్లో చర్మం కమిలిపోతుంది. దురద కూడా వేధిస్తుంది. ఇలాంటివారు ఈ జాగ్రత్తలు పాటించాలి

- ముంజేతులు, మెడలను కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి
- ఆరుబయట తిరిగే సమయాలను తగ్గించుకోవాలి
- ఆరుబయట ఈతకొలనుల్లో ఈతకు వెళ్లేటప్పుడు వాటర్ రెసిస్టెంట్ సన్‌స్క్రీన్ వాడుకోవాలి
- బయటకు వెళ్లేటప్పుడు 30 ఎస్‌పిఎఫ్ మించిన సన్‌స్క్రీన్ వాడుకోవాలి
- ప్రతి నాలుగు గంటలకూ సన్‌స్క్రీన్ పూసుకుంటూ ఉండాలి
- తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు వాడుకోవాలి

పిగ్మెంటేషన్ సమస్యలు

వేసవిలో ఎండకు ముందు నుంచీ ఉన్న మంగు సమస్య మరింత తీవ్రమవుతుంది. లేదంటే కొత్తగా మంగు సమస్య తలెత్తుతుంది. కాబట్టి ఈ కాలంలో తప్పనిసరిగా తగిన రక్షణ చర్యలు పాటించాలి. కళ్ల చుట్టూ చర్మం నల్లబడిపోకుండా చలువ కళ్లద్దాలు ఉపకరిస్తాయి.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు

ఈ కాలంలో కటి ప్రదేశంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్ ముప్పు కూడా ఎక్కువే! ప్రత్యేకించి ఎక్కువ సమయాల పాటు ఆరుబయట గడిపేవారు, వ్యాయామాలు చేసేవారు ఇంటికి వచ్చిన వెంటనే స్నానం చేయకుండా సేద తీరుతూ ఉండిపోతారు. ఇలాంటి సందర్భాల్లో, చమట పట్టిన ప్రదేశాల్లో ఫంగస్ పెరిగే ప్రమాదం ఉంటుంది. అలాగే చర్మ రంధ్రాల నుంచి వెలువడే చర్మపు నూనెలు, చమట కలిసి ఎగ్జిమా సమస్యను కూడా పెంచుతాయి.

వేసవి ఆహారం

ఈ కాలంలో చర్మపు ఆరోగ్యం కోసం పైపూతలు, ఎండను, వేడిని అడ్డుకునే జాగ్రత్తలు పాటించడంతో పాటు తగిన ఆరోగ్య నియమాలు కూడా పాటించాలి. అవేంటంటే...

- దానిమ్మ, గుమ్మడి, పుచ్చ, క్యారెట్, క్యాప్సికమ్ లాంటి ఎరుపు, నారింజ రంగు పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి
- నీళ్లకే పరిమితం కాకుండా కొబ్బరినీళ్లు, మజ్జిగ, నిమ్మరసం తాగాలి
- పండ్ల రసాలకు బదులుగా పండ్లు తినడం అలవాటు చేసుకోవాలి
- శీతల పానీయాలు, చక్కెర కలిసిన పండ్ల రసాలు తాగకూడదు
- నూనెలో వేయించిన పదార్థాలు బాగా తగ్గించాలి

చర్మపు అలర్జీలు



ఎగ్జిమా పొడి వాతావరణంలోనే తీవ్రమవుతూ ఉంటుంది. కానీ అరుదుగా కొందర్లో వేసవిలో ఎక్కువ చమట పట్టినప్పుడు, ముందు నుంచీ అలర్జీ తత్వం కలిగి ఉన్నప్పుడు ఎగ్జిమా వేధిస్తుంది. ఈ సమస్యను అదుపులో ఉంచుకోవడం కోసం నాణ్యమైన మాయిశ్చరైజర్ వాడుకోవాలి. అవసరానికి మించి సబ్బును ఉపయోగించడం వల్ల సహజసిద్ధ చర్మపు నూనెలు తొలగిపోతాయి కాబట్టి సబ్బు పరిమితంగా వాడుకోవాలి. అలాగే స్నానం చేసిన తర్వాత తడి లేకుండా టవల్‌తో శుభ్రంగా తుడుచుకున్న తర్వాతే దుస్తులు వేసుకోవాలి. మరీ ముఖ్యంగా కాలి వేళ్లు, బాహుమూలలు, కటి ప్రదేశాల్లో తడి లేకుండా చూసుకోవాలి.



డాక్టర్ హర్షిత రెడ్డి బొందుగుల
కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్

తెలుసుకుందాం



అరటితో బిపి దూరం

అధిక రక్తపోటున్న వాళ్లు రోజుకొక అరటిపండు తినాలంటున్నారు వైద్యులు. ఎందుకో తెలుసుకుందాం!

అరటిపండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఒక అరటిపండులో దాదాపు 400 నుంచి 450 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. అది మన దైనందిన పొటాషియం పరిమాణంలో పది శాతంతో సమానం. ఇంతకూ రక్తపోటుకూ పొటాషియంకూ సంబంధం ఏంటో తెలుసుకుందాం! పొటాషియం శరీరంలోని సోడియం దుష్ప్రభావాలను కుంటు పరుస్తుంది. ప్రాసెస్డ్ పదార్థాలు, చిరుతిళ్లు, నిల్వ పచ్చళ్లు, హోటల్ భోజనాల ద్వారా మనం అవసరానికి మించి ఉప్పు తింటూ ఉంటాం. ఈ సోడియం శరీరంలో నీటి నిల్వను పెంచుతుంది. ఫలితంగా రక్తపు పరిమాణం పెరిగి, రక్తపోటు పెరుగుతుంది. ఈ అదనపు సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపించడంలో పొటాషియం సహాయపడుతుంది. కాబట్టి ఉదయం అల్పాహారానికీ, మధ్యాహ్న భోజనానికీ మధ్య ఒక అరటిపండు తినడం అలవాటు చేసుకోవాలి. ఈ పండుతో పాటు గ్లాసుడు నీళ్లు, గుప్పెడు నట్స్ కూడా తీసుకోవడం ఆరోగ్యకరం.

వ్యాయామం

చేతులు బలంగా!

ముంజేతులు చక్కని ఆకృతి సంతరించుకోవాలంటే ప్రత్యేకించి కొన్ని వ్యాయామాలు చేయాలి. వాటిలో చెప్పుకోదగినది 'ఛెయిర్ డిప్స్'. ఈ వ్యాయామం కోసం...

- దృఢంగా ఉండే కుర్చీని ఎంచుకోవాలి.
- కుర్చీని ఆనుకుని నేల మీద కూర్చుని, కాళ్లను పొడవుగా చాపి, రెండు చేతులను కుర్చీ మీద ఉంచి, చేతుల సహాయంతో శరీరాన్ని పైకి లేపాలి.
- పైకి లేచి, కిందకి కుంగేటప్పుడు కాళ్లు రెండు మోకాళ్ల దగ్గర వంచాలి.
- ఇలా చేస్తున్నప్పుడు పూర్తి శరీర బరువు చేతుల మీద పడుతుంది.
- ఇలా 20 సార్లు, వరుసగా 3 సెట్లు చేయాలి.
- ఈ వ్యాయామం వల్ల భుజాలు, వెన్ను, చేతుల్లోని కండరాలు బలపడతాయి.



నికొటిన్ చేటు


ఇ సిగరెట్స్ కూడా వ్యసనమే!

పొగ, దుర్గంధం సమస్య లేకుండా, చూపులకు ఆకర్షణీయంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇటీవలి కాలంలో స్మోకింగ్‌కు బదులుగా 'ఇ సిగరెట్స్' విపరీతంగా ఊపందుకుంటోంది. అయితే ఈ అలవాటు కూడా ప్రమాదకరమేనని హెచ్చరిస్తున్నారు వైద్యులు.

ధూమపాన వ్యసనపరులకున్న ఆ దురలవాటును మాన్పించడం కోసం ఆవిష్కరించిన ఆధునిక ప్రత్యామ్నాయమే 'ఇ సిగరెట్స్'! నికొటిన్‌కు అలవాటు పడిన వాళ్లు అకస్మాత్తుగా ధూమపానాన్ని మానుకోవడం వల్ల విత్‌డ్రాయల్ లక్షణాలతో బాధపడవలసి వస్తుంది. కాబట్టి ప్రారంభంలో తక్కువ నికొటిన్‌ను కలిగి ఉండే ఇ సిగరెట్స్‌ను వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఆ తర్వాత క్రమేపీ ఆ అలవాటును కూడా మాన్పించేస్తూ ఉంటారు. అయితే క్రమేపీ ఇ సిగరెట్స్ కూడా ఒక వ్యసనంగా మారిపోతూ ఉండడంతో ప్రభుత్వం ఇ సిగరెట్స్ పరికరాలను బహిష్కరించింది. అయినప్పటికీ విదేశాల నుంచి వీటిని దిగుమతి చేసుకుని వాడుకుంటున్న వారు లేకపోలేదు.

వేప్ అనర్థాలు ఇవే!

ఇ సిగరెట్స్‌గా పేరు పొందిన వేప్ పెన్స్, వేప్ జ్యూస్ అనే ఈ పరికరాల్లో ప్రొపైలీన్ గ్లైకాల్, ఫ్లేవరింగ్ ఏజెంట్లు, నికొటిన్ పైపూత కలిగిన ద్రవాలు ఉంటాయి. ధూమపానానికి మించి ఇ సిగరెట్స్ పట్ల ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం, దీన్నుంచి పొగ వెలువడకపోవడమే! అలాగే మధురమైన వాసన కలిగి



ఉండే ఇ సిగరెట్స్ చూపులకు స్టైల్‌గా కనిపిస్తూ ఉంటుంది. దీని వాడకంతో దంతాల రంగు మారే ప్రమాదం కూడా ఉండదు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో, కార్లలో, ఇంట్లో.. ఇలా ఎక్కడైనా ఉపయోగించే వీలు ఉండడంతో ఇ సిగరెట్స్ అన్ని వయసుల వారినీ ఆకట్టుకుంటోంది. అయితే ఇ సిగరెట్స్‌తో మెదడు, గుండె, ఊపిరితిత్తులు, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

అపోహలు వీడాలి

ఇ సిగరెట్స్ వాడకంతో ఊపిరితిత్తులు దెబ్బతింటున్న సందర్భాలు పెరుగుతూ ఉండడంతో ప్రపంచ దేశాలన్నీ అప్రమత్తమవడం మొదలుపెట్టాయి. ఇ సిగరెట్స్ అలవాటు, ధూమపాన వ్యసనాన్ని మించినది. దీన్ని మానుకోవడం చాలా కష్టం. దీన్ని ఉపయోగించడం మొదలుపెట్టిన వాళ్లు నికొటిన్‌కు మరింత అలవాటు పడడమే కాకుండా, తిరిగి ధూమపానానికి మళ్లే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి ధూమపానం మానుకోవడం కోసం ఇ సిగరెట్స్ మీద ఆధారపడడం సరి కాదు. ఇ సిగరెట్స్‌తో ధూమపానం కోరిక మరింత పెరుగుతుంది. కాబట్టి ఈ దురలవాటును మానుకోవాలనుకునేవారు వైద్యులను కలిసి థెరపీ తీసుకోవాలి.

ప్యాచ్‌లు, చూయింగ్ గమ్‌లతో...

ఇ సిగరెట్స్ పరికరాలు బ్యాటరీతో పని చేస్తాయి. కాబట్టి దీర్ఘకాలంలో వీటి ప్రభావం శరీరం మీద ఏ మేరకు ఉండబోతున్నది ఎవరికీ తెలియదు. ఇ సిగరెట్స్‌తో ఒరిగే దీర్ఘకాలిక ఆరోగ్య దుష్ప్రభావాల గురించి మరింత లోతుగా అధ్యయనాలు జరగవలసిన అవసరం కూడా ఉంది. ఇ సిగరెట్స్‌తో నికొటిన్ మీద ఆధారపడే స్వభావం పెరుగుతుంది. కాబట్టి మొత్తంగా నికొటిన్ మీద ఆధారపడే స్వభావాన్ని తగ్గించుకోవాలి. దాన్నుంచి పూర్తిగా బయటపడడం కోసం కౌన్సెలింగ్‌ను ఆశ్రయించాలి. అలాగే నికొటిన్ అలవాటును క్రమేపీ తగ్గించుకోవడం కోసం నికొటిన్ ప్యాచ్‌లు, చూయింగ్ గమ్స్ వాడుకోవచ్చు. ధూమపానాన్ని ప్రేరేపించే అంశాలకు దూరంగా ఉండడం ద్వారా ఈ దురలవాటును పూర్తిగా వదులుకోవచ్చు.



డాక్టర్ ఎ. రఘుకాంత్
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైదరాబాద్.

పరిశోధన

నొప్పితో కుంగుబాటు

మూడు నెలలకు మించి తీవ్రమైన నొప్పి వేధిస్తూ ఉంటే, అంతిమంగా అది మానసిక కుంగుబాటుకు దారి తీస్తుందని పరిశోధనలో తేలింది. సైన్స్ అడ్వాన్సెస్‌లో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో శరీరంలోని వేర్వేరు ప్రాంతాల్లో తలెత్తే నొప్పుల వల్ల, సదరు వ్యక్తుల్లో మానసిక కుంగుబాటుకు గురయ్యే ముప్పు కూడా పెరుగుతూ ఉంటుందని పేర్కొనడం జరిగింది. మరిన్ని వివరాలు....



ప్రపంచవ్యాప్తంగా 30% మంది తీవ్రమైన నడుము నొప్పి, మైగ్రెయిన్ తదితర సమస్యలతో బాధపడుతున్నారు. వీళ్లలో ప్రతి ముగ్గురిలో ఒకరికి ఈ బాధలకు ఇతరత్రా నొప్పులు కూడా తోడవుతూ ఉంటాయి. నిజానికి నొప్పి శరీరానికే పరిమితం కాదు. భౌతిక బాధలు మానసిక ఆరోగ్య పరిణామాలకు దారి తీస్తాయి. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం యేల్ బృందం, యుకెలో బయోబ్యాంక్ దీర్ఘకాల అధ్యయనానికి పూనుకున్నాయి. దాన్లో భాగంగా 14 ఏళ్ల పాటు 4 లక్షల మందికి చెందిన ఆరోగ్య సమాచారాన్ని సేకరించి పరిశీలించినప్పుడు, తల, ముఖం, మెడ, వెన్ను, పొట్ట, పిరుదులు, మోకాళ్లు... ఇలా వేర్వేరు ప్రదేశాల్లో దీర్ఘకాల నొప్పులతో బాధపడేవారు మానసిక కుంగుబాటుకు కూడా గురవుతున్నట్టు తేలింది. అలాగే శరీరంలోని వేర్వేరు ప్రదేశాల్లో వేర్వేరు నొప్పులతో బాధపడేవారిలో మానసిక కుంగుబాటు తీవ్రత ఎక్కువగా ఉంటున్నట్టు కూడా పరిశోధకులు కనిపెట్టారు. ఇందు కోసం యేల్ పరిశోధకులు నొప్పితో బాధపడే వ్యక్తుల రక్తంలోని ఇన్‌ఫ్లమేటరీ మార్కర్లు, సి రియాక్టివ్ ప్రొటీన్స్, ప్లేట్‌లెట్లు, తెల్ల రక్త కణాలను పరిశీలించారు. వీటి ద్వారా నొప్పిని, మానసిక కుంగుబాటుతో ముడిపెట్టే ప్రాథమిక ఆధారాలను వాళ్లు కనిపెట్టగలిగారు. ఈ పరిశోధన ఆధారంగా భౌతిక ఆరోగ్యానికీ, మానసిక ఆరోగ్యానికీ మధ్య నెలకొని ఉన్న బంధాన్ని లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా, నొప్పితో ముడిపడి ఉండే మానసిక కుంగుబాటును అరికట్టే దిశగా మరింత వినూత్నమైన వ్యూహాలను అభివృద్ధి చేయడం సాధ్యపడుతుందని పరిశోధకులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల ఆరోగ్యం

సాధారణ ప్రసవంతో బిడ్డకు రక్ష



భారతదేశంలో ఐదో వంతు ప్రసవాలు సి సెక్షన్ ద్వారానే జరుగుతున్నాయి. నేషనల్ ఫ్యామిలీ సర్వేలో వెల్లడైన గణాంకాల ప్రకారం మన దేశంలో 2019 నుంచి 2021 మధ్య కాలంలో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సి సెక్షన్లు 40.6 శాతం నుంచి 47.4 శాతానికి పెరిగాయి. అయితే సాధారణ ప్రసవం, సి సెక్షన్ ప్రసవాల్లో పుట్టిన పిల్లల పోషకావసరాలు ఒకేలా ఉంటాయని చాలా మంది తల్లితండ్రులు భావిస్తూ ఉంటారు. కానీ ఇది నిజం కాదని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. పిల్లల పేగుల్లోని బ్యాక్టీరియా, వ్యాధినిరోధక వ్యవస్థలు, దీర్ఘకాలిక ఆరోగ్యాలు వాళ్లు పుట్టిన తీరు మీదే ఆధారపడతాయి. సాధారణ ప్రసవంలో పుట్టిన పిల్లలు తల్లి బర్త్ కెనాల్ నుంచి ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను పొందుతారు. ఈ రకమైన ప్రసవం పేగుల్లోని బ్యాక్టీరియాను ప్రభావితం చేస్తుంది. కానీ సి సెక్షన్‌లో పుట్టిన పిల్లలు ఈ బ్యాక్టీరియాను పొందకపోగా, ఆస్పత్రి పర్యావరణం, తల్లి చర్మాల నుంచి మొట్టమొదటి మైక్రోబ్స్‌ను స్వీకరిస్తారు. సూక్ష్మజీవులకు బహిర్గతమవడంలో ఉన్న ఈ వ్యత్యాసాలు పిల్లల వ్యాధినిరోధక అభివృద్ధినీ, పేగుల ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తాయి. సిజేరియన్‌తో పుట్టిన పిల్లల పేగుల బ్యాక్టీరియాలోని అవకతవకల వల్ల, ఈ పిల్లలు తేలికగా అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ ఉంటారు. దీర్ఘకాలంలో ఒబేసిటీ, టైప్1, టైప్2 మధుమేహాలు, నాడీసంబంధ రుగ్మతలు, ఆటిజం ముప్పు కూడా ఈ పిల్లలకు పొంచి ఉంటుంది. అయితే సాధారణ ప్రసవంలో పుట్టిన పిల్లల్లా ఈ పిల్లలు కూడా పూర్తి ఆరోగ్యాన్ని పొందాలంటే, ఘనాహారాన్ని పరిచయం చేసే తొలి రోజుల నుంచి ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని పిల్లలకు అందించాలి.

ద్వంద్వ పిండిపదార్థాలు

మర్మం పిండిపదార్థాల్లోనే

ఎంత వ్యాయామం చేసినా, ఎన్ని ఆహార నియమాలు పాటించినా బరువు తగ్గడం లేదంటే అసలు సమస్య మనం తీసుకునే పిండిపదార్థాల్లోనే దాగి ఉంటుంది. అదెలాగంటే...



ఎక్కువ సందర్భాల్లో మనం రెండు రకాల పిండిపదార్థాలను కలిపి తింటూ ఉంటాం! దీన్నే డబుల్ కార్బింగ్ అంటున్నారు ఫిటెలో‌లో డైట్ కంపెనీలో పని చేస్తున్న ప్రముఖ డైటీషియన్ ఉమంగ్ మల్హోత్రా. అన్నం, బంగాళాదుంపల కూర, చపాతీ, పులావ్, పప్పు లేదా పాస్తా, బ్రెడ్... ఇలా ఒకే భోజనంలో రెండు రకాల పిండి పదార్థాలను కలిపి తినడం వల్ల భోజనంలోని పిండిపదార్థాల మోతాదు పెరిగిపోతుందనీ, దాంతో పాటే పోషకాల సంతులనం లేని క్యాలరీలు శరీరానికి తోడవుతూ ఉంటాయనీ అంటున్నారాయన. ఈ అదనపు పిండిపదార్థాల వల్ల రక్తంలో చక్కెర మోతాదులు త్వరితంగా పెరిగి, వాటితో పాటు ఇన్సులిన్ మోతాదులు పెరిగి, కొవ్వు పేరుకుపోతుందని హెచ్చరిస్తున్నారు. అత్యధిక పిండిపదార్థాలతో కూడిన ఆహారం తినడం ద్వారా శరీరంలో పెరిగే ఇన్సులిన్, పేరుకున్న కొవ్వును శరీరం కరిగించుకునే సామర్థ్యాన్ని కుంటుపరుస్తుందనీ, దాంతో బరువు తగ్గడం మరింత కష్టమవుతుందనీ హెచ్చరిస్తున్నారాయన. కాబట్టి ఒకే భోజనంలో రెండు పిండిపదార్థాలను ఎంచుకోడానికి బదులుగా అత్యధిక పీచు కలిగిన కూరగాయలు, లేదా ప్రొటీన్‌తో పిండిపదార్థాలను జోడించుకోవాలి. ఉదాహరణకు సోయా పులావ్ తింటున్నప్పుడు దాంతో పాటు కూరగాయల వేపుడు ఎంచుకోవాలి.

ఇక నేరుగా సెబీ మధ్యవర్తిత్వం!

న్యూఢిల్లీ: ఎంపిక చేసిన కొన్ని కేసుల్లో ఇక నేరుగా మధ్యవర్తిత్వానికి దిగాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. సంబంధిత పార్టీలు వచ్చే నెల 12లోగా ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరింది. అయితే ఏ కేసుల్లో పడితే ఆ కేసుల్లో గాకుండా కనీసం రూ.10 కోట్లు లేదా అంతకు మించిన వివాదాలు తలెత్తే కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ఒకే అంశంపై పదేపదే తలెత్తే కేసుల్లో మాత్రమే ఈ మధ్యవర్తిత్వం జరపాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిసొల్యూషన్ (ఓడీఆర్) వ్యవస్థనీ సమూలంగా మార్చేయాలని సెబీ యోచిస్తున్నట్టు సమాచారం.

పక్కాగా ఇన్‌సైడర్ నిబంధనలు: లిస్టెడ్ కంపెనీల షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌ను కట్టడి చేసేందుకు సెబీ మరో కీలక చర్య తీసుకుంది. ఈ నిషేధం పరిధిలోకి వచ్చే వ్యక్తుల జాబితాను మరింత విస్తరించింది. లిస్టెడ్ కంపెనీల ప్రమోటర్లు, బోర్డు సభ్యులు, కీలక ఉద్యోగులు, ఆడిటర్లతో పాటు వారి సమీప బంధువులను కూడా ఈ జాబితాలో చేర్చింది. కంపెనీలు వీరి వివరాలను ఆయా కంపెనీల షేర్ల ట్రేడింగ్ విండో క్లోజ్ చేసేందుకు రెండు మూడు రోజుల ముందే డిపాజిటరీలకు తెలియజేయాలని స్పష్టం చేసింది. ఈ నిషేధాన్ని రెండు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశ జూలై 1 నుంచి టాప్-500 లిస్టెడ్ కంపెనీల షేర్లకు, అక్టోబరు 1 నుంచి మిగతా కంపెనీల షేర్లకు అమలు చేస్తారు.

5 రోజులు రూ.32 లక్షల కోట్లు

మార్కెట్ ర్యాలీలో భారీగా పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: ఈక్విటీ మార్కెట్ అద్భుతమైన ర్యాలీలో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఫలితంగా ఐదు వరుస ట్రేడింగ్ సెషన్లలో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఐదు సెషన్లలో నికరంగా రూ.32,03,295.80 కోట్లు పెరిగి రూ.4,25,85,629.02 కోట్లకు (5 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. సోమవారం సర్వత్రా నెలకొన్న సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ 855.30 పాయింట్లు లాభపడి 79,408.50 వద్ద ముగిసింది. నిఫ్టీ 273.90 పాయింట్లు లాభపడి 24,125.55 వద్ద క్లోజయింది. ఐదు వరుస ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 5,561.35 పాయింట్లు, నిఫ్టీ 1,726.40 పాయింట్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్ షేర్లలో సాగిన కొనుగోళ్ల మద్దతుతో బ్యాంక్ నిఫ్టీ సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి 55,200 వరకు దూసుకుపోయింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పైన, ట్రంప్ అస్తవ్యస్త టారిఫ్ విధానం పైన విశ్వాసం కోల్పోయిన విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి భారత మార్కెట్‌పై దృష్టి సారించారు. గత వారంలో ట్రేడింగ్ జరిగిన మూడు రోజుల్లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.8,472 కోట్ల విలువ గల కొనుగోళ్లు నిర్వహించారు. మార్కెట్‌పై బుల్స్ పట్టు సాధించాయని, మూడు నెలల కాలంలో జరిగిన మూడో ప్రయత్నంలో నిఫ్టీ 24,000 కన్నా పైన ముగిసిందని, బ్యాంక్ నిఫ్టీ కూడా కొత్త రికార్డు స్థాయిలో ముగిసిందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు.

- సోమవారం నాటి ర్యాలీ అన్ని రంగాలకు విస్తరించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 2.20%, స్మాల్‌క్యాప్ సూచీ 1.67% లాభపడ్డాయి. బీఎస్ఈలోని రంగాల వారీ సూచీలన్నీ కూడా 2% పైబడి లాభపడ్డాయి.
- గత వారంలో ఆర్థిక ఫలితాలు ప్రకటించిన నేపథ్యంలో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు బీఎస్ఈలో 2.13% లాభపడి రూ.1,450.45 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.12,563.63 కోట్ల మేరకు పెరిగి రూ.6,02,410.10 కోట్ల వద్ద స్థిరపడింది.
- బీఎస్ఈలో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు ఇంట్రాడేలో 2.15% మేరకు లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,437ని తాకినప్పటికీ చివరికి 0.20% లాభంతో రూ.1,409.40 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 1.10% లాభంతో రూ.1,927.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 2.27% లాభంతో 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,950ని తాకింది.



రూపాయిదీ అదే ర్యాలీ

ఈక్విటీ మార్కెట్ తరహాలోనే ఫారెక్స్ మార్కెట్లో కూడా డాలర్ మారకంలో రూపాయి అద్భుతమైన ర్యాలీని సాధించింది. ఐదో రోజు కూడా ర్యాలీని కొనసాగించిన రూపాయి డాలర్ విలువతో పోల్చితే 23 పైసలు లాభపడి 85.15 వద్ద ముగిసింది. డాలర్ ఇండెక్స్ బలహీనపడి మూడు సంవత్సరాల కనిష్ఠ స్థాయి 99ని బ్రేక్ చేయడం ఇందుకు దోహదపడిందని ఫారెక్స్ విశ్లేషకులంటున్నారు. ఈ నెల 9వ తేదీన 86.68 వద్ద ముగిసిన రూపాయి ఆ తర్వాత 5 వరుస ట్రేడింగ్ సెషన్ల ర్యాలీలో 155 పైసలు బలపడింది. డాలర్ బలహీనపడిన కారణంగా సమీప భవిష్యత్తులో రూపాయి 84.80-8535 మధ్యన ట్రేడ్ కావచ్చని విశ్లేషకులంటున్నారు.

బీఓబీలో వాటా పెంచుకున్న ఎల్ఐసీ

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ)లో వాటాను 2% మేరకు పెంచుకోవడంతో ప్రస్తుతం అది 7.05 శాతానికి చేరింది. గత ఏడాదిన్నర కాలంలో బీఓబీకి చెందిన 10.45 కోట్ల షేర్లను కొనుగోలు చేసినట్టు ఎల్ఐసీ తెలిపింది.

రామ్‌రాజ్ కాటన్ నుంచి 'మృదు టవల్స్'

ప్రచారకర్తగా మీనాక్షి చౌదరి



చెన్నై (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ, ఎథ్నిక్ వేర్ కంపెనీ రామ్‌రాజ్ కాటన్.. ప్రీమియం హోమ్ టెక్స్‌టైల్ విభాగంలోకి ప్రవేశించింది. 'మృదు టవల్స్' తో రామ్‌రాజ్ ఈ విభాగంలోకి అడుగుపెట్టింది. ఈ టవల్స్ కోసం ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరిని బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌రాజ్ కాటన్ నియమించుకుంది. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్ మాట్లాడుతూ.. మృదు టవల్స్‌ను వంద శాతం కాటన్, వెదురు నారతో తయారు చేసినట్లు చెప్పారు. కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా ఈ టవల్స్‌ను అత్యుత్తమ నాణ్యత, వినూత్నమైన డిజైన్లతో తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. కాగా రామ్‌రాజ్ మృదు టవల్స్‌కు ప్రచారకర్తగా ఎంపిక కావటం తనకెంతో ఆనందంగా ఉందని మీనాక్షి చౌదరి అన్నారు.

స్టీల్ దిగుమతులకు చెక్

12 శాతం ప్రత్యేక సుంకం విధింపు

న్యూఢిల్లీ: దేశీయ స్టీల్ పరిశ్రమ ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సోమవారం కీలక చర్య తీసుకుంది. హెచ్‌ఆర్ కాయిల్స్, షీట్లు, ప్లేట్లు, సీఆర్ కాయిల్స్, షీట్లు వంటి ఐదు రకాల స్టీల్ దిగుమతులపై వాటి విలువపై 12 శాతం చొప్పున సేఫ్‌గార్డ్ డ్యూటీ పేరుతో ప్రత్యేక దిగుమతి సుంకం విధిస్తున్నట్టు ప్రకటించింది. ఇందుకోసం ఈ స్టీల్ ఉత్పత్తుల కనీస దిగుమతి ధరను టన్నుకు 675 డాలర్ల నుంచి 964 డాలర్లుగా నిర్ణయించింది. ఈ ధర కంటే తక్కువ ధరకు దిగుమతి అయ్యే స్టీల్ ఉత్పత్తులకు మాత్రమే ఈ 12 శాతం సుంకం వర్తిస్తుంది. ఈ సుంకం 200 రోజుల పాటు అమల్లో ఉంటుంది. చైనాతో సహా వివిధ దేశాల నుంచి చౌకగా వచ్చిపడే దిగుమతులకు చెక్ పెట్టేందుకు కేంద్రం ఈ చర్య తీసుకుంది.

ఆయుధాల తయారీలోకి మేఘా గ్రూప్

హైదరాబాద్‌లో కారకాల్, ఐకామ్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) చిన్న తరహా ఆయుధాల తయారీలోకి ప్రవేశించింది. కంపెనీ అనుబంధ సంస్థ ఐకామ్ టెలీ లిమిటెడ్, యూఏఈకి చెందిన ఎడ్జ్ గ్రూప్‌తో కలిసి ఈ ఆయుధాల తయారీ చేపట్టింది. హైదరాబాద్‌లోని ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ కేంద్రంలో ఈ చిన్న అయుధాల తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఎడ్జ్ గ్రూప్ అనుబంధ సంస్థ కారకాల్ ఈ ఆయుధాల తయారీకి అవసరమైన పూర్తి టెక్నాలజీని ఐకామ్ టెలీకి అందిస్తోంది. ఈ టెక్నాలజీ సాయంతో ఐకామ్ తన ప్లాంట్‌లో ఈ చిన్న తరహా ఆయుధాలను తయారు చేసి భారత సైన్యం, పారా మిలిటరీ దళాలకు సరఫరా చేస్తుంది.

తగ్గిన పిట్టీ ఇంజనీరింగ్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.472.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.36.14 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.46 కోట్లు)తో పోల్చితే లాభం 21.43 శాతం తగ్గగా ఆదాయం మాత్రం 28.54 శాతం పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.1,743.36 కోట్ల ఆదాయంపై రూ.122.29 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24తో పోల్చితే ఆదాయం 34.87 శాతం పెరగగా లాభం 36.33 శాతం వృద్ధి చెందింది. మార్చి ముగిసే నాటికి కంపెనీ నికర రుణ భారం రూ.439.04 కోట్లుగా ఉంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 (30 శాతం) డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

హైదరాబాద్‌లో డైఫుకు యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో జపాన్ కంపెనీ తన యూనిట్‌ను ప్రారంభించింది. ఇంట్రా లాజిస్టిక్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ ఆటోమేషన్‌లో పేరొందిన డైఫుకు కంపెనీ హైదరాబాద్‌లో తన అధునాతన తయారీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. డైఫుకు ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరు తో కంపెనీ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మేకిన్ ఇండియాలో భాగంగా ఈ యూనిట్ ఏర్పాటు చేసినట్టు తెలిపింది.

హైదరాబాద్ రియల్టీలోకి సెర్టస్ క్యాపిటల్

సైబర్‌సిటీ బిల్డర్స్‌లో రూ.180 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సెర్టస్ క్యాపిటల్ తన కార్యకలాపాలను హైదరాబాద్ రియల్టీకి విస్తరించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సైబర్‌సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్.. హైటెక్ సిటీ సమీపంలో నిర్మించే రెసిడెన్షియల్ ప్రాజెక్టులో రూ.180 కోట్లు పెట్టుబడి పెట్టింది. హైదరాబాద్ రియల్టీలో తమకు ఇదే తొలి పెట్టుబడి అని తెలిపింది.

మైనర్లూ.. మీ బ్యాంక్ అకౌంట్ మీరే ఆపరేట్ చేసుకోండి

అనుమతించిన ఆర్‌బీఐ

ముంబై: ఇక నుంచి మైనర్లు బ్యాంక్ అకౌంట్ స్వయంగా ఆపరేట్ చేసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుమతించింది. 10 సంవత్సరాల వయసు పైబడిన మైనర్లందరూ తమ సహజసిద్ధమైన లేదా చట్టబద్ధమైన సంరక్షకుని ద్వారా పొదుపు/టర్మ్ డిపాజిట్ ఖాతాలు తెరుచుకునేందుకు, స్వయంగా ఆపరేట్ చేసుకునేందుకు అనుమతించాలని సూచిస్తూ బ్యాంకులకు ఆర్‌బీఐ సవరించిన ఆదేశాలు జారీ చేసింది. అంతే కాదు... వారు తల్లిని సంరక్షకురాలుగా పెట్టుకుని ఖాతాలు తెరిచేందుకు కూడా అనుమతించింది. అయితే తమ రిస్క్ నిర్వహణ విధానానికి అనుగుణంగా నిబంధనలు, ఖాతాలో నిల్వ మొత్తాన్ని బ్యాంకులు నిర్ణయించవచ్చని పేర్కొంది. ఆ నియమనిబంధనలన్నింటికీ ఖాతాదారుకి తెలియచేయాలని కూడా సూచించింది. మైనారిటీ తీరిన అనంతరం ఖాతాదారు వద్ద తాజాగా నమూనా సంతకాలు తీసుకుని రికార్డుల్లో భద్రపరచాలని తెలిపింది. మైనర్ల ఖాతాలపై ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం/డెబిట్ కార్డు, చెక్ బుక్ వంటి అదనపు సదుపాయాలు కల్పించే విషయంలో నిర్ణయాధికారం బ్యాంకులదేనని పేర్కొంది. మైనర్ల ఖాతాల్లో కనీస నిల్వ తగినంతగా ఉండేలా చూడాలని, ఎలాంటి పరిస్థితిలోనూ ఓవర్ డ్రాకు అనుమతించవద్దని సూచించింది. బ్యాంకులన్నీ ఈ ఏడాది జూలై ఒకటవ తేదీ దాటకుండా ప్రస్తుత విధానాల్లో సవరణలు లేదా కొత్త నిబంధనల జోడింపు చేయాలని ఆదేశించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22న తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	400
చిత్తూరు	440	విశాఖపట్నం	425
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	122
వరంగల్	120	గుంటూరు	110
కరీంనగర్	120	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	80
కర్నూలు	120	నెల్లూరు	85
విశాఖపట్నం	111	అనంతపురం	85
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▲	90,150 ▲	1,11,000 ▲
విజయవాడ	98,500 ▲	92,000 ▲	99,000 ▼
విశాఖపట్నం	1,00,060 ▲	90,150 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,350 ▲	90,150 ▲	98,600 ▲
ప్రొద్దుటూరు	97,000 ▲	89,240 ▲	98,700 ▲
ముంబై	96,670 ▲	88,550 ▲	96,242 ▼

స్పోర్ట్స్

రోహిత్, విరాట్ 'టాప్'లోనే..



శ్రేయాస్, ఇషాన్‌కు చాన్స్
గ్రేడ్ 'సి'లో నితీశ్, తిలక్, అభిషేక్
బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టుల విడుదల

న్యూఢిల్లీ: స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్‌లో తమ ఎ+ గ్రేడ్‌ను నిలబెట్టుకున్నారు. టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలకడంతో వీరికి దక్కే గ్రేడ్‌పై ఉత్కంఠ నెలకొంది. తాజాగా సోమవారం 34 మందితో కూడిన ఎ+, ఎ, బి, సి కాంట్రాక్ట్ జాబితాను బోర్డు ప్రకటించింది. అయితే ఈ జాబితా 2024 అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు మాత్రమే వర్తించనుంది. దీంట్లో ఎప్పటిలాగే కెప్టెన్ రోహిత్, విరాట్‌లకు ఎ+ గ్రేడ్ దక్కింది. పేసర్ బుమ్రా, రవీంద్ర జడేజా కూడా వీరితో పాటున్నారు. జడ్డూ కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. అయితే నిబంధనల ప్రకారం మూడు ఫార్మాట్లలో అద్భుత ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లకే ఏ+ గ్రేడ్‌లో చోటు దక్కుతుంది. కానీ రోహిత్, విరాట్, జడేజా ప్రస్తుతం రెండు ఫార్మాట్లకే పరిమితమయ్యారు. మరి వీరికి ఎ+లో ఎందుకు చోటు కల్పించారనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'గతేడాది అక్టోబరు నుంచి వర్తించే ఈ జాబితాలో 2023 ప్రదర్శన ఆధారంగానే ఆటగాళ్ల ఎంపిక ఉంటుంది. కాబట్టి వారు ఆ సమయంలో టీ20 వరల్డ్ కప్‌తో పాటు మూడు ఫార్మాట్లలోనూ ఆడారు' అని బోర్డు అధికారి పేర్కొన్నాడు. ఈ నలుగురికి ఏడాదికి రూ.7 కోట్లు అందుతాయి.



నితీష్

శ్రేయాస్, ఇషాన్ వచ్చేశారు..: దేశవాళీ క్రికెట్‌ను విస్మరించినందుకు గతేడాది కాంట్రాక్ట్ జాబితా నుంచి శ్రేయాస్, ఇషాన్‌లను బోర్డు తొలగించింది. అయితే తాజాగా శ్రేయా‌స్‌కు నేరుగా గ్రూప్ 'బి'లో చోటు దక్కగా.. ఇషాన్‌ను గ్రూప్ 'సి'లో చేర్చారు. అలాగే రిషబ్ పంత్.. అశ్విన్ స్థానంలో గ్రూప్ 'ఎ'కు ప్రమోట్ అయ్యాడు. ఇక గ్రూప్ 'సి'లో 17 నుంచి 19కి ఆటగాళ్ల సంఖ్యను పెంచారు. సర్ఫరాజ్, జురెల్‌తో పాటు ఆంధ్ర క్రికెటర్ నితీశ్‌కుమార్, అభిషేక్, హర్షిత్, వరుణ్‌లకు తొలిసారి చోటు దక్కింది. మరోవైపు గ్రేడ్ 'సి'లో ఉన్న శార్దూల్, కేఎస్ భరత్, జితేశ్, అవేశ్‌లను జాబితా నుంచి తొలగించారు. తెలుగు ఆటగాళ్లను పరిశీలిస్తే..గ్రేడ్-ఎలో సిరాజ్, గ్రేడ్-సిలో నితీశ్ కుమార్, తిలక్‌వర్మ ఉన్నారు.

వార్షిక జాబితా

గ్రేడ్ 'ఎ+' (రూ.7 కోట్లు): రోహిత్, విరాట్ కోహ్లీ, బుమ్రా, జడేజా

గ్రేడ్ 'ఎ' (రూ.5 కోట్లు): సిరాజ్, కేఎల్ రాహుల్, షమి, పంత్, గిల్, హార్దిక్

గ్రేడ్ 'బి' (రూ.3 కోట్లు): సూర్యకుమార్, శ్రేయాస్, కుల్దీప్, అక్షర్, జైస్వాల్

గ్రేడ్ 'సి' (రూ. కోటి): రింకూ, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, నితీశ్ కుమార్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్, తిలక్ వర్మ, వాషింగ్టన్, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, రుతురాజ్, ముకేశ్ కుమార్, పటీదార్, ఇషాన్ కిషన్, శివం దూబే, శాంసన్, జురెల్, అభిషేక్, హర్షిత్ రాణా.

రమేష్‌పై చర్య తీసుకోవాలి

ఓయూ స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్

హైదరాబాద్: డోపింగ్ వ్యవహారంలో 'నాడా' సస్పెండ్ చేసిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేష్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఫెడరేషన్ నాయకులు ఆందోళన చేశారు. ఈ విషయంపై ఫెడరేషన్ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ గతంలోనే రమేష్ శిక్షణ ఇస్తున్న అథ్లెట్లు నిషేధిత ఉత్ప్రేరకాలతో దొరకగా, తనకేమి తెలియదని మభ్యపెట్టి తప్పించుకున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇచ్చే సీఎస్ఆర్ నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. సాయ్ కేంద్రంలో కేవలం 20 మంది అథ్లెట్లకు మాత్రమే శిక్షణ ఇవ్వమని రమేష్‌ను కోచ్‌గా నియమిస్తే, ఆయన అనధికారికంగా చాలా మందికి అక్కడ కోచింగ్ ఇస్తున్నారని ఆరోపించారు. రమేష్ చేసిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు రాజేష్, ఓయూ విద్యార్థి నాయకులు జంపన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డుప్లాంటిస్‌కు లారెస్ అవార్డు



మాడ్రిడ్: ప్రతిష్ఠాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్ అవార్డును స్వీడన్ పోల్‌వాల్టర్ మాండో డుప్లాంటిస్(25) సొంతం చేసుకొన్నాడు. సోమవారం అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఒలింపిక్ స్వర్ణాన్ని నిలబెట్టుకొన్న డుప్లాంటిస్.. తన ప్రపంచ రికార్డును తనే అధిగమించాడు. టెన్నిస్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్, స్విమ్మర్ లియన్ మర్చండ్, సైక్లిస్ట్ టేడ్ పొగాకర్, ఎఫ్-1 రేసర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ కూడా ఈ అవార్డు కోసం పోటీపడ్డారు. కాగా, వరల్డ్ టీమ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును రియల్ మాడ్రిడ్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు గెల్చుకొంది. 'బ్రేక్ త్రూ ఆఫ్ ద ఇయర్' అవార్డును స్పెయిన్ యువ ఫుట్‌బాలర్ లామైన్ యమల్ సాధించాడు.

అగ్రస్థానానికి హంపి


ఫిడే: భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. సోమవారం జరిగిన ఏడో రౌండ్‌లో చైనా జీఎం ఝు జినెర్‌ను 55 ఎత్తుల్లో చిత్తు చేసింది. దాంతో ఝునెర్ (5)ను వెనక్కు నెట్టిన హంపి 5.5 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక.. పోలినా షువలోవా (రష్యా)తో పాయింట్‌ను పంచుకుంది. 3.5 పాయింట్లతో హారిక ఐదో స్థానంలో ఉంది. ముంగున్‌తూల్ (మంగోలియా)పై నెగ్గిన దివ్యా దేశ్‌ముఖ్ (5) రెండో స్థానానికి చేరింది. టోర్నీలో మరో రెండు రౌండ్లే మిగిలి ఉన్నాయి.

సిమ్రన్‌ప్రీత్‌కు రజతం

లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత షూటర్ల పతక జోరు సోమవారం కూడా కొనసాగింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ రెండోస్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. చైనా షూటర్లు సన్ యుజీ, యావో కియాన్‌గ్జున్ స్వర్ణ, కాంస్యాలు అందుకున్నారు. భారత స్టార్ మనూ భాకర్ నాలుగోస్థానానికి పరిమితమైంది.

శుభ్‌మన్.. దంచేన్

కోల్‌కతాపై గుజరాత్ ఘనవిజయం



శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 90)

నేటి మ్యాచ్ — లఖ్‌నవూ x ఢిల్లీ — రా.7.30 నుంచి — వేదిక: లఖ్‌నవూ

కోల్‌కతా: గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 90) అదరగొట్టాడు. మరోవైపు బౌలర్లు సమష్టిగా రాణించడంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ విలవిల్లాడింది. 199 పరుగుల ఛేదనలో తొమ్మిది మంది బ్యాటర్లతో బరిలోకి దిగినా కేకేఆర్ 39 రన్స్‌తో ఓడింది. అంతకుముందు బౌలింగ్‌లోనూ కేకేఆర్ పూర్తిగా తేలిపోయింది. ఈ విజయంతో టైటాన్స్ 12 పాయింట్లతో తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠ పర్చుకుంది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 52) అర్ధసెంచరీ సాధించగా బట్లర్ (23 బంతుల్లో 8 ఫోర్లతో 41 నాటౌట్) వేగం చూపాడు. ఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్లకు 159 పరుగులు చేసి ఓడింది. రహానె (50), రఘువంశీ (27 నాటౌట్) రస్సెల్ (21) మాత్రమే రాణించారు. రషీద్, ప్రసిద్ధ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.

టాపార్డర్ అదుర్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు గిల్, సుదర్శన్ నిలకడగా ఆడారు. అలాగే వన్‌డౌన్ బ్యాటర్ బట్లర్ ఈడెన్‌లో తన సూపర్ ఫామ్‌ను కొనసాగించాడు. అతడి రెండు క్యాచ్‌లను కేకేఆర్ వదిలేయడం కూడా టైటాన్స్‌కు లాభించింది. అయితే స్లో వికెట్ కావడంతో ఆరంభంలో గిల్ ఆచితూచి ఆడగా, సుదర్శన్ కాస్త వేగం కనబర్చాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులతో ఓ మాదిరి స్కోరందుకుంది. అయితే ఏడో ఓవర్‌లో గిల్ 6,4,4తో చెలరేగడంతో 17 రన్స్ సమకూరాయి. 11వ ఓవర్‌లో సుదర్శన్ 4,6తో 33 బంతుల్లో ఫిఫ్టీ సాధించగా, గిల్ కూడా అదే ఓవర్‌లో సింగిల్‌తో 34 బంతుల్లో ఈ ఫీట్ పూర్తి చేశాడు. ముఖ్యంగా స్పిన్నర్లను వీరు అద్భుతంగా అడ్డుకోగలిగారు. అయితే కేకేఆర్‌ను విసిగిస్తున్న ఈ జోడీని రస్సెల్ విడదీశాడు. 13వ ఓవర్‌లో కీపర్ గుర్బాజ్‌కు సుదర్శన్ క్యాచ్ ఇవ్వడంతో తొలి వికెట్‌కు 114 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కానీ అదే ఓవర్‌లో బట్లర్ వచ్చీ రాగానే హ్యాట్రిక్ ఫోర్లతో అలరించాడు. హర్షిత్ ఓవర్‌లోనూ తను రెండు ఫోర్లు బాదగా.. 16వ ఓవర్‌లో గిల్ రెండు ఫోర్లతో స్కోరు 150 దాటింది. సెంచరీకి సమీపంలో మరింత జోరు పెంచిన గిల్ పేసర్ వైభవ్ ఓవర్‌లో 6,4 బాది వెంటనే రింకూకు క్యాచ్ ఇచ్చాడు. మరోవైపు రూథర్‌ఫోర్డ్‌కన్నా ముందే క్రీజులోకి వచ్చిన తెవాటియా డకౌట్‌గా వెనుదిరిగాడు. చివరి ఓవర్‌లో బట్లర్ 4,4 షారుక్ (11 నాటౌట్) 6తో 18 రన్స్ రాబట్టిన టైటాన్స్ 200కి సమీపంలోకి రాగలిగింది. మొత్తంగా ఆఖరి 5 ఓవర్లలో జీటీ 59 రన్స్ కారణంగా భారీ స్కోరందుకుంది.

పోరాటమే లేకుండా..: ఈ పిచ్‌పై సవాల్‌గా మారిన ఛేదనకు బరిలోకి దిగిన కోల్‌కతా పేలవ ప్రదర్శన కనబర్చింది. కెప్టెన్ రహానె కాస్త పోరాడినా ఫలితం లేకపోయింది. బంతి బ్యాట్‌పైకి రాకపోవడంతో కేకేఆర్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు సాహసించలేదు. దీంతో వీరి ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. అటు చేయాల్సిన రన్‌రేట్ కష్టంగా మారడంతో కేకేఆర్ చేసేదేమీ లేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ గుర్బాజ్ (1)ను సిరాజ్ అవుట్ చేశాడు. మరో ఓపెనర్ నరైన్ (17) పవర్‌ప్లేలోనే వెనుదిరగ్గా, రెండో వికెట్‌కు రహానెతో కలిసి 41 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ స్థితిలో వెంకటేశ్ అయ్యర్‌తో కలిసి రహానె ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ ఇద్దరూ జాగ్రత్తగా ఆడడంతో 6-10 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాలేదు. 11వ ఓవర్‌లో రహానె 4,6తో స్కోరులో కదలిక వచ్చింది. కానీ తర్వాతి వరుస రెండు ఓవర్లలో ఈ ఇద్దరూ అవుటవడంతో ఆశలు ఆవిరయ్యాయి. రస్సెల్ జోరు కాసేపే అయ్యింది. 17వ ఓవర్‌లో రమణ్‌దీప్ (1), మొయిన్ అలీ (0) వికెట్లను తీసి ప్రసిద్ధ్ మరింత దెబ్బకొట్టాడు. చివర్లో రఘువంశీ ధాటిగా ఆడినా కేకేఆర్ ఓటమి లాంఛనమే అయ్యింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	7	5	2	0	10	0.589
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	8	5	3	0	10	0.088
ముంబై	8	4	4	0	8	0.483
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	7	2	5	0	4	-1.217
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు


గుజరాత్: సాయి సుదర్శన్ (సి) గుర్బాజ్ (బి) రస్సెల్ 52, గిల్ (సి) రింకూ (బి) వైభవ్ 90, బట్లర్ (నాటౌట్) 41, తెవాటియా (సి) రమణ్‌దీప్ (బి) హర్షిత్ 0, షారుక్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 198/3; వికెట్ల పతనం:** 1-114, 2-172, 3-177; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-44-1, మొయిన్ అలీ 3-0-27-0, హర్షిత్ రాణా 4-0-45-1, వరుణ్ 4-0-33-0, నరైన్ 4-0-36-0, రస్సెల్ 1-0-13-1.

కోల్‌కతా: గుర్బాజ్ (ఎల్బీ) సిరాజ్ 1, నరైన్ (సి) తెవాటియా (బి) రషీద్ 17, రహానె (స్టంప్డ్) బట్లర్ (బి) వాషింగ్టన్ 50, వెంకటేశ్ అయ్యర్ (సి) వాషింగ్టన్ (బి) సాయి కిషోర్ 14, రింకూ (సి) గిల్ (బి) ఇషాంత్ 17, రస్సెల్ (స్టంప్డ్) బట్లర్ (బి) రషీద్ 21, రమణ్‌దీప్ (సి అండ్ బి) ప్రసిద్ధ్ 1, అలీ (సి) షారుక్ (బి) ప్రసిద్ధ్ 0, రఘువంశీ (నాటౌట్) 27, హర్షిత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 159/8; వికెట్ల పతనం:** 1-2, 2-43, 3-84, 4-91, 5-118, 6-119, 7-119, 8-151; **బౌలింగ్:** సిరాజ్ 4-0-32-1, ఇషాంత్ 2-0-18-1, ప్రసిద్ధ్ 4-0-25-2, రషీద్ 4-0-25-2, వాషింగ్టన్ 3-0-36-1, సాయి కిషోర్ 3-0-19-1.

కృత్రిమ మేధతో ఉద్యోగాల ఊచకోత

» ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయి

» ఏఐపై బిల్‌గేట్స్, బరాక్ ఒబామా ఆందోళన



న్యూయార్క్, ఏప్రిల్ 21: స్మార్ట్‌ఫోన్ల ద్వారా సామాన్యుల చేతుల్లోకి సైతం వచ్చేసిన కృత్రిమ మేధ (ఏఐ) దెబ్బకు.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఉద్యోగాలు పోతాయని మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా ఆందోళన వ్యక్తం చేశారు. ఆ సంక్షోభం ఏ స్థాయిలో ఉంటుందంటే.. గత వందేళ్లలో ఎప్పుడూ చూడనంత భారీగా ఉంటుందని వారు వేర్వేరు వేదికలపై నుంచి హెచ్చరించారు. సమీప భవిష్యత్తులో వైద్యసేవలు, బోధన వంటివి కూడా ఏఐ ద్వారా సామాన్యులకు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని బిల్‌గేట్స్ జోస్యం చెప్పారు. రానున్న కాలంలో అనేక సమస్యలను కృత్రిమ మేధ పరిష్కరిస్తుందని, నవకల్పనలకు ఊతమిస్తుందని పేర్కొన్న ఆయన.. ఏఐ కారణంగా భవిష్యత్తులో ఏం జరగొచ్చో కచ్చితంగా చెప్పలేని అనిశ్చితి ఉందని, అదే చాలా భయం కలిగిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇక.. గతంలో ఏ సాంకేతిక పరిజ్ఞానం వల్ల వచ్చిన మార్పులూ చూపనంత ప్రభావాన్ని ఏఐ చూపుతుందని ఒబామా అన్నారు. ఏఐ ఆధారిత ఆటోమేషన్ వేగం పుంజుకుని, అన్ని రంగాల్లోనూ ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని.. దీంతో ప్రజలు తమ జీవనోపాధి గురించి వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఉదాహరణకు.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ మోడళ్లు 60-70% మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కన్నా మిన్నగా కోడింగ్ చేయగలుగుతున్నాయని, త్వరలో వారి పని చాలావరకూ కృత్రిమమేధ పరమవుతుందని ఆయన హెచ్చరించారు. తమ పనితీరును మెరుగుపరచుకోవడానికి ఏఐను వాడే అత్యున్నతస్థాయి నైపుణ్యం కలిగిన వారి ఉద్యోగాలు తప్ప.. మిగతావారి ఉద్యోగాలు పోతాయని పేర్కొన్నారు. మరోవైపు, భారతదేశంలో మధ్యతరగతి వర్గానికి ఇన్నాళ్లుగా వెన్నెముకగా నిలిచిన వైట్ కాలర్ ఉద్యోగాల సంఖ్య భారీగా తగ్గిపోతోందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు. పెరుగుతున్న ఆటోమేషన్, కృత్రిమ మేధ వంటివాటి కారణంగా సంప్రదాయ ఉద్యోగావకాశాలకు క్రమేపీ కోత పడుతోందని 'బియాండ్ పేచెక్: ఇండియాస్ ఆంత్రప్రెనరల్ రీబర్త్' పేరిట నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆయన వ్యాఖ్యానించారు. వైట్ కాలర్ ఉద్యోగాలు ఎక్కువగా ఉండే ఐటీ, మీడియా, ఫైనాన్స్ రంగాల గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. తమ కోడింగ్ అవసరాల్లో 33% మేర కృత్రిమ మేధ తీరుస్తోందన్న గూగుల్ ప్రకటనను ఉటంకించారు. భారతీయ టెక్ కంపెనీల్లోనూ త్వరలో అదే ట్రెండ్ మొదలవుతుందని సౌరభ్ అంచనా వేశారు.

ఇన్‌స్టాలో మైనర్ల ఖాతాలపై ఏఐతో నిఘా

వాషింగ్టన్, ఏప్రిల్ 21: తప్పుడు వయసు చూపి ఇన్‌స్టాగ్రామ్ వాడుతున్న మైనర్ల ఖాతాలను కృత్రిమ మేధను ఉపయోగించి గుర్తించే ప్రయత్నం చేస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటా తెలిపింది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో కొందరు మైనర్లు తమ వయసును ఎక్కువగా చూపుతున్నారని ఇన్‌స్టాగ్రామ్ అనుమానిస్తోంది. అలాంటి అకౌంట్లను గుర్తించడానికి క్రియాశీలకంగా వ్యవహరించాలని ఇన్‌స్టాగ్రామ్ నిర్ణయించింది. అటువంటి అకౌంట్లను గనక తాము గుర్తిస్తే, వాటిని మరిన్ని ఆంక్షలు కలిగిన మైనర్ అకౌంట్లుగా మారుస్తామని తెలిపింది. అకౌంట్ ఎప్పుడు క్రియేట్ చేశారు, అకౌంట్ ప్రొఫైల్, దానికి సంబంధించిన కంటెంట్ ఆధారంగా యూజర్ల వయసును నిర్ధారించే ప్రయత్నం చేస్తున్నామని సంస్థ తెలిపింది.

బంగారం.. లకారం!

రూ.లక్షకు చేరువైన పసిడి ధర.. ఆల్‌టైం రికార్డు గరిష్ఠానికి చేరిక

» అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బలహీన డాలరే ప్రధాన కారణాలు

» ముున్ముందు ధరలు మరింత పైపైకే..!

» ఏడాది చివరి నాటికి భారత్‌లో రూ.1.23 లక్షలకు చేరే చాన్స్



10 గ్రాముల మేలిమి బంగారం రేటు

నగరం	(రూ.)
ఢిల్లీ	99,800
ముంబై	96,670
హైదరాబాద్	98,350

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంట్లో పెళ్లి పెట్టుకున్న వారికి ముచ్చెమటలు పడుతున్నాయి. ఎందుకంటే, బయట ఎండలు.. నగల షాపుల్లో బంగారం భగ్గుమంటున్నాయి. పసిడి ధరలు సోమవారం సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి చేరాయి. 10 గ్రాముల బంగారం లకారాని (రూ.లక్ష)కి చేరువైంది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం మరో రూ.1,650 పెరిగి రూ.99,800కు చేరింది. అంటే, రూ.లక్ష మైలురాయికి కేవలం రూ.200 దూరంలో ఉంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.1,600 పెరుగుదలతో రూ.99,300 పలికింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు తులం బంగారం రూ.20,850 లేదా 26.41 శాతం పెరిగింది. కాగా, పుత్తడితోపాటు వెండి కూడా ఎగబాకుతోంది. కిలో వెండి రూ.500 పెరిగి రూ.98,500 ధర పలికింది. అంతర్జాయ మార్కెట్లో వీటి ధరలు అమాంతం పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని బులియన్ వర్గాలు వెల్లడించాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయంగానూ ఈ విలువైన లోహానికి డిమాండ్ పెంచింది.

గోల్డెన్ ర్యాలీ

ఇంటర్నేషనల్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 3,397.18 డాలర్లకు ఎగబాకింది. గోల్డ్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధరైతే ఏకంగా 80 డాలర్లు (2.4 శాతం) పెరిగి బులియన్ చరిత్రలో తొలిసారిగా 3,400 డాలర్ల మైలురాయిని దాటేసింది. ఔన్స్ సిల్వర్ సైతం 32.85 డాలర్లకు ఎగబాకింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రతరం కావడంతో పాటు డాలర్ బలహీనపడుతుండటం, ఆర్థిక మాంద్యం భయాలు ఈ విలువైన లోహాల ధరలను మరింత ఎగదోశాయి. అంతర్జాతీయ అనిశ్చితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారంలోకి ఇన్వెస్టర్లు పెట్టుబడులను పెద్ద ఎత్తున మళ్లిస్తున్నారు. ఆయా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు సైతం పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటుండటం ఈ గోల్డెన్ ర్యాలీకి మరో కారణం.

పసిడి పరుగు ఎందాకా..?

వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, మాంద్యం, ధరల పెరుగుదల వంటి భయాందోళనల నేపథ్యంలో బంగారం మరింత పెరగనుందని యూబీఎస్, గోల్డ్‌మన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మాక్వెరీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు భావిస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్ల వరకు పెరిగే అవకాశాల్లేకపోలేవని గోల్డ్‌మన్ శాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవేర్ గ్రూప్ అంచనా వేశాయి. అంటే, దేశీయంగా తులం బంగారం రూ.1.23 లక్షలకు చేరే అవకాశం ఉందన్నమాట. అయితే, దీర్ఘకాలికంగా గోల్డ్ బుల్లిష్‌గానే కన్పిస్తున్నప్పటికీ స్వల్ప, మధ్యకాలికంగా భారీ దిద్దుబాటుకు లోనుకావచ్చన్న అంచనాలూ ఉన్నాయి. వినియోగ డిమాండ్‌తో సంబంధం లేకుండా బంగారం ధర ఈ ఏడాదిలో అతివేగంగా పెరుగుతూ వచ్చిందని పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అన్నారు. వచ్చే 6-10 నెలల్లో ఔన్స్ గోల్డ్ ధర మళ్లీ 2,500 డాలర్ల వరకు పడిపోయే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు.

మధ్యతరగతిపై భారం

బంగారం మన ఆచార సంప్రదాయాల్లో భాగం. పండగలు, పెళ్లిళ్ల ఇతర శుభకార్యాలప్పుడు ఎంతో కొంత పసిడి కొనుగోలు చేస్తుంటారు భారతీయులు. గడిచిన ఏడాదిన్నర కాలంలో ధర చాలా వేగంగా పెరుగుతూ వచ్చింది. 2020 నాటి స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపైంది. దాంతో మధ్యతరగతి వారికి బంగారం కొనుగోలు భారంగా మారింది. తక్కువ గ్రాముల్లో కొనుగోలు చేస్తున్నారు. దాంతో తేలికపాటి ఆభరణాలకు గిరాకీ పెరిగిందని వర్తకులంటున్నారు. అలాగే, చాలా మంది కస్టమర్లు 24-22 క్యారెట్లకు బదులు 18, 14 క్యారెట్ గోల్డ్ జువెలరీకి మొగ్గుచూపుతున్నారు. పసిడి కొండెక్కడం చిన్న నగల షాపుల యజమానులకు సంకటంగా మారింది. ధర అనూహ్యంగా పెరగడంతో గిరాకీ బాగా తగ్గిందని, వ్యాపారం 20-25% వరకు తగ్గిందని వారన్నారు. ఇందుకు తోడు బడా జువెలరీ షోరూమ్‌లు కస్టమర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లు ఆఫర్ చేస్తుండటంతో తమ వ్యాపారం మరింతగా దెబ్బతింటోందని వారు వాపోతున్నారు.

పాత బంగారం మార్చుకుంటున్నారు..

ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో చాలా మంది కస్టమర్లు తమ పాత బంగారు ఆభరణాలను కొత్త వాటితో మార్చుకుంటున్నారు. ప్రస్తుత కొనుగోళ్లలో 40-45 శాతం పాత బంగారం మార్పిడి ద్వారానే జరుగుతున్నాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంటోంది.

2000-2025 మధ్యకాలంలో బంగారం ధరలు

సంవత్సరం	(రూ.)
2025	99,800
2024	78,245
2023	63,203
2022	55,017
2021	48,099
2020	50,151
2015	24,931
2010	20,728
2005	7,638
2000	4,400

భారత మహిళల వద్ద 249.50 లక్షల కోట్ల పసిడి

ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) డేటా ప్రకారం భారత నారీమణులు దాదాపు 25,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉన్నారు. ప్రస్తుత ధర ప్రకారం..ఆ బంగారం మొత్తం విలువ రూ.249.50 లక్షల కోట్లు. ప్రపంచవ్యాప్త స్వర్ణాభరణాల్లో 11% భారతీయ మహిళల వద్దే ఉన్నాయి. అంతే కాదు, మన మహిళల వద్ద ఉన్న బంగారం ఐదు అతిపెద్ద దేశాల వద్దనున్న మొత్తం నిల్వల కంటే అధికం. అగ్రరాజ్యం అమెరికా 8,000 టన్నులు, జర్మనీ 3,000 టన్నులు, ఇటలీ 2,450 టన్నులు, ఫ్రాన్స్ 2,400 టన్నులు, రష్యా 1,900 టన్నుల బంగారం నిల్వలను కలిగి ఉన్నాయి. భారత మహిళల్లో దక్షిణాది వారికి పసిడిపై అధిక ప్రీతి. దేశీయ స్వర్ణాభరణ నిల్వల్లో 40% దక్షిణాది మహిళలవే. తమిళనాడు వారి వాటా 28%. మన చట్టం ప్రకారం.. పెళ్లయిన ఆడవారు ఎలాంటి పన్ను చెల్లించనవసరం లేకుండా 500 గ్రాముల వరకు బంగారం కలిగి ఉండవచ్చు. పెళ్లి కానివారు 250 గ్రాములు, మగవారు 100 గ్రాముల వరకు పసిడిని కలిగి ఉండవచ్చు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు బదిలీ

» తెలంగాణ నుంచి ఇద్దరు బదిలీ

» ఏడుగురు జడ్జిల బదిలీలకు సుప్రీం ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 15 నుంచి 19 వరకు జరిగిన సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. బదిలీ అయిన వారిలో కర్ణాటక హైకోర్టుకు చెందిన నలుగురు, తెలంగాణ హైకోర్టు నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒకరు ఉన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పెరుగు శ్రీసుధను కర్ణాటకకు, జస్టిస్ కాసోజు సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది. కర్ణాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ కృష్ణన్ నటరాజన్‌ను కేరళ హైకోర్టుకు, జస్టిస్ నెరనహళ్లి శ్రీనివాసన్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

500 నోట్లతో జాగ్రత్త!

» స్పెల్లింగ్ దోషంతో మార్కెట్లోకి నకిలీ నోట్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: అత్యాధునిక టెక్నాలజీ వినియోగించి నేర ముఠాలు తయారు చేసిన నకిలీ 500 రూపాయల నోట్లు మార్కెట్లోకి వచ్చాయని కేంద్ర హోం శాఖ హెచ్చరించింది. దాదాపుగా అసలు నోట్లను పోలి ఉన్న నకిలీ నోట్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నాణ్యత, ముద్రణపరంగా ఒరిజనల్ నోట్లను పోలి ఉన్నాయని, చాలా పరీక్షగా గమనిస్తే తప్ప తేడా తెలియని విధంగా నకిలీ నోట్లు ఉన్నాయని పేర్కొంది. అసలు నోట్లకు, నకిలీ నోట్లకు మధ్య చిన్న స్పెల్లింగ్ దోషం మాత్రమే తేడా ఉందని, నకిలీ నోట్లను గుర్తించడంలో ఇదే కీలకమని వెల్లడించింది. కరెన్సీ నోట్లపై RESERVE BANK OF INDIA అని ఉంటుందని, అయితే నకిలీ 500 రూపాయల నోట్లపై RESERVE అనే పదంలో E కి బదులుగా A అని ఉంటుందని.. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ స్పష్టంగా పరిశీలించాలని అప్రమత్తం చేసింది. ఈ సూక్ష్మమైన తేడాను నిశితంగా పరిశీలించకపోతే నకిలీ నోట్లను గుర్తించడం కష్టమని, ఇవి అత్యంత ప్రమాదకరమైనవని ఓ సీనియర్ అధికారి అన్నారు. నకిలీ నోట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, సంబంధిత సంస్థలను అలర్ట్ చేసినట్టు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఇప్పటికే పెద్ద మొత్తంలో మార్కెట్‌లోకి వచ్చి ఉండొచ్చని పేర్కొంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

సంగీత మహోత్సవం



మధుర గాయని కె.ఎస్.చిత్ర తన 45 ఏళ్ల సినీ సంగీత పయనంలో ఎన్నో అద్భుత గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా జూన్ 14న 'చిత్రామృతం 2.0' పేరుతో సంగీత మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గాయకుడు, నటుడు ఎస్.పి. చరణ్, గీత రచయిత చంద్రబోస్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ 'కాలాన్ని దాటి మనసుల్ని తాకే శక్తి చిత్రగారి గానానికి ఉంది. మా నాన్న బాలుగారితో కలసి పాడిన ఎన్నో అద్భుత గీతాలు మరచిపోలేని జ్ఞాపకాలు' అని చెప్పారు. చంద్రబోస్ మాట్లాడుతూ 'నేను రాసిన ఎన్నో పాటలకు చిత్రగారు ప్రాణం పోశారు. పాటల మాటలకు జీవం పోసే మధురమైన గొంతు ఆవిడది' అన్నారు. జూన్ 14న 'చిత్రామృతం 2.0' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఎక్కడ నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు చెప్పారు.

అందుకే ఆ పోస్ట్‌కు లైక్ కొట్టిందా!



సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే తారల్లో సమంత ఒకరు. ఆరోగ్యం, వ్యక్తిత్వం, మహిళా సాధికారత, వర్క్‌లైఫ్ తదితర విషయాలను తరచూ ఇన్‌స్టా పోస్టు లేదా స్టోరీస్ ద్వారా షేర్ చేస్తుంటారు ఆమె. తాజాగా, ఓ ఇన్‌స్టా పేజీలోని పోస్టును ఆమె లైక్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఓ సర్వే ఆధారంగా భార్యభర్తల మధ్యనున్న అనుబంధాన్ని తెలిపే పోస్ట్ అది. 'జీవిత భాగ్యస్వామి అనారోగ్యానికి గురైతే భర్త ఆమెను వదిలేయడానికి సిద్ధపడుతున్నాడు. కానీ, భార్య అలా కాదు. భర్తకు ఎలాంటి అనారోగ్యం ఉన్నా, అతన్ని వదులుకోవడానికి ఇష్టపడదు. భార్యతో ఎమోషనల్ అటాచ్‌మెంట్ లేకపోవడం వల్లే భర్త ఇలాంటి నిర్ణయం తీసుకుంటున్నాడు' అన్నది ఆ పోస్ట్ సారాంశం. ఇది చూసిన నెటిజన్లు ఆమె వ్యక్తిగత జీవితంతో ఈ పోస్టుకు ముడిపెడుతున్నారు. కాగా, నిర్మాతగా సమంత రూపొందించిన తొలి చిత్రం 'శుభం' మే 9న విడుదల కానుంది.

అందరినీ హాయిగా నవ్విస్తుంది



- శివలెంక కృష్ణప్రసాద్

"జెంటిల్‌మెన్, 'సమ్మోహనం' తర్వాత ఇంద్రగంటి మోహన కృష్ణ- నా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్ రాబోతోంది. మోహన్‌కృష్ణ కథ, కథనం అందరినీ ఆకట్టుకుంటాయి. సినిమా హాయిగా నవ్విస్తుంది' అని అన్నారు నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో 'సారంగపాణి జాతకం' సినిమాను శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ప్రియదర్శి అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో అందరినీ నవ్విస్తారు. పూర్తి వినోదాన్ని అందిస్తూ పైసా వసూల్ అని అనిపించేలా సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. జంధ్యాల, ఈవీవీ స్టయిల్‌తో ఇంద్రగంటి మార్క్‌ను మేళవించి ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని రూపొందించాం. ఏప్రిల్ 18న థియేటర్లు దొరక్కపోవడంతో విడుదల తేదీని ఏప్రిల్ 25కి మార్చాం. దేశవ్యాప్తంగా భారీ ఎత్తున, ఓవర్సీస్‌లో 220కి పైగా థియేటర్లలో విడుదల చేస్తున్నాం' అని చెప్పారు.

నన్నే టార్గెట్ చేస్తున్నారు



షైన్ టామ్‌చాకో

'నేనొక్కడినే డ్రగ్స్ తీసుకోవట్లేదు. నాతో పాటు చాలా మంది ఇండస్ట్రీలో ఆ పని చేస్తున్నారు. కానీ, నన్ను, మరో నటుడ్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు' అని మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో వాపోయారు. డ్రగ్స్ వాడాడన్న ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఇటీవలె ఆయనను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన పోలీసు విచారణలో భాగంగా ఆయన పలు విషయాలు వెల్లడించారు. 'నేను ఆ రోజు హోటల్‌కు తెలిసిన అమ్మాయిని కలవడానికి వెళ్లాను. నేను పోలీసులు నుంచి తప్పించుకొని పారిపోవడానికి భవంతి దూకి వెళ్లలేదు. నాకు ఓ చిత్రబృందంతో గొడవ జరిగింది. ఆ కారణంగానే భయంతో అలా పారిపోవాల్సి వచ్చింది. నేను నటి విన్సీసోనీతో అసభ్యంగా ప్రవర్తించలేదు. డ్రగ్స్‌ను కొందరు మధ్యవర్తులు అమ్మేవారు. వారే సెట్స్‌కు కూడా తెచ్చి ఇచ్చేవారు" అని పేర్కొన్నారు. ఈ విచారణలో భాగంగా ఆయన ఫోన్‌లోని బ్యాంక్ లావాదేవీలను తనిఖీ చేశారు పోలీసులు. అందులో ఆయన 14మందికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు గుర్తించారు. దీని గురించి ఆయనను ప్రశ్నించగా, అప్పుగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం బెయిలుపై ఉన్న ఆయనను త్వరలోనే పోలీసులు మరోసారి విచారించనున్నారు. ఇదిలా ఉంటే నటి విన్సీసోనీ అలోషియస్ ఇటీవలె షైన్ టామ్‌చాకో పేరు ప్రస్తావించకుండా ఓ నటుడు లైంగిక వేధింపులు చేశాడంటూ ఆరోపిస్తూ కేరళ ఫిల్మ్‌ఛాంబర్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ విషయంపై ఆమె మీడియాతో మాట్లాడారు. 'నేను ఫిల్మ్ ఛాంబర్‌లో చేసిన ఫిర్యాదులో ఆ వ్యక్తి పేరు బహిర్గతం చేయొద్దని అధికారులను కోరాను. నేను ఆయనపై చట్టపరంగా ఎలాంటి యాక్షన్ తీసుకోవాలనుకోవట్లేదు. ఇది ఇండస్ట్రీలో ఉత్పన్నమైన సమస్య. దీనికి ఇండస్ట్రీలోనే పరిష్కారం దొరకాలి. మలయాళ చిత్ర పరిశ్రమలో నేను మార్పుని చూడాలనుకుంటున్నాను. అందుకే ఫిర్యాదు చేశా. నేను చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలనుకోవడం లేదు" అని పేర్కొన్నారు.

అందరినీ మెప్పిస్తుంది



జేపీ నవీన్, శ్రావణి శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఏ.ఎల్.సి.సి' (ఓ యూనివర్సల్ బ్యాచిలర్). లేలేధర్‌రావు కోలా స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ నెల 25న సినిమాను విడుదల చేస్తున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు లేలేధర్‌రావు మాట్లాడుతూ "సినిమా అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుంది. చిత్రం కోసం టీమ్ ప్రాణం పెట్టి పనిచేసింది" అని అన్నారు. "ఈ సినిమాకు కథ, విజువల్స్, సంగీతం ప్రధానాకర్షణ" అని హీరో జేపీ నవీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సముద్ర, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సహనటితో హాలీవుడ్ హీరోయిన్ పెళ్లి



స్క్రీన్‌ప్లే రచయిత్రి, నటి డైలాన్ మేయర్‌తో ఆరేళ్లుగా రిలేషన్‌లో ఉన్న అమెరికన్ హీరోయిన్, 'ట్విలైట్' ఫేమ్ క్రిస్టిన్ స్టీవార్ట్ ఆదివారం నాడు ఆమెను పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరి వివాహానికి సమ్మతిస్తూ అక్కడి ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ చేతికందాక వీరి వివాహం జరగడం గమనార్హం. లాస్ ఏంజెల్స్‌లో వీరిద్దరూ ఉంటున్న ఇంట్లోనే జరిగిన ఈ వివాహానికి అతికొద్ది మంది మాత్రమే హాజరయ్యారు. స్టీవర్ట్‌కు ఇది రెండో వివాహం. అంతకుముందే ఇద్దరితో డేటింగ్ చేసిన ఈ అమెరికన్ నటి 2012లో తనకంటే 19 ఏళ్లు పెద్దవాడైన దర్శకుడు రూబర్ట్ శాండర్స్‌ను పెళ్లి చేసుకున్నారు. అయితే ఏడాది కాలంలోనే వీరిద్దరూ విడిపోయారు. 2019లో డైలాన్ మేయర్ పరిచయం కావడం, ప్రేమలో పడడం జరిగాయి. 2021లో వీరి ఎంగేజ్‌మెంట్ జరిగినా, ప్రభుత్వపరమైన అనుమతి రాకపోవడంతో పెళ్లి ఆలస్యమైంది.

విభిన్న తరహా ప్రేమకథ



రవిప్రకాశ్ రెడ్డి, సమీర్ దత్త, రమ్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '6 జర్నీ'. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవిప్రకాశ్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు బసీర్ మాట్లాడుతూ "సినిమా తప్పకుండా అందర్నీ మెప్పిస్తుంది" అని అన్నారు. "ఇదో విభిన్న తరహా ప్రేమకథ గల చిత్రం" అని హీరో సమీర్ దత్త చెప్పారు.

సరికొత్త ప్రేమ కథ



బిగ్ బాస్ ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, సైలీ చౌదరి హీరోయిన్‌గా నూతన దర్శకుడు ఎం.ఎం.నాయుడు తెరకెక్కిస్తోన్న సినిమా 'సుమతీ శతకం' సోమవారం అమరావతిలో ప్రారంభమైంది. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మిస్తున్నారు. ముహూర్తం షాట్‌కు పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్లాప్ కొట్టగా, వెన్నా సాంబశివారెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి బండారు నాయుడు కథను అందించగా, సుభాష్ ఆనంద్ సంగీతం సమకూర్చుతున్నారు.

రాజ్ కసిరెడ్డి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు వాయిదా వేసింది. ఆయనకు తక్షణ ఉపశమనం లభించలేదు. దీంతో... ఆయన వ్యూహాత్మకంగా ఒక ఆడియో రిలీజ్ చేశారు. "మంగళవారం సిట్ ముందు విచారణకు హాజరవుతాను" అని అందులో తెలిపారు. అయినా సరే... పోలీసులు గోవాకు బయలుదేరారు. అక్కడ... రాజ్ కసిరెడ్డి ఫోన్ చివరి లొకేషన్ వద్దకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన గోవా నుంచి హైదరాబాద్‌కు చెక్కేసినట్లు గుర్తించారు.

పేరు మార్చి... ఏమార్చాలని..

రాజ్ కసిరెడ్డి పోలీసులను ఏమార్చేందుకు మరో ఎత్తు వేశారు. 'రాజేశ్ రెడ్డి' పేరుతో నకిలీ ఐడీతో గోవా నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్‌కు చేరుకున్నారు. ఈ విషయాన్ని కూడా పోలీసులు గుర్తించారు. రాజ్ కసిరెడ్డి హైదరాబాద్‌లో దిగగానే అదుపులోకి తీసుకునేందుకు 'సిట్'కు చెందిన మరో బృందం సిద్ధమైంది. సోమవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయం 'అరైవల్' గేట్ ముందు అధికారులు వేచి చూస్తున్నారు. అయితే... రాజ్ కసిరెడ్డి పథకం వేరు. ఆయన.. హైదరాబాద్ నుంచి చెన్నైకి మరో టికెట్ బుక్ చేసుకున్నారు. బహుశా... చెన్నై నుంచి విదేశాలకు చెక్కేయాలన్నది ఆయన ఆలోచనగా తెలుస్తోంది. రాజ్ ఎంతకీ బయటికి రాకపోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయం పోలీసులు, అధికారుల సహకారంతో తామే లోపలికి వెళ్లారు. అక్కడ రాజ్ కసిరెడ్డిని గుర్తించిన తక్షణం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మరో హైడ్రామాకు తెరలేపారు. "రేపు (మంగళవారం) విజయవాడలో విచారణకు హాజరవుతాను. నన్ను వదిలేయండి" అని పదేపదే కోరారు. పోలీసులు ఆయన మాటల్ని వినిపించుకోలేదు. "నాలుగు సార్లు నోటీసులిచ్చినా రాలేదు. ఇప్పుడుమాత్రం వస్తావని నమ్మేదెలా!? మాతోపాటు ఇప్పుడే రావాల్సిందే" అని స్పష్టం చేశారు. రాజ్ కసిరెడ్డిని అరెస్టు చేస్తున్నట్లు ఆయన తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు.


రాజ్ కసిరెడ్డిని అరెస్టు చేసి విజయవాడలోని సిట్ కార్యాలయానికి తీసుకొచ్చిన పోలీసులు

సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఆయనను విజయవాడలోని 'సిట్' కార్యాలయానికి తీసుకొచ్చారు. మంగళవారం సీఐడీ కోర్టులో హాజరు పరచనున్నారు.

సూత్రధారి ఆయనే...

మద్యం కుంభకోణంపై దర్యాప్తు చేపట్టిన 'సిట్'... ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో మొదలుకుని... ఎంపీ మిథున్ రెడ్డి వరకు అనేకమందిని ప్రశ్నించింది. మద్యం వ్యాపారులనూ విచారించింది. టెక్నాలజీని ఉపయోగించి కీలక ఆధారాలు సేకరించింది. జగన్ హయాంలో మద్యం పాలసీ రూపకల్పన నుంచి దాని అమలు, జే-బ్రాండ్లను ప్రవేశపెట్టడం, కమీషన్ల వసూలు చేయడం, ఆ మొత్తాన్ని చేరాల్సిన చోటికి చేర్చడం... ఇలా ఏడంచెల్లో సాగిన కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి కీలక పాత్ర పోషించినట్లు గుర్తించింది. పేరుకు జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారు పదవి! కానీ... చేసిందంతా 'లిక్కర్' లెక్కలే! రాజ్ కసిరెడ్డిని పిలిచి ప్రశ్నించేందుకు పోలీసులు ఎంతగా ప్రయత్నించినా ఆయన సహకరించలేదు. మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఇంటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 'సిట్' అధికారులు 15 బృందాలుగా ఏర్పడి... హైదరాబాద్‌లోని ఆయన నివాసం, వ్యాపార కార్యాలయాలు, కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీల్లో రెండు రోజులపాటు సోదాలు జరిపారు. కీలక డాక్యుమెంట్లు సీజ్ చేశారు. ఆర్థిక మూలాల్ని స్తంభింపజేశారు. లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్ఓసీ) కూడా జారీ చేశారు. ఆయన తండ్రి ఉపేందర్ రెడ్డిని విచారణకు పిలిచి గౌరవంగా మాట్లాడారు. 'మీ కుమారుడు విచారణకు వచ్చి మాకు సహకరించక పోతే చట్ట పరంగా చేయాల్సినంత చేస్తాం' అని స్పష్టం చేశారు. చివరికి... సోమవారం రాజ్ కసిరెడ్డి కలుగులో నుంచి బయటికి రావడం, పోలీసులు పట్టేసుకోవడం జరిగిపోయింది. ఆయనను కస్టడీలోకి తీసుకుని... మద్యం స్కామ్ నుంచి లబ్ధి పొందిన 'అసలు బాస్'లు ఎవరు, ఎన్ని వేల కోట్లు వెనకేసుకున్నారు... ఆ డబ్బు ఎలా చేతులు మారింది... అనే వివరాలను రాబట్టే అవకాశముంది.

రాజ్ కసిరెడ్డికి దొరకని ఊరట

- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా
- కేసు వివరాలు ఇవ్వాలని సీఐడీకి ఆదేశాలు
- ఇంటి వద్దే విచారించేలా ఆదేశాలివ్వండి
- మరో పిటిషన్‌లో రాజ్ కసిరెడ్డి తల్లిదండ్రుల వినతి

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరిన రాజ్ కసిరెడ్డికి హైకోర్టులో ఊరట లభించలేదు. ఆయన పిటిషన్‌పై విచారణను వారం రోజులు వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చిన అనంతరం ఆన్‌లైన్ ద్వారా విచారణకు కసిరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే హాజరయ్యారు. మధ్యంతర ముందస్తు బెయిల్ కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామని, అత్యవసరంగా దానిపై విచారణ జరపాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ...ఇప్పటికే పిటిషన్‌ను వాయిదావేశామని తెలిపారు. మంగళవారం కోర్టు విచారణ ప్రారంభ సమయంలో అభ్యర్థనను తమ ముందు ఉంచాలని సూచించారు. కాగా, మద్యం కుంభకోణం కేసులో తమను విచారించాలని భావిస్తే హైదరాబాద్‌లోని తమ నివాసంలో లేదా ఏదైనా తటస్థ ప్రదేశంలో అడ్వకేట్ సమక్షంలో విచారణ చేసేలా సిట్ దర్యాప్తు అధికారిని ఆదేశించాలంటూ రాజ్ కసిరెడ్డి తల్లిదండ్రులు ఉపేందర్‌రెడ్డి, సుభాషిని హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. బీఎన్ఎస్ఎస్ చట్టనిబంధనలు అనుసరించేలా పోలీసులకు సూచించాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యాన్ని న్యాయస్థానం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు. "దర్యాప్తు అధికారి ఇచ్చిన నోటీసులను అనుసరించి పిటిషనర్లు విజయవాడలోని సిట్ ముందు హాజరయ్యారు. విచారణ సందర్భంగా అధికారులు పిటిషనర్ ఉపేందర్‌రెడ్డిని దూషించారు. పిటిషనర్లు ఇద్దరూ 60ఏళ్లకు పైబడి వయసు ఉన్నవారే. బీఎన్ఎస్ఎస్ చట్టనిబంధనలు ప్రకారం వారిని ఇంటి వద్దే విచారించాల్సి ఉంటుంది." అని వాదించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ....బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 179 మేరకు పిటిషనర్లను వారి ఇంటి వద్ద విచారించేందుకు అభ్యంతరం లేదన్నారు. విచారణ సందర్భంగా దూషణలకు పాల్పడ్డారని పోలీసు అధికారులపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అధికారులను ప్రతివాదులుగా చేర్చడంపై అభ్యంతరం తెలిపారు. అధికారులపై చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్... పిటిషనర్లను అడ్వకేట్ సమక్షంలో వారి ఇంటి వద్దే విచారించాలని సిట్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని స్పష్టంచేశారు. అధికారులపై పిటిషనర్లు చేసిన ఆరోపణలకు కౌంటర్ వేసేందుకు ప్రాసిక్యూషన్‌కు అనుమతిచ్చారు. విచారణను మే ఐదోతేదీకి వాయిదా వేశారు.

గోరంట్ల మాధవ్‌కు 2 రోజుల పోలీసు కస్టడీ

- రేపు, ఎల్లుండి విచారణకు కోర్టు ఆదేశాలు

గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు రెండ్రోజులు పోలీసు కస్టడీకి అనుమతించింది. ప్రస్తుతం జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆయన్ను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన మేజిస్ట్రేట్ జి.స్రవంతి.. బుధ, గురువారాల్లో (ఈ నెల 23, 24 తేదీల్లో) రెండ్రోజులు కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గోరంట్ల మాధవ్ ఇటీవల గుంటూరులో పోలీసు కస్టడీలో ఉన్న టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసుల పైనా దాడి చేశారు. అంతేకాకుండా పోలీసు వాహనాలను వెంబడించి.. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ పోలీసులపై దౌర్జన్యం చేశారు. దీనిపై పోలీసు సిబ్బంది ఇచ్చిన



ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మాధవ్‌తో పాటు ఆయన అనుచరులైన అనంతపురం జిల్లాకు చెందిన చిగండి రమేశ్, తాళ్ల దామోదర్, దిగివెంటి శివ ప్రసాద్, చిదగొండ్ల శివయ్య, గొండ్ల సురేందర్ తదితరులను అరెస్టు చేసి ఈ నెల 11న కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

చట్టానికి లోబడే దర్యాప్తు జరగాలి

- 60 ఏళ్లు పైబడినవారిని ఇంటి వద్ద విచారించాలి
- ఉల్లంఘనపై వివరణ ఇవ్వండి
- సిట్ అదనపు ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తు చట్టనిబంధనలకు లోబడే జరగాలని హైకోర్టు స్పష్టం చేసింది. బీఎన్ఎస్ఎస్ చట్టం సెక్షన్ 179 ప్రకారం 60ఏళ్లు పైబడిన, అనారోగ్య సమస్యలతో బాధపడే సాక్షులు, నిందితుల వాంగ్మూలాలను వారి ఇంటి వద్దే రికార్డు చేయాలని స్పష్టంగా ఉందని గుర్తు చేసింది. తిరుపతికి చెందిన విశ్రాంత పోలీసు అధికారి టి.బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని నిర్బంధించి విజయవాడకు తరలించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆయన వయసు 60 ఏళ్లకుపైబడి ఉందని తెలిపింది. 'ఆయనపై ఉన్న కేసు ఏంటి.. ఏ కేసులో సాక్షిగా పిలిచారు? కేసులో కుమారుడు నిందితుడిగా ఉంటే.. విచారణకు రావాలని తండ్రికి నోటీసులు ఎలా ఇస్తారు? పోలీసు శాఖలో పనిచేసి పదవీవిరమణ చేసిన అధికారితో ప్రవర్తించేది ఇలాగేనా' అని ప్రశ్నించింది. కేసుల దర్యాప్తు నిలిపివేయాలని తాము చెప్పడం లేదని, అదే సమయంలో వ్యక్తుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపింది. ఏ చట్టనిబంధనలను అనుసరించి సిట్ ముందు హాజరుకావాలని ఆయనకు నోటీసులిచ్చారని దర్యాప్తు అధికారి అయిన సిట్ అదనపు ఎస్పీని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆయన్ను ఆదేశిస్తూ కేసులో సుమోటో ప్రతివాదిగా చేర్చింది. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు హాజరుకావాలని సుబ్రహ్మణ్యంరెడ్డికి ఎలాంటి నోటీసులూ జారీ చేయవద్దని స్పష్టం చేసింది. ఆయన వాంగ్మూలం అవసరమని భావిస్తే ఆయన నివాసంలోనే రికార్డు చేయాలని, ఆ సమయంలో దర్యాప్తు అధికారి మినహా ఇతర పోలీసు అధికారులు ఉండడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కోర్టు అనుమతి లేకుండా సుబ్రహ్మణ్యంరెడ్డి ఇంటిని పోలీసులు సందర్శించడానికి వీల్లేదని పేర్కొంది. విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని ఈ నెల 16న రాత్రి 11.50 గంటలకు తిరుపతిలోని ఆయన ఇంటి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని, ఆయన ఆచూకీ తెలుసుకొని కోర్టు ముందు హాజరు పరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఆయన బంధువు మేకా వెంకటరామిరెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటి



షన్ వేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. అక్రమ నిర్బంధం ఆరోపణలపై వాస్తవాలు తేల్చేందుకు తమ ముందు హాజరుకావాలని బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని ఆదేశించింది. ఆయన సోమవారం నేరుగా కోర్టు ముందు హాజరయ్యారు. ఓ కేసులో నిందితుడిగా ఉన్న తన కుమారుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్ రెడ్డికి నోటీసు ఇచ్చేందుకు పోలీసులు వచ్చారని.. కుమారుడు తమతో ఉండడం లేదని వారికి చెప్పానని తెలిపారు. తనను నిర్బంధించి పోలీసు వాహనంలో విజయవాడ తరలించారని.. సిట్ బృందంలోని ఓ డీఎస్పీ తనను దూషించారని కన్నీరు పెట్టుకున్నారు. 17న వాం గ్మూలం నమోదు చేశాక తను పంపించి వేశారన్నారు. ఎప్పుడు ఎవరు వచ్చి అరెస్టు చేస్తారో అని భయంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ.. బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని విచారణకు పిలిచి వాంగ్మూలం నమోదు చేశామన్నారు. ప్రస్తుతం ఆయన స్వేచ్ఛగా ఉన్నారని.. మరోసారి విచారణకు పిలువబోమని, పిలవాలనుకుంటే చట్టనిబంధనలు అనుసరిస్తామని తెలిపారు. పిటిషనర్ చేసిన ఆరోపణలను అఫిడవిట్ రూ^ంలో సమర్పిస్తే కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

కాకాణికి లభించని ఊరట

- అరెస్టు నుంచి రక్షణకు హైకోర్టు నిరాకరణ
- ఎస్సీ, ఎస్టీ కేసుల్లో ముందస్తు బెయిల్
- విచారణ పరిధి తేల్చే వ్యవహారం ధర్మాసనానికి
- ఫైలు సీజే ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశం




అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ చట్ట నిబంధనలకు అనుగుణంగా నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ పరిధిని తేల్చే వ్యవహారాన్ని ధర్మాసనానికి అప్పగిస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు సోమవారం కీలక ఉత్తర్వులు ఇచ్చారు. బెంచ్ ఏర్పాటుపై తగిన నిర్ణయం తీసుకునేందుకు ఫైలును ప్రధాన న్యాయమూర్తి (సీజే) ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న కాకాణి తరఫు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చారు. విచారణ పరిధి తేల్చే వ్యవహారాన్ని ధర్మాసనానికి అప్పగించాక ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేనని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వరదాపురం గ్రామపరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజాన్ని తవ్వి తరలించారని జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ కాకాణి పిటిషన్ వేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం టీడీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్ఎస్ సెక్షన్ల కింద పెట్టిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ విడదల రజని పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కేసులలో మందస్తు బెయిల్ కోరుతూ మరి కొందరు పిటిషన్లు వేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనల కింద కేసులు నమోదైనప్పుడు ముందస్తు బెయిల్ కోసం ముందుగా సంబంధిత ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించాలని హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. అయితే నేరుగా హైకోర్టును ఆశ్రయించవచ్చంటూ కాకాణి, రజని, మరికొందరు పిటిషనర్లు వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి తీర్పు రిజర్వ్ చేశారు. తాజాగా ఈ అంశాన్ని ధర్మాసనానికి అప్పగించారు.

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసును పునర్విచారించాలి

- ఇంత లోపభూయిష్టమైన దర్యాప్తును నా ఉద్యోగ జీవితంలో చూడలేదు
- అనంతబాబును కాపాడేందుకు అన్ని వ్యవస్థలూ అడ్డదారులు తొక్కాయి
- పోలీసులను మేనేజ్ చేసింది నాటి ఎమ్మెల్యే ద్వారంపూడి
- కాకినాడలో జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఏబీవీ
- జి.మామిడాడలో బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


కాకినాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసును పునర్విచారించాలని విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.మామిడాడలోని సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారిని వెంటపెట్టుకుని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్


విలేకరులతో మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు. చిత్రంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

మోహన్‌ను, జిల్లా ఎస్పీ బింధుమాధవ్‌ను కలిశారు. అనంతరం ఏబీవీ మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులో జరిగినంత లోపభూయిష్టమైన దర్యాప్తును నా ఉద్యోగ జీవితంలో ఎప్పుడూ చూడలేదు. 2022 మే 20న జరిగిన ఈ హత్య కేసును అప్పటి జగన్ సర్కారు నీరుగార్చింది. అత్యంత నీచమైన, అమానవీయమైన ఈ కేసులో ముఖ్యమైన నిందితుడిగా ఉన్న అనంతబాబును కాపాడేందుకు నాడు ప్రభుత్వంలో ఉన్న అన్ని వ్యవస్థలూ ఎన్నో అడ్డదారులు తొక్కాయి. వారు వేసిన కాగితాలు, రాసిన పంచనామాలు చూస్తే ట్రైనింగ్‌లో ఉన్న పోలీసు అధికారికైనా అది తెలిసిపోతుంది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో పోలీసు వ్యవస్థ మొత్తాన్ని మేనేజ్ చేసింది ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, అనుచరులు, నాయకులే. ఆయన, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు, వ్యాపార భాగస్వాములు చేస్తున్న బియ్యం దోపిడీ కేసులో ఇంతవరకు పురోగతి కనిపించడం లేదు. ఆ కేసును కూడా త్వరితగతిన విచారించాలి. సాక్ష్యాలను సేకరించి, రాత్రికి రాత్రి కోటీశ్వరులుగా మారిన వారి నుంచి డబ్బంతా రాబట్టాలి. సుబ్రహ్మణ్యం కుటుంబానికి చట్ట ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి అందాల్సిన పింఛన్ సొమ్ము త్వరితగతిన అందేలా చూడాలని, హతుడు తమ్ముడికి ఉద్యోగం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరాం' అని ఏబీవీ తెలిపారు.

వంశీ బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- తీర్పు 24వ తేదీకి వాయిదా



విజయవాడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విజయవాడ జిల్లా జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు సోమవారం ముగిశాయి. ఈ కేసులో వంశీ తొలిసారి వేసిన బెయిల్ పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ న్యాయస్థానం కొట్టేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన రెండోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున డిప్యూటీ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ వాదించారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తికాలేదని, నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని కోర్టును అభ్యర్థించారు. వంశీ జైలు నుంచి బయటికి వస్తే బాధితుడు సత్యవర్ధన్‌కు ప్రాణహాని ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వంశీ తరఫున డాక్టర్ వి.దేవీసత్యశ్రీ వాదనలు వినిపిస్తూ.. బాధితుడు సత్యవర్ధన్‌కు పోలీసులు అన్ని రకాల రక్షణ చర్యలు కల్పిస్తున్నారని, కనుక ఆయనకు ఎలాంటి ప్రాణహాని కలిగే అవకాశం లేదని విన్నవించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 60 రోజుల్లో చార్జిషీటు దాఖలు చేయాల్సి ఉందని, కేసు నమోదు చేసి ఇప్పటికి 70 రోజులైందని వివరించారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని వంశీకి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పును ఈ నెల 24వ తేదీకి వాయిదా చేశారు. కాగా, సత్యవర్ధన్ కేసులో ఏ7గా ఉన్న వెలినేని శివరామకృష్ణ ప్రసాద్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తీర్పును అదేరోజు వెల్లడిస్తామని న్యాయాధికారి పేర్కొన్నారు.

ముగిసిన మంత్రి నారాయణ గుజరాత్ పర్యటన


అహ్మదాబాద్‌లో కేవలం తొమ్మిది నెలల్లో నిర్మించిన స్టేడియంను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారాయణ బృందం రెండు రోజుల గుజరాత్ పర్యటన ముగిసింది. రెండో రోజు గుజరాత్‌లో పర్యటించిన ఆయన ఉదయం గ్యాస్పూర్‌లో జిందాల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ఘన వ్యర్థాల నుంచి విద్యుత్, పేవర్ బ్లాక్స్ తయారుచేసే విధానాన్ని మంత్రి, అధికారులు పరిశీలించారు. ప్రతి రోజూ పెద్దఎత్తున వస్తున్న ఘనవ్యర్థాలను డీకంపోజ్ చేసే విధానాన్ని అధికారులు వివరించారు. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంను మంత్రి నారాయణ పరిశీలించారు. కేవలం 9 నెలల్లోనే స్టేడియంను నిర్మించిన విధానాన్ని గుజరాత్ క్రీడల శాఖ అధికారులు వివరించారు. అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం భారీ క్రికెట్ స్టేడియంను నిర్మించనుంది. అహ్మదాబాద్ పర్యటన తర్వాత విజయవాడకు మంత్రి నారాయణ, అధికారులు బయలుదేరి వచ్చారు.

సాగు పనిముట్ల పంపిణీలో తీవ్ర జాప్యం

- పథకం అమలులో వెనుకబడ్డ 22 జిల్లాలు
- అధికారులపై అగ్రి డైరెక్టర్ డిల్లీరావు ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్లు రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. 40-50 శాతం రాయితీపై రైతులకు అందించాలని సీఎం చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు నిర్దేశించారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు ఈ పథకం అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దరఖాస్తు చేసిన రైతులకు పరికరాలు అందించడంలో తాత్సారం చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 42వేల వ్యక్తిగత పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీటి కోసం గత నెలాఖరు వరకు దాదాపు 20వేల మంది రైతుల దరఖాస్తు చేశారు. అందులో 13వేల మంది రైతులు తమ వాటా సొమ్మును చెల్లించారు. ఇంత వరకు సబ్సిడీ కింద ప్రభుత్వం రూ.28 కోట్లు విడుదల చేసింది. వీరందరికీ పరికరాలు అందాల్సి ఉండగా, ఇప్పటి వరకు సగం మందికి కూడా అందించలేదు. అల్లూరి, కాకినాడ, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాలు మాత్రమే రాష్ట్రసరాసరి 54%లక్ష్యం దాటాయి. మిగతా 22 జిల్లాలు లక్ష్యసాధనలో పూర్తిగా వెనుకబడ్డాయి. దీనిపై వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు సోమవారం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అసహనం వ్యక్తం చేశారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు కూడా వెనుకబడటంపై అధికారులను ఆయన వివరణ కోరారు. లోపం ఏస్థాయిలో ఉందో గుర్తించాలని, పాలనాపరమైన ఇబ్బందులేమిటో వ్యవసాయ, ఆగ్రోస్ అధికారులు లోతుగా విశ్లేషించి, రైతులకు సత్వరమే రాయితీ పరికరాలు అందించాలని ఆదేశించారు. కాగా రాయితీ పరికరాలకు పేర్లు నమోదు చేయాలన్నా, కంపెనీల నుంచి పనిముట్లు తెప్పించాలన్నా.. క్షేత్రస్థాయి సిబ్బంది రైతుల నుంచి ముడుపులు కోరుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు మండల స్థాయి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో ఎవరికీ అందించకుండా తాత్సారం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

అన్ని జిల్లాల్లో సమానంగా సిబ్బంది

- సెర్ప్ అధికారులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పనిచేసే సిబ్బంది అన్ని జిల్లాల్లో సమాన స్థాయిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సెర్ప్ కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ ఆ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొన్ని జిల్లాల్లో సిబ్బంది ఎక్కువగాను, మరి కొన్ని జిల్లాల్లో తక్కువగా ఉన్నారని, వారందరినీ సమాన స్థాయిలో ఉండే విధంగా సరిచేయాలని సూచించారు. రైతు ఉత్పత్తి సంస్థల(ఎఫ్‌పీఓ)స్థాయిలో రైతులకు శిక్షణ, నాణ్యమైన ఇన్‌పుట్ ఇవ్వడం, పంటలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా అధిక ఆదాయం సమకూర్చేందుకు సెంటర్ ఫర్ క్యాటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఏపీఎంఎస్ఎస్ సంస్థల ద్వారా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నెలావారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సమావేశంలో సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి తదితరులు పాల్గొన్నారు.

అధునాతన సౌకర్యాలతో సంక్షేమ హాస్టళ్లు

- తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు: మంత్రి డోలా

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అధునాతన సౌకర్యాలతో నూతన సంక్షేమ హాస్టళ్లు నిర్మించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. హాస్టళ్ల మరమ్మతులు, కొత్త హాస్టళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చించి, పలు డిజైన్లు ఎంపిక చేశారు. ఈ ఏడాది నవంబరులోపు హాస్టళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సచివాలయంలోనే మంత్రి కుల ధ్రువీకరణ పత్రాల అప్పీళ్లపై హియరింగ్ నిర్వహించారు. జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీలో నిష్పక్షపాత విచారణ చేయాలన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు జారీచేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య సర్టిఫికెట్లు

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): స్వల్పకాలిక వృత్తి విద్య సర్టిఫికేషన్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1378 పాఠశాలల్లో వృత్తి విద్య అమలు చేస్తున్నామని, విద్యార్థులకు పది ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. చదువుతో పాటు స్వశక్తితో ఎదిగేందుకు వృత్తి విద్య నైపుణ్యాలు దోహదం చేస్తాయన్నారు. ఇప్పటివరకూ మూడు విడతల్లో 20వేల మంది విద్యార్థులు కోర్సులు పూర్తిచేశారన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలి

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 ఏళ్లకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సోమవారం ఆయన లేఖ రాశారు. 2018 తర్వాత మళ్లీ ఇప్పుడే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రామకృష్ణ కోరారు.

పాస్టర్ మృతిపై న్యాయ విచారణ జరపాలి

- క్రైస్తవ సంఘాల వినతి

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై న్యాయ విచారణ జరిపించాలని క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ కోరింది. ఈమేరకు సోమవారం అమరావతి సచివాలయంలో మైనార్టీ, న్యాయ, హోంశాఖ కార్యదర్శులను కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు జి.రాజా సుందర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తనను, తన కుమార్తెను చంపేస్తామని కొందమందిసిన ఉంచి తనకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లుగా పాస్టర్ ప్రవీణ్ చెప్పిన వీడియోలను పోలీసులు పట్టించుకోకుండా, ఆయన మరణం ప్రమాదవశాత్తు జరిగిందని కేసు ముగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో పాస్టర్లకు, క్రైస్తవులకు, చర్చిలకు రక్షణగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.



ఆ అధికారిని వదిలిపెట్టం

జైలులో ప్రభుత్వ ఆతిథ్యం స్వీకరించాల్సిందే

- కోర్టు ప్రతిష్ఠతో చెలగాటం ఆడితే క్షమించబోం
- చట్టాన్ని గౌరవించనివారికి మినహాయింపు ఇవ్వం
- ఇళ్ల కూల్చివేతలో బాధితుల పిల్లలు కనిపించలేదా?
- ఉమ్మడి ఏపీ నాటి ఓ కేసులో సుప్రీంకోర్టు ఆగ్రహం..
- కూల్చిన ఇళ్లకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరిక

న్యూఢిల్లీ, గుంటూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విభజన సమయంలో జరిగిన ఓ ఘటనలో అప్పటి తహసీల్దార్‌పై (ప్రస్తుతం డిప్యూటీ కలెక్టరు హోదాలో అమరావతి జీఏడీ ప్రొటోకాల్ డైరెక్టరుగా ఉన్నారు) సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ అధికారిని క్షమించేది లేదని, ఆయనను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఆ అధికారి కోర్టు పరిసరాల్లోనే ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది తెలపగా, "ఆయన అమరావతి జైలులో ఉండదలుచుకున్నారా? లేదా తిహాడ్ జైలుకు రావాలి అనుకుంటున్నారా? చెప్పమనండి." అని న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. కేసు పూర్వపరాలివీ.. గుంటూరులో ఒక ప్రాంతం (అడవి తక్కెళ్లపాడు)లో ఆక్రమణలను తొలగించవద్దని 2013 డిసెంబరు 11న హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించి 2014 జనవరిలో అప్పట్లో తహసీల్దార్‌గా ఉన్న ఆ అధికారి వాటిని తొలగించారు. దీనిని హైకోర్టు కోర్టు ధిక్కారం కింద పరిగణించి, రెండు నెలల జైలు శిక్ష విధించింది. దానిపై ఆయన వేసిన అప్పీలును హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టారు. ఆయన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. ఆ అధికారి హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడంపై జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. కోర్టును ధిక్కరించి 80 మంది పోలీసులను తీసుకుని కూల్చివేతలు జరిపించడానికి వెళతారా? అక్కడ ఎన్ని ఇళ్లు కూల్చారు? అంటూ ఆగ్రహించింది. "హైకోర్టు ప్రతిష్ఠతో చెలగాటమాడితే ఎవరినైనా జైలులో వేస్తాం. ఆయన తనను తాను హైకోర్టు కంటే ఉన్నత వ్యక్తిగా భావిస్తున్నారా? చట్టాన్ని గౌరవించని వారికి ఎలాంటి మినహాయింపు ఉండదు." అని బెంచ్ వ్యాఖ్యానించింది. తనను ఆరోపణల నుంచి విముక్తి చేయాలని, పిటిషనర్‌కు ఇద్దరు పిల్లలున్నారని ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థించగా, "ఇళ్ల కూల్చివేతల సమయంలో బాధితుల పిల్లల గురించి మీరు ఆలోచించారా? వారి సంగతేమిటి?." ఆయన జైలులో ప్రభుత్వ అతిథ్యం స్వీకరించాల్సిందే," అని హెచ్చరించింది. ఆయన 48 గంటలు కస్టడీలో ఉంటే ఉద్యోగం పోతుందని తెలిపింది. "మేం ఆయన హోదానూ తగ్గించగలం. మళ్లీ తహసీల్దార్ కావాలని అనుకుంటున్నారేమో అడగండి." అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఆయన కూల్చివేసిన ఇళ్లకు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయితే, ఆయన పిటిషన్‌పై విచారణ కొనసాగించడానికి ఆయన అంగీకరించారు. "సాధారణంగా ఇలాంటి పిటిషన్లు విచారణకు స్వీకరించం. అయినా కొంత సహనం పాటిస్తూ నోటీసు జారీ చేస్తున్నాం. వచ్చేనెల ఐదో తేదీ వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తున్నాం. బాధితులకు న్యాయసేవల అథారిటీ నుంచి న్యాయ సహాయం అందిస్తాం" అని వెల్లడించారు.



అమరావతిలో మోదీ సభా వేదిక ఏర్పాట్లు

మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు



ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం విజయవాడలోని జల వనరుల శాఖ రైతు శిక్షణా కేంద్రంలో సమావేశమైంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ప్రధాని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ముఖ్యంగా ఆహారం, తాగునీరు వంటి వసతుల కల్పనలో ఏ మాత్రం రాజీపడరాదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులను మెరుగుపరచాలని సూచించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ... ప్రధాని పర్యటన రోజు ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని పోలీసుల అధికారులను ఆదేశించారు. గ్రామీణ రహదారులు అయినందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో చిలకలూరిపేట, విశాఖపట్నంలో ప్రధాని పర్యటన సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. మోదీ సభను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ప్రధాని మోదీ మే 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని సీఎస్ విజయానంద్ తెలిపారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాష్ట్ర సచివాలయం సమీపంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక వైపు గల ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి విధులు కేటాయించిన అధికారులు తమ బృందాలతో కలసి అప్పగించిన పనులు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఏర్పాట్లలో ఇతర ఏ విధమైన సమస్యలున్నా నోడల్ అధికారి వీరపాండ్యన్‌తో సమన్వయం చేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రధాని కార్యక్రమాల పర్యవేక్షణ నోడల్ అధికారి వీరపాండ్యన్ ప్రజెంటేషన్ ద్వారా పర్యటన ఏర్పాట్లను వివరిస్తూ ప్రధాని షెడ్యూల్‌ను ప్రకటించారు. రెండు గంటల పాటు సాగే ప్రధాని పర్యటనకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

10 పార్కింగ్ స్థలాలు

ప్రధాని పర్యటనకు సంబంధించి 10 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు వీరపాండ్యన్ తెలిపారు. వీవీఐపీలకు కరకట్ట, సీడ్‌యాక్సిస్ రోడ్లను ప్రత్యేకంగా కేటాయించనున్నట్టు తెలిపారు. సామాన్య ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుక వీలుగా విజయవాడ నుంచి మరో రెండు రూట్లు, గుంటూరు నుంచి నాలుగు రూట్లు, మరి కొన్ని తాత్కాలిక రూట్లను కూడా ట్రాఫిక్‌కు అంతరాయాలు లేకుండా సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా రోడ్లన్నీ గుంతలులు లేకుండా తీర్చిదిద్దాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. వివిధ జిల్లాల నుంచి సభకు తీసుకొచ్చే వారందరికీ అల్పాహారం, తాగునీరు, మజ్జిగ, పండ్లు, భోజనం వంటివి పంపిణీ చేయాలని సంబంధిత ఇన్‌చార్జులకు సూచించారు. ఈ విషయంలో రాజీపడొద్దని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. 30 తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పీజీ రిహార్సల్స్ ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి ఆయా అధికారులు ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు డైలీ నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీఏడీ ముఖ్యకార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మధుసూధన్‌రెడ్డి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ, నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

1.20 కోట్ల ఉపాధి కూలీలకు ప్రమాదబీమా

- ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ప్రీమియం చెల్లింపు
- ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని నిర్ణయం

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధి కూలీలందరికీ ప్రమాదబీమా చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. ఇటీవల మొగల్తూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధి కూలీలు చనిపోయినప్పుడు వారికి బీమా లేకపోవడంతో ఆ కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం అందని పరిస్థితి ఏర్పడింది. అలాంటి కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే 1.20 కోట్ల మంది ఉపాధి కూలీలను ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన కిందకు తీసుకురావాలని నిర్ణయించారు. ఆ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజకు ఆదేశాలిచ్చారు. మే 1వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కూలీల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించేలా ఫీల్డ్ అసిస్టెంట్లను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ సోమవారం అన్ని జిల్లాల డ్వామా పీడీలతో గుగూల్‌మీట్ ద్వారా మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రీమియం ఒక వ్యక్తికి రూ.20 చెల్లిస్తే చాలు ఆ వ్యక్తి ప్రమాదంలో చనిపోయినప్పుడు రూ.2 లక్షల బీమా లభిస్తుంది. అదే విధంగా రాష్ట్రీయ స్వస్థ బీమా యోజన కింద రూ.450 ప్రీమియం చెల్లిస్తే పలు రకాల ప్రమాదాలకు బీమా లభిస్తుంది. ఈ రెండు పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కూలీలను నమోదు చేయాలని కమిషనర్ ఆదేశించారు. మే 1వ తేదీకల్లా రాష్ట్ర వ్యాప్తంగా కూలీల నుంచి సంతకాలు తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్లు బ్యాంకుల వద్ద నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో సంప్రదించి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్లకు తగు సూచనలిచ్చి ఫీల్డ్ అసిస్టెంట్లకు వాటి నమోదుకు సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని పీడీలను కమిషనర్ ఆదేశించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ బీమా కిందకు చేర్చే క్రమంలో అనేక రకాల ఇబ్బందులు ఎదురయ్యాయి. బ్యాంకర్లు సరిగా సహకరించకపోవడం, ఆ మేరకు బ్యాంకుల్లో సిబ్బంది లేకపోవడంతో సకాలంలో దరఖాస్తులు ఎన్‌రోల్ చేసుకోలేకపోయారు. దీంతో నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిపోయింది. ప్రాక్టికల్‌గా సమస్యలున్నందున దీనిపై సుదీర్ఘ కసరత్తు చేస్తే తప్ప సక్సెస్ చేయలేమని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు కసరత్తు చేసి జూన్ లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసి ప్రతి ఉపాధి కుటుంబానికి భరోసా కల్పించాలని నిర్ణయించారు.

నేడు వైసీపీ సలహా కమిటీ భేటీ

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలిని నిరసిస్తూ సీనియర్ నేతలు ఒక్కరొక్కరుగా పార్టీని వీడుతున్న నేపథ్యంలో వైసీపీ రాజకీయ సలహా కమిటీ (పీఏసీ) సమావేశం కానుంది. జగన్ అధ్యక్షతన మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో ఈ భేటీ జరుగుతుంది. కమిటీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, పినిపె విశ్వరూప్, ముద్రగడ పద్మనాభం, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు తదితరులు హాజరు కానున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలయ్యాక.. వైసీపీ ఇప్పటిదాకా రాజకీయపరమైన సమీక్షలు, నిర్ణయాలు చేయలేదు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య, మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని, మాజీ విప్ సామినేని ఉదయభానుతో పాటు పార్టీలో నంబర్ టూగా చలామణి అయిన విజయసాయిరెడ్డి కూడా పార్టీని వీడడం వైసీపీ శ్రేణులను కలవరపరుస్తోంది. ఇంకా ఎవరెవరు నిష్క్రమిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో జరుగనున్న పీఏసీ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని ఆసక్తిగా చూస్తున్నారు.

ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు

అమరావతి/న్యూఢిల్లీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పర్యటన ముగించుకుని ఢిల్లీ చేరుకున్నారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఢిల్లీ విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి తన అధికారిక నివాసం 1 జన్‌పథ్‌కు చేరుకుని, రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఉదయం 10.30 గంటలకు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను, 11.30కి కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, మధ్యాహ్నం 2గంటలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యే అవకాశముంది.

చంద్రబాబుకు ఘన స్వాగతం

ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఘనస్వాగతం లభించింది. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్వాగతం పలికారు. అప్పలనాయుడు, ఆయన సతీమణి ప్రభానాయుడు అరసవెల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం తీర్థప్రసాదాలు అందజేశారు.

పోప్ ఫ్రాన్సిస్ మృతికి సీఎం సంతాపం

పోప్ ఫ్రాన్సిస్ మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. ఆయన సోమవారం ఎక్స్‌లో స్పందిస్తూ... 'ప్రపంచ ప్రజలను ప్రేమ, దయాగుణం దిశగా నడిపిన ఓ మహావ్యక్తి పోప్ ఫ్రాన్సిస్. ఆయన మృతి ప్రపంచ క్యాథలిక్ సమాజానికి తీరని లోటు' అని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా పోప్ ఫ్రాన్సిస్ మృతికి సంతాపం తెలిపారు. పోప్ లక్షలాది మంది జీవితాలకు మార్గదర్శనం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ట్వీట్ చేశారు.



బ్రిటన్‌లో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

మన జోన్‌పై 'రైల్వే' రివర్స్!



(మొదటి పేజీ తరువాయి)

ఆ తరువాత భూమిని సేకరించి నిర్మాణాలు చేపట్టారు. కానీ, ఇక్కడ మాత్రం ముందు నిర్మాణాలు.. ఆపైనే ఆపరేషన్లు అని రైల్వేశాఖ చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అత్యధిక ఆదాయం వచ్చే వాల్తేరు డివిజన్‌ను వదులుకోవడం ఇష్టం లేని ఒడిశాలోని తూర్పు కోస్తా రైల్వే జోన్ అధికారులు తెర వెనుక రాజకీయాలు చేస్తున్నారని చెబుతున్నారు. విశాఖలో జోన్ ఆపరేషన్లు మొదలుకాకుండా వారే అడ్డం పడుతున్నారని తెలుస్తోంది. రాష్ట్ర విభజనలో భాగంగా విశాఖకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), పెట్రోలియం యూనివర్సిటీ, గిరిజన యూనివర్సిటీలు వచ్చాయి. వీటిని ముందు అద్దె భవనాల్లో ప్రారంభించి...ఆ తరువాత నిర్మాణాలు పూర్తి చేసి, వాటిలోకి తరలించారు. ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను కూడా అలాగే చేశారు. ఇది దేశవ్యాప్తంగా అమలులో ఉన్న విధానం. అంత ఎందుకు..? ఏపీకి రాజధాని నగరం లేకుండానే తెలంగాణ నుంచి తరలివచ్చేశారు. ఇప్పుడు ఓ వైపు పరిపాలన సాగిస్తూ మరోవైపు అమరావతి నిర్మాణం చేపడుతున్నారు. ఇంత చిన్న లాజిక్ కేంద్రం ఎందుకు మిస్ అయ్యారో మరి! మరోవైపు రైల్వే మంత్రిని నిలదీసి వెంటనే జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని రాష్ట్ర ఎంపీలు అడగలేకపోతున్నారు. జోన్ ఆపరేషన్ విషయంలో జాప్యానికి ఇదీ ఒక కారణమని చెబుతున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే నుంచి విడదీసిన గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లను, విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు డివిజన్‌ను కలిపి 'దక్షిణ కోస్తా' జోన్‌గా ప్రకటించారు. దాదాపు ఏపీ మొత్తం ఈ జోన్‌లోనే ఉంది. ఇది ఒక్క విశాఖపట్నం ప్రజలకు పరిమితం కాదు. రాష్ట్రం అంతటికీ సేవలు అందిస్తుంది. కొత్త రైళ్లు కావాలన్నా, రైల్వే లైన్లు కావాలన్నా జోనల్ అధికారులే ప్రతిపాదనలు పెట్టాలి. అలా జరగాలంటే, ముందు జోన్ ఆపరేషన్లు మొదలు కావాలి. రైల్వేజోన్‌కు జనరల్ మేనేజర్ ప్రధాన అధికారి. ఆయనను తక్షణమే నియమించి విశాఖపట్నం పంపిస్తే ఆపరేషన్లు మొదలవుతాయి. పనులన్నీ ఒక క్రమపద్ధతిలో, వేగంగా పూర్తవుతాయి.

రాయగడ డివిజన్‌లో మొదలైన ఆపరేషన్

కొత్త జోన్‌లో భాగంగా వాల్తేరు డివిజన్ నుంచి విడదీసిన ప్రాంతాలతో ఒడిశాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటుచేశారు. ఇది భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు కోస్తా జోన్ పరిధిలోకి వస్తుంది. ఇది రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ అడ్డా కావడంతో (ఒడిశా నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం) డివిజన్ ప్రకటించిన వెంటనే దానికి డివిజన్ రైల్వే మేనేజర్‌ని నియమించారు. భూసేకరణ, భవన నిర్మాణం లేకుండానే ఆపరేషన్ ప్రారంభించారు. అదే చొరవ విశాఖలోని జోన్ విషయంలో చూపించడం లేదు.

జోన్ శంకుస్థాపన సంబరాలు ఏవీ?

విశాఖలో ఈ ఏడాది జనవరి 8న కొత్త జోన్ కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. సాధారణంగా ఇలాంటి కార్యక్రమాలకు రైల్వే మంత్రి తప్పనిసరిగా హాజరవుతారు. కానీ విశాఖకు ఆ రోజు మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాలేదు. ఇక్కడ జోన్ ఏర్పాటు ఒడిశాకు నష్టమనే భావన వారిలో బలంగా ఉంది. దాంతో ముఖం చాటేశారు. ఎక్కడెక్కడి నుంచో రైల్వే ఉన్నతాధికారులు అంతా వచ్చారు. కానీ ఇక్కడ స్థానికంగా ఉన్న రైల్వే అధికారులు, ఉద్యోగులెవరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. వాస్తవానికి కొత్త జోన్ శంకుస్థాపన అంటే అది పెద్ద సంబరంలా జరగాలి. కానీ ఆ సంతోషం ఎవరిలోనూ లేదు. ఇప్పటికీ అందరిలోనూ అనుమానాలే. ఇక్కడ జోన్ ఆపరేషన్లు ఇప్పట్లో మొదలవుతాయని ఎవరూ భావించడం లేదు. అంత బలంగా ఒడిశా అధికారులు లాబీయింగ్ చేస్తున్నారని చెబుతున్నారు.

ఇవిగో భవనాలు...

రైల్వే జోన్ కార్యకలాపాలు తక్షణమే ప్రారంభించడానికి విశాఖలో అనేక భవనాలు అందుబాటులో ఉన్నాయి. రైల్వేస్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా స్టేషన్ బయట 'గతిశక్తి' పథకంలో భాగంగా నాలుగు అంతస్థుల భవనాలు రెండు నిర్మించారు. ఒక్కో అంతస్థులో 4,500 చదరపు అడుగుల స్థలం అందుబాటులో ఉంది. కింద గ్రౌండ్ ఫ్లోర్‌తో కూడా కలుపుకొంటే దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన కొత్త భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా డీఆర్ఎం బంగ్లా పక్కన ప్రభుత్వ పాఠశాలను ఇటీవల ఖాళీ చేయించేశారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో అందులో తరగతి గదులు ఉన్నాయి. వీటిని జోనల్ కార్యాలయం పూర్తయ్యేంతవరకు ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కేంద్రంతో మాట్లాడి తక్షణమే రైల్వే జోన్ ఆపరేషన్లు మొదలయ్యేలా చూడాలి. దీనికి అవసరమైన గజిట్ ప్రకటించేలా చూడాలి.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


నా పొలం లీజుకు తీసుకుని మట్టి తవ్వుకుపోతున్నారు

- ఎమ్మెల్యే చింతమనేని, ఆయన అనుచరులే పాత్రధారులు
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేసినా పరిష్కారం కాలేదు
- మణికట్టు కోసుకున్న బాధితుడు బాబూరావు
- అడ్డుకుని మణిపాల్ ఆస్పత్రికి తరలించిన సిబ్బంది

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో దాసరి బాబూరావు అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు కలిసి తన పొలాన్ని లీజుకు తీసుకుని.. అనుమతి లేకుండా మట్టి తవ్వుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. బాబూరావు తన భార్య నాగలక్ష్మితో టీడీపీ కార్యాలయానికి వచ్చారు. దెందులూరు మండలం చల్ల చింతలపూడిలో సర్వే నంబరు 12/2, 13/4లోని తమ పదెకరాల పొలాన్ని మాయమాటలతో చల్లచింతలపూడి మాజీ సర్పంచ్ సత్యనారాయణ లీజుకు తీసుకున్నారని, ఆ పొలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తోలుకుపోతున్నారని.. ఈ వ్యవహారంలో చింతమనేని, ఆయన అనుచరులు కీలకంగా ఉన్నారని తెలిపారు. పదెకరాల్లో ఇప్పటికే 4 ఎకరాల్లో మట్టి తవ్వేశారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గనుల శాఖ తనకు రూ.1.25 కోట్లు ఫైన్ వేసిందని తెలిపారు. ఈ వ్యవహారంపై టీడీపీ గ్రీవెన్స్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని, ఇక ఆత్మహత్యే శరణమ్మంటూ మణికట్టు కోసుకున్నారు. టీడీపీ కార్యాలయ సిబ్బంది అడ్డుకుని అయన్ను మణిపాల్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

అమరావతికి మోదీ.. శుభసూచకం


- ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు: ఎంపీ కలిశెట్టి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ రాక శుభసూచకమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ప్రధాని రాక కోసం ఏపీ ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవ సూచికని అన్నారు. ప్రధాని సహకారంతో నిర్ణీత సమయంలో రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయని, సీఎం చంద్రబాబు అన్నింటినీ గాడిన పెట్టేందుకు శ్రమిస్తున్నారని తెలిపారు. అమరావతికి ప్రధాని రాకతో రాష్ట్రానికి పెట్టుబడులు మరింత పెరిగే అవకాశముందన్నారు.

జగన్ ఒక్క టీచర్ పోస్టూ భర్తీ చేయలేదు

- ఈ విషయంలో పేటెంట్ టీడీపీదే: పంచుమర్తి



అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డిని కేవలం 11 సీట్లకు పరిమితం చేస్తూ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినా, ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తరిమేసినా జగన్ తీరు మాత్రం మారడం లేదని శాసనమండలిలో చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ విమర్శించారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పార్టీ మొత్తం ఖాళీ అవుతున్నా ఆత్మపరిశీలన మానేసి రాష్ట్రంలో ఏదో ఒక రాద్ధాంతం చేయడం జగన్ అలవాటుగా పెట్టుకున్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే జగన్‌రెడ్డి తట్టుకోలేకపోతున్నారు. సోషల్ మీడియాలో ఫేక్ డీఎస్సీ పోస్టులు అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఎప్పుడైనా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరిగిందంటే దాని పేటెంట్ రైట్ కేవలం టీడీపీకి మాత్రమే దక్కుతుంది. మొత్తం 1,96,000 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిన ఏకైక నాయకుడు చంద్రబాబు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించిన ఘనత, వారితో మరుగుదొడ్లను కడిగించిన చరిత్ర జగన్‌దే. ఏ ఒక్క నెల కూడా సకాలంలో టీచర్లకు జీతాలు ఇవ్వలేదు. 1998, 2018, 2019లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు వైసీపీ నేతలు సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారు. అప్పుడు అధికారంలో ఉన్నది ఎవరో జగన్‌రెడ్డి సమాధానం ఇవ్వాలి. జగన్ పాలనలో ఉపాధ్యాయ నియామకాలు గుండు సున్నా' అని పంచుమర్తి విమర్శించారు.

డీఎస్సీకి భారీగా దరఖాస్తులు

» రెండో రోజుకే 21వేలు దాటిన వైనం

» మహిళలు టెన్త్ సర్టిఫికెట్‌లోని పేరే రాయాలి

అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి ఉపాధ్యాయ శిక్షణార్థుల నుంచి భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఆదివారం ఉదయం 10గంటలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా మధ్యాహ్నానికే 4వేలకు పైగా దరఖాస్తులు అందాయి. సోమవారం సాయంత్రానికి 21,631 వచ్చాయి. వచ్చే నెల 15 వరకు గడువు ఉన్నప్పటికీ అభ్యర్థులు ఇప్పటినుంచే వేగంగా దరఖాస్తులు సమర్పిస్తున్నారు. కాగా, మహిళా అభ్యర్థులు పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్న పేరునే దరఖాస్తులోనూ రాయాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. వివాహం తర్వాత ఇంటి పేరు మార్చుకున్న మహిళా అభ్యర్థులు కొందరు దీనిపై గందరగోళానికి గురికావడంతో ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. అలాగే టెట్‌లో డిగ్రీ మార్కుల శాతం విషయంలో ఎన్‌సీటీఈ ప్రమాణాలను పాటిస్తున్నామని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2024లో జరిగిన టెట్ 2(ఎ) పేపరులో ఓసీ కాని వారికి మాత్రమే డిగ్రీలో 40శాతం మార్కులతో అనుమతి కల్పించారని తెలిపాయి. విద్యలో నాణ్యత ఉండాలంటే డీఎస్సీకి పరీక్షలు రాసేవారికి డిగ్రీలో 50శాతం మార్కులు వచ్చి ఉండాలని ఎన్‌సీటీఈ చెబుతోందని పేర్కొన్నాయి.

డీఎస్సీకి 24 నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

» బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏర్పాట్లు: మంత్రి సవిత



సోమందేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో మంత్రి సోమవారం పలువురు డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడారు. ఇప్పటికే 5,200 మందికి ఉచిత శిక్షణ ఇచ్చామని తెలిపారు. 16,347 ఎసుఉస్టలకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారని తెలిపారు. జూన్ నాటికి అభ్యర్థులను ఎంపిక చేసి, జాయినింగ్ ఆర్డర్లు అందిస్తామని మంత్రి చెప్పారు.

రేపు పదో తరగతి ఫలితాలు

» ఉదయం 10 గంటలకు విడుదల

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలు కూడా టెన్త్ ఫలితాలతో పాటే విడుదల చేస్తామన్నారు. ఫలితాలను విద్యార్థులు https://bse.ap.gov.in, https://apopen-school.ap.gov.in వెబ్‌సైట్లలో చూసుకోవచ్చన్నారు. అలాగే మనమిత్ర వాట్సాప్, లీప్ మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయన్నారు. 9552300009 నంబరుకు హాయ్ అని మెసేజ్ చేసి, విద్యా సేవల ఆప్షన్ ద్వారా ఫలితాలను పీడీఎఫ్ కాపీ రూపంలో పొందవచ్చన్నారు.

ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్లు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరిగే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు అభ్యర్థుల హాల్ టికెట్లను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మే 3 నుంచి 9 వరకు మెయిన్స్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు హాల్ టికెట్లు మాత్రమే తీసుకురావాలని, మార్గదర్శకాల పేపరు తీసుకురాకూడదని స్పష్టం చేసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్షలు జరుగుతాయని, మొత్తం ఏడు పేపర్లు ఉంటాయని తెలిపింది.

58 ఏళ్ల వయసులో కార్డియాలజీ డిగ్రీ



» ప్రముఖ న్యూరాలజిస్ట్ రామకృష్ణ ఘనత

» దేశంలో ఈ ఘనత సాధించిన తొలి వైద్యుడిగా గుర్తింపు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటించిన సూపర్ స్పెషాలిటీ కోర్సుల ఫలితాల్లో గుంటూరుకు చెందిన డాక్టర్ గాజుల రామకృష్ణ కార్డియాలజీ (డీఎం) కోర్సులో ఉత్తీర్ణత సాధించారు. ఈ క్రమంలో 58 ఏళ్ల వయసులో కార్డియాలజీ డిగ్రీ సాధించిన వైద్యుడిగా ఆయన రికార్డు సృష్టించారు. చినకాకానిలోని ఎన్నారై వైద్య కళాశాలలో కార్డియాలజీ కోర్సు చేసిన ఆయన ఇకపై పూర్తిస్థాయిలో గుండె జబ్బుల వైద్య నిపుణుడిగా ప్రాక్టీసు చేసుకోవచ్చు. అంతే కాదు.. రామకృష్ణ క్వాలిఫైడ్ న్యూరాలజిస్ట్ కూడా. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఇన్‌చార్జ్ విభాగాధిపతి హోదాలో విధులు నిర్వహిస్తూ.. నీట్ రాసిన ఆయన కార్డియాలజీ సీటు సాధించారు. భారత్‌లో న్యూరాలజీ, కార్డియాలజీ కోర్సులు చేసిన ఏకైక డాక్టర్‌గా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వేమూరు మండలం చావలిలో జన్మించిన డాక్టర్ రామకృష్ణ 1986-92 మధ్య ఎంబీబీఎస్ చదివారు. అనంతరం 1998వ బ్యాచ్‌లో పల్మనాలజీ పీజీ కోర్సు, 2004వ బ్యాచ్‌లో జనరల్ మెడిసిన్ పీజీ కోర్సులు చేశారు. తిరుపతి స్విమ్స్‌లో 2011-14 మధ్య న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ కోర్సు చేశారు. కాగా, గుంటూరులో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో కార్డియాలజీ, న్యూరాలజీ డిగ్రీలు చేసిన ఏకైక డాక్టర్‌గా గుర్తింపు దక్కడం పట్ల చాలా ఆనందంగా ఉందని తెలిపారు. గుండె, నరాలు, ఊపిరితిత్తులకు ఒకదానితో మరొకదానికి సంబంధం ఉంటుందని, ఈ మూడు కోర్సులు చేయడం వల్ల రోగుల ఆరోగ్య పరిస్థితిని మరింత మెరుగ్గా అంచనా వేసి మెరుగైన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందని రామకృష్ణ తెలిపారు.

న్యూరాలజీలో టాపర్ కార్తీక్ రెడ్డి

ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం సోమవారం ప్రకటించిన న్యూరాలజీ సూపర్ స్పెషాలిటీ కోర్సు ఫలితాల్లో స్టేట్ టాపర్‌గా గుంటూరు వైద్య కళాశాల (జీఎంసీ) విద్యార్థి డాక్టర్ కార్తీక్ రెడ్డి నిలిచారు. 800 మార్కులకు గాను ఆయన 649 మార్కులు (82 శాతం) సాధించారు. రాష్ట్రంలో మొదటి మూడు ర్యాంకులు కూడా జీఎంసీ విద్యార్థులకే దక్కాయి. డాక్టర్ అజ్మ 626 మార్కులతో రెండో ర్యాంకు, డాక్టర్ కాంతిమ 625 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. స్టేట్ ర్యాంకులు సాధించిన తమ విద్యార్థులను జీఎంసీ ప్రిన్సిపాల్, న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి అభినందించారు.

మార్కెట్ ఫీజు వసూళ్లలో చేతివాటం!



» పంట ఉత్పత్తులు, రవాణా బాగున్నా.. ఆదాయం అంతంతమాత్రమే!

» అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే..

» చెక్‌పోస్టుల్లో కనిపించని సీసీ కెమెరాలు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులు.. వాటి రవాణా బాగున్నా.. మార్కెట్ ఫీజులు మాత్రం ప్రభుత్వం ఆశించినట్టుగా రావడం లేదు. వసూళ్లలో ఏనాడూ లక్ష్యాన్ని చేరుకోలేదు. చెక్‌పోస్టుల సిబ్బంది చేతివాటమే ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి. 2024-25లో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో ఫీజు వసూలు లక్ష్యం రూ.742.26 కోట్లు కాగా, ఇందులో రూ.696.58 కోట్లు (93.85 శాతం) వసూలైంది. గతేడాది పంట ఉత్పత్తులు మెరుగ్గా ఉన్నా.. క్రయవిక్రయాలు జోరుగా సాగినా.. అంచనా మేరకు మార్కెట్ ఫీజు రాలేదు. ఏటా పంట సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంచనాను పరిగణలోకి తీసుకుని, మార్కెట్ ఫీజులు నిర్ణయించి లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. కానీ ఈ ఏడాది 218 ఏఎంసీల్లో 100 యార్డుల పరిధిలోని అధికారులు లక్ష్యాన్ని సాధించలేకపోయారు. 118 ఏఎంసీల్లో 100%పైన, 21ఏఎంసీల్లో 90-100%, 54 ఏఎంసీల్లో 70-90%, 21 ఏఎంసీల్లో 50-70% వసూలయింది. రాష్ట్రంలో 453 మార్కెట్ కమిటీ చెక్ పోస్టులు ఉన్నాయి. పంట ఉత్పత్తులను రవాణా చేసేటప్పుడు ఎక్కడైనా ఒక చెక్‌పోస్టులో ఫీజు చెల్లిస్తే.. ఇంక ఎక్కడి నుంచి ఎక్కడికైనా పంట ఉత్పత్తులను తరలించుకోవచ్చు. కానీ కొన్ని చెక్ పోస్టుల్లో సిబ్బంది చేతివాటం, ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ప్రతి జిల్లాలో ప్రధాన పంటలుగా వరి, పత్తి, విఎర్రి, వేరుశనగలలో ఏదొకటి ఉండగా, అపరాలు, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పశుసంపద, దాదాపు అన్ని జిల్లాల్లో ఉన్నాయి. పంట, పశు ఉత్పత్తులను అమ్మకానికి తరలించేవారు చెక్‌పోస్టుల్లో మార్కెట్ ఫీజు చెల్లించాలి. వాస్తవానికి అంచనాకు మించి ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా.. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయకపోవడం వల్ల కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. చాలా చెక్‌పోస్టుల్లో రాత్రి వేళ తరలించే పంట ఉత్పత్తి, పశుసంపదకు అనధికారికంగా వసూళ్లు చేస్తూ.. కొందరు సిబ్బంది జేబులు నింపుకొంటున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా మార్కెట్ ఫీజు పక్కదారి పడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి.

చెక్ పోస్టుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తేనే!

రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రలో 2014-15లో రూ.438కోట్లు, 2015-16లో రూ.445.9కోట్లు, 2016-17లో రూ.476.8కోట్లు, 2017-18లో రూ.488 కోట్లు, 2018-19లో రూ.492.4కోట్లు మార్కెట్ ఫీజు వచ్చింది. 2019-20లో ఆదాయం ఓ మోస్తరుగా ఉండగా, 2020-21లో కోవిడ్ కారణంగా ఆదాయం తగ్గింది. అయితే ఆ సమయంలో కేంద్రం తెచ్చిన 'ఒక దేశం- ఒక మార్కెట్' చట్టంతో రాష్ట్రంలో మార్కెటింగ్ చెక్‌పోస్టులు మూతపడ్డాయి. తర్వాత ఆ చట్టం రద్దు కావడంతో చెక్‌పోస్టులు యథావిధిగా నడుస్తున్నాయి. కానీ కొందరు సిబ్బంది చేతివాటంతో ఆదాయం తగ్గుతోంది. గత ప్రభుత్వంలో మార్కెట్ యార్డులకు నియమితులైనవారిలో చాలా మంది ఈ అక్రమార్జనలో వాటాలు పుచ్చుకుని ఆదాయానికి గండికొట్టారన్న ఆరోపణలున్నాయి. శాఖలో విజిలెన్స్ విభాగం ఉన్నా.. చెక్‌పోస్టుల నిర్వహణపై నిఘా లోపించింది. అందువల్ల అన్ని చెక్‌పోస్టుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

మార్కెట్ ఫీజు వసూళ్లు ఇలా (రూ.కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం	ఆదాయం
2019-20	574.70	550.34
2020-21	617.75	242.49
2021-22	672.99	574.80
2022-23	624.79	647.36
2023-24	708.51	675.23
2024-25	742.26	696.58







డీపీఆర్‌లు ఇవ్వకపోతే మా కేటాయింపుల్లో కోత విధిస్తారా?

» జలసంఘాన్ని నిలదీసిన ఆంధ్ర

» గోదావరి ట్రైబ్యునల్ అవార్డు మేరకు నీళ్లు వాడుకుంటామని స్పష్టీకరణ

» భేటీని బహిష్కరించిన తెలంగాణ

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): చింతలపూడి సహా గోదావరి నదిపై నిర్మిస్తున్న పథకాలకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు ఇవ్వనంత మాత్రాన గోదావరి ట్రైబ్యునల్ తమకు కేటాయించిన నీటిలో ఎలా కోత విధిస్తారని కేంద్ర జల సంఘాన్ని ఆంధ్రప్రదేశ్ నిలదీసింది. సోమవారం ఢిల్లీలో జలసంఘం చైర్మన్ ఎం.సిన్హా, సభ్యుడు భూపాల్‌సింగ్, సీఈ సంజయ్ కుమార్ తదితరుల సమక్షంలో జరిగిన ఈ భేటీని తెలంగాణ బహిష్కరించగా.. ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ సుగుణాకరరావు తమ వాదనలు వినిపించారు. గోదావరి జలాల్లో ఏపీకి 660 టీఎంసీల వాటా ఉందని వెల్లడించారు. పోలవరం నిర్మాణం పూర్తయ్యాక మరో 320 టీఎంసీలు వాడుకుంటామన్నారు. గోదావరి జలాల వివాద ట్రైబ్యునల్ అవార్డు మేరకు నీళ్లు వాడుకుంటామని స్పష్టం చేశారు. చింతలపూడి సహా మరికొన్ని ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సమర్పించాల్సి ఉందని తెలిపారు. కేటాయింపులే లేకపోయినా తెలంగాణ డీపీఆర్‌లు సమర్పించినంత మాత్రాన అక్రమంగా నిర్మించిన కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టులకు కేటాయింపులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అలాగే.. ఉమ్మడి రాష్ట్రానికి 1,486 టీఎంసీల నీటి లభ్యత ఉందని.. ఇందులో 969 టీఎంసీలు తెలంగాణకు వస్తాయంటూ 2019లో అప్పటి తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌రావు జలసంఘానికి లేఖ రాశారని.. ఎవరూ నిర్ధారించకుండా ఆ 969 టీఎంసీలను హక్కుగా ఎలా భావిస్తారని నిలదీశారు.

మరో వారం వరకు భగభగలే

వాతావరణ అనిశ్చితితో అక్కడక్కడ వర్షాలు



అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం ఎండ తీవ్రత కొనసాగింది. దక్షిణ భారతంలో అనేక ప్రాంతాల్లో అధికపీడనం ఉంది. దాని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి వీస్తుండడంతో గడచిన రెండు రోజుల నుంచి ఉక్కపోత పెరిగింది. సోమవారం గాలిలో తేమశాతం రాయలసీమలో 30 నుంచి 50, కోస్తాలో 50 నుంచి 80 శాతం వరకూ నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఉక్కపోత కొనసాగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. దీనికితోడు అనేక ప్రాంతాల్లో ఎండలు పెరగడంతో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఈనెల 28వ తేదీ వరకూ ఎండ తీవ్రత కొనసాగుతుందని, ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కాగా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో సోమవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న వారం పాటు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఎండలు మరింత పెరిగి వాతావరణ అనిశ్చితి నెలకొని పిడుగులు, వడగళ్లతో వానలు పడే అవకాశం ఉందన్నారు.

నేడు, రేపు వడగాడ్పులు

రాష్ట్రంలో రానున్న రెండు రోజులు ఎండ తీవ్రత, వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లోని 28 మండలాల్లో తీవ్రంగా, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లోని 21 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. అక్కడక్కడ అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సోమవారం తిరుపతి రూరల్‌లో 42.1, అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 41.5, నెల్లూరు జిల్లా దగదర్తిలో 41.4, ఏలూరు జిల్లా దెందులూరులో 41.3, పల్నాడు జిల్లా రావిపాడు, నంద్యాల జిల్లా గోనవరంలో 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సివిల్ కాంట్రాక్టర్‌కు డిజిటల్ ఝలక్

» రూ.21 లక్షలు కాజేసిన 'ఈ' నేరగాళ్లు

విజయవాడ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఓ సివిల్ కాంట్రాక్టర్‌కు సైబర్ నేరగాళ్లు 'డిజిటల్' ఝలక్ ఇచ్చారు. డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి మొత్తం రూ.21 లక్షలు కాజేశారు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో జరిగింది. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. వత్సవాయికి చెందిన గ్రేడ్1 సివిల్ కాంట్రాక్టర్‌కు కొద్దిరోజులుగా సైబర్ క్రైం పోలీసులు ఫోన్లు చేస్తున్నారు. ఆయన మహిళలు, అమ్మాయిల అక్రమ రవాణా చేస్తున్నాడని బెదిరించారు. తాము ముంబై క్రైం పోలీసులమని, కేసు నమోదు చేశామని కాంట్రాక్టర్‌కు వీడియో కాల్స్ చేయగా ఆయన బెదిరిపోయారు. వారు చెప్పిన బ్యాంకు కరెంట్ ఖాతాకు రూ.21 లక్షలను ఆర్టీజీఎస్ ద్వారా పంపారు. దీనిపై సైబర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్వాడీలు చంద్రబాబు మానసపుత్రికలు: సునీత

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు గ్రాట్యుటీ పెంపుపై టీడీపీ అంగన్వాడీ, డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత హర్షం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు చంద్రన్న మానసపుత్రికలని ఆమె పేర్కొన్నారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సునీత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'అంగన్వాడీల సంక్షేమం, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. వైసీపీ పాలనలోలా అంగన్వాడీలకు, రోడ్డు ఎక్కి ఆందోళన చేసే పరిస్థితి కల్పించబోము. కర్ణాటక, గుజరాత్ తర్వాత వారికి గ్రాట్యుటీ అమలు చేసిన మూడో రాష్ట్రంగా ఏపీ ఉంది. అంగన్వాడీలకు రూ.4,200 ఉన్న జీతాన్ని రూ.10,500 చేసిన ఘనత చంద్రబాబుది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాట మేరకు గ్రాట్యుటీని కూటమి ప్రభుత్వం పెంచింది' అని సునీత తెలిపారు

రంగా వర్సిటీకి 507 కోట్లు విడుదల



గుంటూరు జిల్లాలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 2025-26 బడ్జెట్‌లో కేటాయించిన రూ.507.01కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. సమగ్ర బడ్జెట్‌కు పరిపాలన అనుమతి ఇస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు త్రైమాసికాలకు పరిశోధన, పంట సంవర్ధన, ఇతర సంస్థలకు సహాయం కలిపి రూ.434.59కోట్లు, వర్సిటీ పరిధిలోని సంస్థలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాల గ్రాంటు కింద రూ.12.43 కోట్లు, ఇతర గ్రాంట్లు కింద మిగతా మొత్తం కేటాయించింది.

విద్యుత్ సంస్థల్లో 'ఉన్నత' కొలువులు

» సీఎండీలు, డైరెక్టర్ల నియామకానికి కసరత్తు పూర్తి

» మొత్తం 17 మంది డైరెక్టర్ల పోస్టులు భర్తీ

» ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు

» వైసీపీ హయాంలో నియమితులైన వారూ కొనసాగింపు

» వారికి అవకాశం ఇవ్వడంపై విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో ఉన్నత స్థాయి నియామకాలకు కసరత్తు దాదాపు పూర్తయింది. విద్యుత్తు పంపిణీ సంస్థలకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ల (సీఎండీ)లు, ఏపీజెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో డైరెక్టర్లను నియమించేందుకు రెండు నెలల కిందటే ప్రక్రియ మొదలైంది. ఆ పోస్టుల దరఖాస్తుదారులతో మౌఖిక ఇంటర్వ్యూలను కూడా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పూర్తి చేశారు. అర్హులైన అభ్యర్థుల జాబితానూ సిద్ధం చేశారు. ఏపీ జెన్‌కోకు ఐదుగురు, ట్రాన్స్‌కోకు ఒకరు, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్‌కు చెరో నలుగురు, ఏపీఈపీడీసీఎల్‌కు ముగ్గురు చొప్పున మొత్తంగా 17 మంది డైరెక్టర్లను నియమించాల్సి ఉంది. అయితే జగన్మోహనరెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక.. డిస్కమ్‌ల సీఎండీలుగా తనవారినే నియమించుకున్నారు. ఈపీడీసీఎల్‌కు మాత్రం ఐఏఎస్ అధికారి పృథ్వీతేజకు అవకాశం ఇచ్చారు. డైరెక్టర్లను అయితే జగన్ సీఎం అయిన వెంటనే నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఇందుకు విరుద్ధంగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో నియమితులైన డైరెక్టర్లను కూడా ఎంపిక ప్రక్రియలో భాగస్వాములను చేసింది. వీరిలో ఎక్కువ మందిని పాత వారినే కొనసాగిస్తున్నారని తెలిసింది. దీనిపై ఇంధన శాఖలో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అనుభవం పేరిట పాత వారిని కొనసాగించడం ఏమిటని ఇంధనరంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నియామకమైన వారిని కొనసాగించేందుకు వీల్లేదని చెబుతున్నారు. గతంలో డిస్కమ్‌ల సీఎండీలు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్తు పరికరాల కొనుగోళ్లలో చేతివాటం చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వాటి కారణంగానే విద్యుత్తు వినియోగదారులపై ట్రూఅప్ ఛార్జీల భారం మోయలేనంతగా పడిందన్న విమర్శలూ ఉన్నాయి.

కుప్పంలో ఉద్యానశాఖ ఏడీ కార్యాలయం

» కందుకూరు ఏడీహెచ్ యూనిట్ తరలింపు

అమరావతి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కందుకూరులోని ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీహెచ్ యూనిట్) ను చిత్తూరు జిల్లా కుప్పానికి తరలిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కందుకూరు ఏడీ పోస్టును కుప్పంకు బదిలీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ (జోనల్) పోస్టును పల్నాడు జిల్లా ఉద్యానశాఖ అధికారి కార్యాలయానికి, జూనియర్ అసిస్టెంట్ పోస్టును ప్రకాశం జిల్లా ఉద్యానశాఖ అధికారి కార్యాలయానికి బదిలీ చేసింది. గతంలో ప్రకాశం జిల్లాలో ఒంగోలు, కందుకూరులో ఉద్యానశాఖ ఏడీ కార్యాలయాలు ఉండేవి. జిల్లాల పునర్విభజన తర్వాత కందుకూరు ఏడీ నెల్లూరు జిల్లా ఉద్యాన అధికారి నియంత్రణలో పని చేస్తున్నారు. అయితే చిత్తూరుకు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం నియోజకవర్గంలో 37 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉండటం, భవిష్యత్ ఉద్యాన సాగు విస్తరించే అవకాశం ఉన్నందున అక్కడ మెరుగైన ఫలితాల కోసం ఉద్యానశాఖ డైరెక్టర్ ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉంది

» వివేకా హత్యకేసులో ఏ2 సునీల్ యాదవ్ ఆందోళన

» రక్షణ కల్పించాలని మరోసారి కడప ఎస్పీని కలిసి వినతి

కడప క్రైం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తనకు వైసీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-2 సునీల్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కడపలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వైసీపీకి చెందిన కొంతమంది నాయకుల వల్ల ప్రాణహాని ఉందని, తనకు గన్‌మెన్లను ఏర్పాటు చేయాలని ఎస్పీని కోరారు. హత్య సినిమాలో తన కుటుంబం మనోభావాలు దెబ్బతీసేలా చిత్రీకరించారంటూ సునీల్‌యాదవ్ గతంలో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడంతో పాటు రక్షణ కల్పించాలని కోరారు. అప్పటి నుంచి పోలీసులు సునీల్ యాదవ్ ఇంటి వద్ద పికెట్ ఏర్పాటు చేసి పోలీసు గస్తీ నిర్వహిస్తున్నారు. తాజాగా తనకు గన్‌మెన్లను ఇవ్వాలని ఎస్పీకి విన్నవించారు. కాగా.. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో ఏ-2 అయిన సునీల్ యాదవ్‌ను సీబీఐ 2021 అక్టోబరులో అరెస్టు చేసింది. కొంతకాలం కడప సెంట్రల్ జైలు అనంతరం హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయన ఈ ఏడాది జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చారు.

విశాఖలో టీసీఎస్‌కు భూమి కేటాయింపు

» 99 పైసల లీజుకు 21.16 ఎకరాలు

» ఉత్తర్వులు జారీ చేసిన ఐటీ శాఖ



అమరావతి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో కార్యకలాపాలు చేపట్టేందుకు దిగ్గజ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు మార్గం సుగమమైంది. ఇటీవల కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు వైజాగ్ ఐటీ హిల్స్‌లో ఆ కంపెనీకి 21.16 ఎకరాల భూమిని 99 పైసల లీజుకు కేటాయిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీసీఎస్ ప్రభావం రాష్ట్ర యువతపైనా, ఆర్థిక అభివృద్ధిపైనా స్పష్టంగా కనిపిస్తుందని ఐటీశాఖ పేర్కొంది. రాష్ట్రంలో డీప్‌టెక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పురోగతికి, ఐటీ రంగం బలోపేతానికి ఆ కంపెనీ దోహద పడుతుందని తెలిపింది. టాటా సంస్థ విశాఖలో రూ. 1,370 కోట్ల పెట్టుబడితో, 12,000 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ ప్రఖ్యాత ఐటీ సంస్థ పెట్టుబడుల ప్రతిపాదనతో ముందుకు రావడంతో.. 2025-26 పారిశ్రామిక ప్రోత్సాహక పాలసీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా భూమి కేటాయింపునకు ఐటీ శాఖ నిర్ణయం తీసుకుంది. విశాఖకు టీసీఎస్ రాకతో రాష్ట్రంలో ఐటీరంగం పరుగులు తీస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఐటీ పరిశ్రమకు 'యాంకర్'గా టీసీఎస్ పని చేస్తుందని, ఇక్కడకు మరిన్ని ఐటీ కంపెనీలు తరలి వస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.